ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

హైదరాబాద్

fb.com/vaartha Digital

Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

18-9-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 229 పేజీలు: 10+4 వెల: 6.50



భార్య హత్య కేసులో నిందితుడైన భర్త దారుణ హత్య 6

టాటా సన్స్ చైర్మన్‌గా మళ్లీ చంద్రశేఖరన్ వాణిజ్యంలో




గురువారం సికిందరాబాద్ పెరేడ్‌గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ విమోచన దినోత్సవంలో ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్, గవర్నర్ శుక్లా, కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, గజేంద్రసింగ్ షెకావత్, బండి సంజయ్



వేడుకల్లో ప్రసంగిస్తున్న ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్

## హైదరాబాద్ విలీనం

# ఒక గొప్ప చరిత్ర

**మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తి: ఉపరాష్ట్రపతి రాధాకృష్ణన్**

**హైదరాబాద్ - జోధ్‌పూర్ మధ్య విడదీయరాని బంధం: కేంద్రమంత్రి గజేంద్రసింగ్ షెకావత్**

నిజాంను సిఎం రేవంత్ పొగడడం సిగ్గుచేటు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

పెరేడ్‌గ్రౌండ్స్‌లో ఘనంగా తెలంగాణ విమోచన దినోత్సవం

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** మహనీయుల పోరాటాలు కొత్త తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ అన్నారు. 1947 ఆగస్టు 15 నుంచి జాతి నిర్మాణం కోసం పోరాటం మొదలైందని తెలిపారు. హైదరాబాద్ విముక్తి కోసం 1948లో ఆపరేషన్ పోలో చేపట్టారని, పోరాడిన యోధులకు నివాళులర్పిస్తున్నట్లు చెప్పారు. భారత్‌లో హైదరాబాద్ అంతర్భాగం కావడానికి మహనీయులు బలిదానాలు చేశారని స్మరించుకున్నారు. హైదరాబాద్ విముక్తిలో సర్దార్ వల్లభ్ భాయ్ పటేల్ కృషి ఎంతో ఉందని, అది బలమైన భారత్ నిర్మాణానికి దోహదం చేసిందన్నారు.సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని గురువారం కేంద్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించింది. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ హాజరయ్యారు. పోలీస్ అమరవీరుల స్మృతి స్థూపం వద్ద నివాళులర్పించి, జాతీయ జెండాను ఎగురవేశారు. అంతకు ముందు సాయుధ బలగాల నుంచి ఉపరాష్ట్రపతి గౌరవ వందనం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ గవర్నర్ శివప్రతాప్ శుక్లా, కేంద్ర

>>2

## 30 వేల ఎకరాల్లో

# నెట్‌జీరో స్మార్ట్‌సిటీ

**డిసెంబరులో జరిగే గ్లోబల్ సమ్మిట్‌లో ఫ్యూచర్‌సిటీ మాస్టర్‌ప్లాన్ ఆవిష్కరణ**

**కృష్ణానీటి వాటాకోసం న్యాయపోరాటం**

**కొత్తగా 2.25 లక్షల మందికి పింఛన్లు**

**రాష్ట్ర తలసరి ఆదాయం దేశసగటు కంటే 91% అధికం**

ప్రజాపాలనా దినోత్సవంలో సిఎం రేవంత్‌రెడ్డి





గురువారం ప్రజాపాలనా దినోత్సవంలో ప్రసంగిస్తున్న సిఎం రేవంత్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు17:** రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలకు అభివృద్ధి చేరడానికి నాలుగు కోట్ల ప్రజల భాగస్వామ్యంతో తెలంగాణను ప్రపంచం గర్వించే రాష్ట్రంగా తీర్చిదిద్దుకుందామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. తెలంగాణ పోరాట స్ఫూర్తితో ఆధునిక తెలంగాణను నిర్మించుకుందామని అన్నారు. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజాపాలన దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధికి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అభివృద్ధి అన్ని ప్రాంతాలకు చేరాలన్నదే ప్రజాప్రభుత్వ లక్ష్యంగా చెప్పారు. 'అభివృద్ధి, సంక్షేమంతో పాటు ఆత్మగౌరవం, స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం మా ప్రజా పాలనకు పునాదులు. సెప్టెంబర్ 17వ తేదీ మన బాధ్యతను కూడా గుర్తు చేసే రోజు. ఈ చారిత్రక నేపథ్యం, ఉద్యమాల ఫలాలు ప్రజల జీవితాల్లో కనిపించాలి. రైతుకు భరోసా ఉండాలి. మహిళలు ఆర్థికంగా ఎదగాలి. అట్టడుగు వర్గాలకు న్యాయం జరగాలి. పేద బిడ్డకు మంచి చదువు, మంచి వైద్యం అందాలి. యువతకు ప్రపంచంతో పోటీ పడే అవకాశాలు రావాలి' అని కోరారు. తరతరాల అణిచివేత, దోపిడీ, భూస్వామ్య, పెత్తందారీ విధానాలపై ధిక్కార స్వరం వినిపించిన నేల తెలంగాణ.

>>2


7.8 శాతంతో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పరిపుష్టం

సెమికాన్ ఇండియా-2026 కార్యక్రమంలో ప్రధాని మోడీ

భారత్‌పై పెరిగిన అంతర్జాతీయ విశ్వాసం 3




సెమికాన్ ఇండియా సదస్సులో ఇంజినీర్లతో ప్రధాని మోడీ


76వ వసంతంలోకి ప్రధాని మోడీ 5

సుదీర్ఘ పనిగంటలు, అలుపెరుగని ఉత్సాహం 'మోడీ స్పెషల్' కఠినమైన ఆహారపు అలవాట్లే ఆరోగ్య రహస్యం





5 రష్యా చమురు దిగుమతులపై చైనా, భారత్‌కు ట్రంప్ వార్నింగ్!


# 'లోగుట్టు' వెదికారు!



ఎర్రవెల్లిలో సర్వే కోసం వచ్చిన అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

**కెసిఆర్ ఫాంహౌస్ భూములపై రెవెన్యూ కసరత్తు**

**తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీవో రికార్డుల పరిశీలన**

**సర్వే నెం.325లో ప్రభుత్వ భూమికి హద్దులపై సర్వే**

**కెసిఆర్‌కు నోటీసులు ఇచ్చే యోచన?**

**మర్కుక్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్‌కు చెందిన ఎర్రవల్లి ఫాంహౌస్ పరిసర భూముల వ్యవహారంపై రెవెన్యూ అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు సమాచారం. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు సంబంధిత అధికారులు అప్రమత్తమై భూములకు సంబంధించిన రికార్డులు, పాత ఫైళ్లను పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో గురువారం గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ మర్కుక్ తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని కెసిఆర్ ఫాంహౌస్ భూములకు సంబంధించిన రెవెన్యూ రికార్డులను పరిశీలించినట్లు సమాచారం. ఫాంహౌస్ పరిసరాల్లోని భూముల వివరాలు, వాటి హద్దులకు సంబంధించిన రికార్డులను అధికారులు పరిశీలించినట్లు తెలిసింది. ఫాంహౌస్ పక్కనే ఉన్న సర్వే నెం.325లో సుమారు వందల ఎకరాల ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు గుర్తించి, ఈ భూమికి హద్దులను ఏర్పాటు చేసేందుకు సంబంధిత రెవెన్యూ అధికారులు, సర్వే సిబ్బంది గురువారం అక్కడికి చేరుకున్నారు. భూముల విస్తీర్ణం, హద్దులు, రికార్డులో నమోదైన వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించే ప్రక్రియ ప్రారంభించారు.

**అధికారులను నిలదీసిన గ్రామస్తులు**

ఎర్రవల్లికి చెందిన కొందరు వ్యక్తులు తమ భూముల్లో ఎందుకు సర్వే నిర్వహిస్తున్నారని అధికారులను ప్రశ్నించినట్లు తెలిసింది. తమ భూములకు సంబంధించిన వివరాలను స్పష్టంగా తెలియజేయాలని వారు కోరినట్లు సమాచారం. దీంతో అక్కడ కొద్దిసేపు సందిగ్ధ పరిస్థితి నెలకొంది.

>>2



**నేడు హైదరాబాద్‌లో దక్షిణాది వ్యవసాయ**

## మంత్రుల సదస్సు

**పాల్గొననున్న కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్**

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ అధ్వర్యంలో దక్షిణ రాష్ట్రాల వ్యవసాయ, అనుబంధ రంగాల సదస్సు శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ సదస్సులో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి రాష్ట్రాల మంత్రులు, ఉన్నతాధికారులతో పాటు,

>>2

## 'సుప్రీం' సిట్టింగ్ జడ్జితో

# విచారణకు సిద్ధమా?



గురువారం తెలంగాణ భవన్‌లో మీడియాతో కెటిఆర్

**కెసిఆర్, రేవంత్ ఇద్దరి ఆస్తులపైనా విచారణ జరిపితే నిజాలు తెలుస్తాయి..**

**సిఎం సొంత సిట్‌లు, సెట్‌లు ఎందుకు?**

**రేవంత్‌కు దమ్ముంటే సవాల్ స్వీకరించాలి: కెటిఆర్**

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ పుట్టిన 1954 నుంచి నేటి వరకు, అదేవిధంగా సీఎం రేవంత్ రెడ్డి పుట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఇరు కుటుంబాల ఆస్తులపై హైకోర్టు లేదా సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణకు తాము సిద్ధంగా ఉన్నామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టంచేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఈ సవాల్‌ను స్వీకరించి వెంటనే సిట్టింగ్ జడ్జితో విచారణకు ముందుకు రావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. సెప్టెంబర్ 17 జాతీయ సమైక్యతా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ జాతీయ జెండాను ఎగురవేశారు. రాష్ట్ర ప్రజలకు సమైక్యతా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు.తమకు న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని, కేసీఆర్‌పై రేవంత్ ప్రభుత్వం ఏర్పాటు చేసే సొంత సిట్‌లు, సెట్‌లు కాకుండా సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. గతంలో వెయ్యి సార్లు 1000 ఎకరాల ఫామ్‌హౌస్ అని కంపు నోటితో వాగిన రేవంత్ రెడ్డి, నిన్న అసెంబ్లీలో 67 ఎకరాలని స్వయంగా అంగీకరించారని, మిగిలిన 933ఎకరాలు ఎక్కడున్నాయో చూపిస్తే వాటిని ప్రభుత్వానికే రాసి స్తామని స్పష్టంచేశారు. కేసీఆర్ తనఎన్నికల అఫిడవిట్లలోనే ఈ భూముల వివరాలను వెల్లడించారని, ఆదాయపు పన్ను, స్టాంప్ డ్యూటీ చెల్లించి రిజిస్ట్రేషన్ చేసుకున్న

>>2

## తెలంగాణ చేతిలో మరో

# అరుదైన వజ్రం



**విలువ రూ.2.50 కోట్లు!**

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వ ఆధ్వర్యంలోని రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ (ఎన్ఎండీసీ) కి అరుదైన వజ్రం లభించింది. మధ్యప్రదేశ్‌లోని పన్నా వజ్రాల గనిలో 27.29 క్యారెట్ల విలువైన వజ్రాన్ని సంస్థ సిబ్బంది వెలికితీశారు. పన్నా గని కార్యకలాపాలు ప్రారంభమైనప్పటి నుంచి అక్కడ లభించిన వజ్రాల్లో ఇది రెండో అతిపెద్దదని ఎన్ఎండీసీ వెల్లడించింది. ఈ వజ్రం ఆకారం, రంగు, స్వచ్ఛత, క్యారెట్ బరువు ఆధారంగా ప్రారంభ వేలం ధరను సుమారు రూ.1 కోట్లుగా నిర్ణయించే అవకాశం ఉందని తెలిపింది. వేలం అనంతరం రూ.2 కోట్ల నుంచి రూ.2.5 కోట్ల వరకు ధర పలికే అవకాశం ఉందని పేర్కొంది. ఈ వజ్రంలభించడం సంస్థకు గర్వకారణమని ఎన్ఎండీసీ సీఎండీ అమితవ ముఖర్జీ గురువారం మీడియాకు తెలిపారు.ఈ గనిలో గతంలోనే 34.37 క్యారెట్లజెమ్ క్వాలిటీ డైమండ్ లభ్యమైందన్నారు.2010లోఅతిపెద్ద వజ్రం వెలికితీయగా, ఆ తర్వాత నిర్వహించిన వేలంలో రూ.3.2 కోట్లకు విక్రయమైందని వెల్లడించారు. తాజాగా లభించిన 27.29 క్యారెట్ల వజ్రం పరిమాణంలో ఆ రికార్డుకు తర్వాత స్థానంలో నిలిచిందన్నారు. తమ బృందాల కృషికి ఇది నిదర్శనమని, దేశంలోని ఖనిజ వనరుల్లో ఉన్న సామర్థ్యాన్ని ఈ వజ్రం వెలికితీత ఘటన మరోసారి చాటిందని పేర్కొన్నారు.



5 లక్షలు లంచం!

ఎసిబికి చిక్కిన సిఐ ఆంజనేయులు,ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి

## ఎసిబి వలలో కీసర

# సిఐ,ఎస్ఐ

**రేషన్ బియ్యం కేసులో రూ.10 లక్షలు ఇవ్వాలని డిమాండ్**

**కీసర, సెప్టెంబరు17, ప్రభాతవార్త:** స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి రూ 10 లక్షలు డిమాండ్ చేసిన కీసర సీఐ అర్కపల్లి ఆంజనేయులు,ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డిలు రూ 5 లక్షలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు అడ్డంగా దొరికారు.ఏసీబీ మాజిద్ అలీఖాన్

>>2

## రెండు సెషన్లలో

# జెఇఇ మెయిన్స్

**జనవరి 22 నుంచి తొలివిడత పరీక్షలు**





**షెడ్యూల్ విడుదల చేసిన ఎన్‌టిఎ**

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** దేశవ్యాప్తంగా ఉన్న ఇంజినీరింగ్ కళాశాలల్లో ప్రవేశాల నిమిత్తం నిర్వహించే జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ (జెఇఇ) మెయిన్-2027 షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) విడుదల చేసింది. విద్యార్థుల సౌలభ్యం కోసం పరీక్షల తేదీలను ముందుస్తుగానే ప్రకటించింది. వచ్చే యేడాది కూడా ఈ పరీక్షలను రెండు విడతల్లో నిర్వహించనున్నట్లు ఎన్‌టిఎ స్పష్టం చేసింది. జెఇఇ మెయిన్-2027 మొదటి విడత పరీక్షలు జనవరి 22, 23, 24, 28, 29, 30 తేదీల్లో జరగనున్నాయి. జనవరి 31ని బఫర్ తేదీగా (అదనపు తేదీగా) కేటాయించారు. ఏప్రిల్ నెలలో నిర్వహించే రెండో విడత పరీక్షా తేదీలను ఎన్‌టిఎ ఇంకా ప్రకటించాల్సి ఉంది. ఈ పరీక్షలకు సంబంధించిన రిజిస్ట్రేషన్ ప్రక్రియ 2026 అక్టోబర్ నెలలో ప్రారంభం కానుంది. జెఇఇ మెయిన్‌తో పాటు మరి కొన్ని కీలక పరీక్షల తేదీలను కూడా ఎన్‌టిఎ వెల్లడించింది.

>>2

## 2 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు

# కసరత్తు

**మళ్లీ ఓట్ల నమోదు, ఓటర్ల జాబితా షెడ్యూల్ విడుదల**



**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** తెలంగాణలో రెండు గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు మొదలైంది. 2027 మార్చిలో రెండు ఎమ్మెల్సీ స్థానాలు ఖాళీ కానున్నాయి. మహబూబ్‌నగర్-రంగారెడ్డి-హైదరాబాద్ ఎమ్మెల్సీ స్థానంతోపాటు, వరంగల్-ఖమ్మం-నల్గొండ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఓటర్ల జాబితా రూపకల్పనకు ప్రక్రియ ప్రారంభమైంది. ఈమేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. సెప్టెంబర్ 28 నుంచి ఫారం18 దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ మొదలు కానుంది. నవంబర్ 6 వరకు ఈ దరఖాస్తులను స్వీకరించనున్నారు.ఫారం18 దరఖాస్తుల స్వీకరణ పూర్తైన తర్వాత ఓటర్ల జాబితా తయారీ ప్రక్రియ

>>2



గురువారం మోడీ పుట్టినరోజు సందర్భంగా ఉజ్జయినిలో 30 లక్షలకుపైగా దీపాలు వెలిగించిన అభిమానులు

## 'సుప్రీం' సిట్టింగ్ జడ్జితో విచారణకు సిద్ధమా?

>> వ్యవసాయ భూమి అని స్పష్టం చేశారు. ఇంతకాలం వాటిపై తప్పుడు ప్రచారం చేసి బురదజల్లినందుకు రేవంత్ రెడ్డి కేసీఆర్‌కి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలన్నీ ముమ్మాటికీ బోగస్ అని వెయ్యి రోజుల విఫల పాలన చూసిన తరువాత తేలిపోయిందని అన్నారు. వీటిపై నిలదీస్తామన్న భయంతోనే ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్‌ను సభ నుంచి సస్పెండ్ చేశారని మండిపడ్డారు. సభలో ప్రధాన ప్రతిపక్షాన్ని లేకుండా చేసి బీజేపీతో కుమ్మక్కై రేవంత్ రెడ్డి అసెంబ్లీని ఏకపక్షంగా నడిపించుకుంటున్నారని మండిపడ్డారు.

తన కళ్లల్లో కళ్లు పెట్టి చూసే ధైర్యం ప్రతిపక్షానికి లేదని ప్రగల్భాలు పలికిన రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నా.. ధైర్యముంటే శాసనసభ సమావేశాలను నెల రోజుల పాటు పొడిగించి, మాపై పెట్టిన అక్రమ సస్పెన్షన్లను ఎత్తివేయండి, కళ్లల్లో కళ్లు పెట్టి చూడటం కాదు, 420 హామీల మోసంపై తెలంగాణ ప్రజల పక్షాన మీ కాలర్ పట్టుకుని నిలదీస్తాం అని కేటీఆర్ హెచ్చరించారు. సిఎం రేవంత్ రెడ్డి శాసనసభ పవిత్రతను భయంకరంగా దుర్వినియోగం చేస్తూ ఆ వ్యవస్థకు, ముఖ్యమంత్రి పదవికే తీవ్ర కళంకం తెస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీలో ఆయన వ్యవహార శైలి తలా తోకా లేకుండా సాగిందని, రెండున్నర గంటల పాటు ఏం మాట్లాడారో, ఏం మొత్తుకున్నారో ఎవరికీ అర్థం కాలేదని ఎద్దేవా చేశారు. ఆ అజ్ఞాన ప్రదర్శన సమయంలో సభలో తాము లేకపోవడం ఒక రకంగా తమ అదృష్టమని పేర్కొన్నారు. కేసీఆర్‌ను చూసి తాను కూడా నాలుగు పద్యాలు, కొటేషన్లు, పెద్దల పేర్లు చెబితే గొప్ప నాయకుడిని అయిపోతానని శ్రీశ్రీ పేరును ప్రస్తావించారు తప్ప, ఆ మహానుభావుడి పూర్తి పేరు కూడా రేవంత్ రెడ్డికి తెలియదని, తన అపారమైన అజ్ఞానాన్ని, తెలివితక్కువతనాన్ని ముఖ్యమంత్రి మరోసారి సభాముఖంగా నిరూపించుకున్నారని ధ్వజమెత్తారు. గతంలో పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు ప్రగతి భవన్‌లో 150 బెడ్‌రూమ్‌లు ఉన్నాయని, బంగారు బాత్‌రూమ్‌లు కట్టారని, కొత్త సెక్రటేరియట్ కింద నుంచి సొరంగం తవ్వుకుని లంకెబిందెలు తరలిస్తున్నారని చేసిన చిల్లర ప్రచారంలో ఎంత వాస్తవముందో, శాసనసభలో ఆయన మాట్లాడిన మాటల్లోనూ అంతే నిజముందని కేటీఆర్ కొట్టిపారేశారు. సిరిసిల్ల పట్టణంలో నిరుపేదలకు, కార్మికులకు దశాబ్దాల క్రితం ఇచ్చిన భూములను కాంగ్రెస్ ప్రభుత్వం కబ్జా భూములుగా చిత్రీకరించడం అత్యంత దుర్మార్గమని కేటీఆర్ ధ్వజమెత్తారు. సిరిసిల్ల సగం పట్టణం ఒకనాటి రాయిని చెరువు భూముల్లోనే విస్తరించి ఉందని, కమ్యూనిస్టుల కాలంలో సీహెచ్ రాజేశ్వరరావు తదితర నాయకులు చెరువు ఎండిపోతే అందులోనే పేదలకు, కార్మికులకు 60, 70 గజాల చొప్పున ప్లాట్లు చేసి పట్టాలు పంచి ఇచ్చారని గుర్తుచేశారు. స్వయంపాలనలో బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక జీవో 58, 59 కింద ఆ పేదల స్థలాలను రెగ్యులరైజ్ చేసి పట్టాలు ఇస్తే, దాన్ని నేడు ముఖ్యమంత్రి కబ్జా అని మాట్లాడటం సిగ్గుచేటన్నారు. అలాగే సిరిసిల్ల పట్టణం పక్కనే ఉన్న పెద్దూరు, సర్దాపూర్, బాలాజీ కాలనీ, జగ్గారావుపల్లి వంటి ప్రాంతాల్లో రికార్డుల ప్రకారం 90 శాతం ప్రభుత్వ భూములే ఉన్నప్పటికీ, పట్టణం విస్తరించిన క్రమంలో దశాబ్దాల నుంచి ప్రజలు ఇళ్లు కట్టుకుని సాగు చేసుకుంటున్నారని, వాటన్నింటినీ కబ్జాలని ముద్రవేయడం హాస్యాస్పదమన్నారు. వీర్నపల్లి మండలం రంగంపేటలో గిరిజన రైతులకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం అటవీ హక్కుల కింద పోడు పట్టాలు పంపిణీ చేస్తే, అవగాహన లేని కొందరు ఇచ్చిన తప్పుడు సమాచారంతో సీఎం ఆ పోడు భూములను సైతం కబ్జాలుగా అసెంబ్లీలో మాట్లాడటం ఆయన అజ్ఞానానికి నిదర్శనమన్నారు.

టెస్కాబ్ మాజీ అధ్యక్షుడు కొండూరు రవీందర్ రావు, ధరణి వచ్చాక తాను ఒక్క గజం కొన్నట్లు నిరూపించినా ఏ శిక్షకైనా సిద్ధమని స్పష్టం చేశారని గుర్తుచేశారు. "రేవంత్ రెడ్డి.. ఈ నెలాఖరుకు సిరిసిల్లకు వస్తానంటున్నావు కదా, దమ్ముంటే సిరిసిల్లలో 8,000 ఎకరాలు ఎక్కడ ఉన్నాయో, ఏ సర్వే నంబరో, ఏ ఊరో, ఎవరు కబ్జా చేశారో సమగ్ర వివరాలతో ఒక అధికారిక శ్వేతపత్రం విడుదల చేయ్" అని కేటీఆర్ సవాల్ విసిరారు. సిరిసిల్ల ప్రాంతంలో రాజకీయ కక్షసాధింపులకు పాల్పడుతూ, బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త అబ్బాడి అనిల్ రెడ్డిని వేధించడమే కాకుండా, ఆయన దొరకలేదని గుండెజబ్బుతో బాధపడుతున్న ఆయన బాబాయ్ అబ్బాడి రాజిరెడ్డిని 14 రోజుల పాటు అక్రమంగా జైల్లో పెట్టించారని మండిపడ్డారు. అలాగే మాజీ నక్సలైట్, జిల్లా పార్టీ అధ్యక్షుడైన బలహీన వర్గాల బిడ్డ తోట ఆగయ్యకు 1999లో లొంగిపోయిన తర్వాత 2000 సంవత్సరంలో నాటి ప్రభుత్వం పునరావాసం కింద ఇచ్చిన 3.5 ఎకరాల భూమిని రేవంత్ ప్రభుత్వం కక్షపూరితంగా లాక్కుందని మండిపడ్డారు. 2007లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే డాక్యుమెంట్ నంబర్ 7289 ద్వారా బొల్లి రామ్మోహన్ కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకున్న భూమిని సైతం నేడు కబ్జా అని అవాకులు చెవాకులు పేలుతున్నారని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజా సమస్యలను పక్కనపెట్టి కేవలం 30 శాతం కమీషన్లు దండుకోవడానికే ప్రభుత్వం 22(ఎ) నిషేధిత జాబితా అనే దుర్మార్గమైన వ్యవస్థను తీసుకొచ్చిందని కేటీఆర్ ధ్వజమెత్తారు.

కోటి ఎకరాల నిషేధిత భూముల్లో 30 లక్షల ఎకరాల ప్రైవేట్ భూములున్నాయని స్వయంగా సీఎం ఒప్పుకున్నారని, తప్పు ప్రభుత్వం చేసి సామాన్య ప్రజలను నిరూపించుకోమనడం వెనుక భారీ వసూళ్ల దందా దాగి ఉందని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లోని తన ప్యాలెస్ 22(ఎ) లో పెడితే రాత్రికి రాత్రే తన ఆస్తిని నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్న ముఖ్యమంత్రి, సాధారణ ప్రజల భూములను ఎందుకు తొలగించడం లేదని నిలదీశారు. ముఖ్యమంత్రికి, సామాన్య ప్రజలకు వేర్వేరు చట్టాలు ఉండవని మండిపడ్డారు. మాజీ మంత్రులు హరీష్ రావు, జగదీష్ రెడ్డి, గంగుల కమలాకర్, ఎర్రబెల్లి దయాకర్ రావు, ఎమ్మెల్సీ నవీన్ రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, సుధీర్ రెడ్డిలు ఎన్నికల అఫిడవిట్లలో చట్టబద్ధంగా చూపించిన ఆస్తులపై అసత్య ఆరోపణలు చేస్తూ సీఎం చిల్లర రాజకీయాలకు పాల్పడ్డారని విమర్శించారు.

## 'లోగుట్టు' వెదికారు!

>> కెసిఆర్ ఫాంహౌస్ పరిసరాల్లో సుమారు 385 ఎకరాల అసైన్డ్, ఇతర భూములు ఉన్నాయన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల నేపథ్యంలో రెవెన్యూ అధికారులు ఈ వ్యవహారంపై దృష్టి సారించినట్లు తెలుస్తుంది.

భూములకు సంబంధించిన రికార్డులు, పట్టాలు, అసైన్డ్ భూముల వివరాలు, హద్దులను పరిశీలించారు. ఫాంహౌస్ భూముల వ్యవహారంలో మాజీ సిఎం కెసిఆర్‌కు నోటీసులు జారీ చేసే అంశాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలిస్తున్నట్లు సమాచారం. రికార్డుల పరిశీలన, క్షేత్రస్థాయి సర్వే పూర్తయిన అనంతరం తదుపరి చర్యలపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## రెండు సెషన్లలో జెఇఇ మెయిన్స్

>> దీని ప్రకారం, యుజిసి నెట్ పరీక్షను 2026 డిసెంబర్ 14 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించనున్నారు. డిసెంబర్ 20-21 తేదీ లను బఫర్ తేదీలుగా నిర్ణయించారు. కామన్ మేనేజ్‌మెంట్ అడ్మిషన్ టెస్ట్ (సిఎంఎటి) పరీక్ష 2027 ఫిబ్రవరి 7న జరుగుతుంది. అలాగే, కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్ట్-2027 పరీక్షలను మార్చి 1 నుంచి 5, 8, 12 నుంచి 20, 24, 25 తేదీల్లో జరపనున్నట్లు తెలిపింది. పరీక్షల తేదీలను ముందుగానే ప్రకటించడం వల్ల విద్యార్థులు తమ సన్నద్ధతను మరింత ప్రణాళికాబద్ధంగా కొనసాగించేందుకు వీలవుతుంది.

## 2 గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలకు కసరత్తు

>> కొనసాగుతుంది. నవంబర్ 20వ తేదీన ముసాయిదా ఓటర్ల జాబితా ముద్రణ పూర్తి చేసి.. నవంబర్ 25వ తేదీన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. అదే రోజు నుంచి డిసెంబర్ 10వ తేదీ వరకు ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాలు స్వీకరించనున్నారు. అందిన అభ్యంతరాలు, క్లెయిమ్‌లను పరిశీలించి డిసెంబర్ 25వ తేదీ నాటికి పరిష్కరించనున్నారు. ఆ తర్వాత అన్ని ప్రక్రియలు పూర్తిచేసి డిసెంబర్ 30వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఇప్పటికే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటరుగా నమోదైన పాత ఓటర్లు కూడా ఈసారి కొత్తగా ఫారం18 దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుంది. గతంలో ఓటరుగా నమోదయ్యామని భావించి ఈసారి దరఖాస్తు చేయకుండా ఉండకూడదని అధికారులు సూచించారు. ఫారం18తో పాటు విద్యార్హతకు సంబంధించిన అవసరమైన ధ్రువపత్రాలు, సర్టిఫికెట్ల ధ్రువీకరించిన కాపీలను సమర్పించాల్సి ఉంటుంది. గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ నియోజకవర్గంలో ఓటరుగా నమోదు కావాలంటే ఎన్నికల నిబంధనల ప్రకారం సంబంధిత నియోజక వర్గంలో సాధారణ నివాసిగా ఉండటంతో పాటు, నిర్ణయించిన అర్హత తేదీకి ముందు కనీసం 3 ఏళ్లుగా గుర్తింపు పొందిన యూనివర్సిటీ, ఇతర గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ లేదా దానికి సమానమైన విద్యార్హత కలిగి ఉండాలి. అర్హత కలిగిన పట్టభద్రులు తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి(సీఈవో తెలంగాణ) అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది.

## వారం - వర్జ్యం

**18-09-2026, శుక్రవారం**
**శ్రీ పరాభవ నామ సంవత్సరం, భాద్రపద మాసం, దక్షిణాయణం, వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,**
తి.సప్తమి మ.1.02, న.జ్యేష్ఠ రా.10.45
వ.లేదు
దు.ఉ.8.21 - ఉ.9.10
2) మ.12.25 - మ.1.14
రాహు.ఉ.10.30 - మ.12.00
శుభ స. ఉ.10.00 - ఉ.11.00

## వార్తాఫలం

**మేషం :** ఇతరులకు మీరు ఇచ్చిన వాగ్దానాన్ని నిలుపుకుంటారు. సభలు, సమావేశాలకు హాజరవుతారు.

**వృషభం :** మీ శక్తి సామర్థ్యాలు గుర్తింపదగినవిగా ఉంటాయి. మీకు తోచిందే చేస్తారు. లీజులు, లైసెన్సులు పొడిగింపబడతాయి.

**మిథునం :** ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం లభిస్తుంది. ఏ విధంగా సాగుతాయో అనుకున్న పనులు లాభించే విధంగా సానుకూల పడతాయి.

**కర్కాటకం :** ఇచ్చిపుచ్చుకోవడంలో జాగ్రత్తలు అవసరం. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. స్వల్ప ధనలాభ సూచన.

**సింహం :** ఊహించుకున్న విధంగా కాకపోయినా ఆర్థిక వ్యవహారాలు ఊరటను కలిగించే విధంగానే ఉంటాయి.

**కన్య :** స్వయం కృతాపరాధాలు చోటు చేసుకుంటాయి. ఆత్మీయ వర్గ సహాయ సహకారాలు లభిస్తాయి.

**తుల :** అన్యభాషలు నేర్చుకోవాలనుకునే మీ కోరిక నెరవేరే సూచనలు గోచరిస్తున్నాయి. మీ ప్రతిభాపాటవాలు వెలుగుచూస్తాయి.

**వృశ్చికం :** అసహనాన్ని ఏమాత్రం దరిచేరనీయరు. విదేశీయాన వ్యవహారాలలో ఏర్పడిన సాంకేతిక లోపాలు సద్దుమణుగుతాయి.

**ధనుస్సు :** మీ శక్తికి మించిన కార్యక్రమాలు నిర్వహించ వలసి వస్తుంది. స్థిరాస్తి వ్యవహారాలు సానుకూల పడతాయి.

**మకరం :** జీవితాశయం నెరవేర్చుకునే విధంగా కొన్నిఅంశాలు మీకు అనుకూలిస్తాయి. ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉండాలనుకుంటారు.

**కుంభం :** నిజమైన శ్రేయోభిలాషులు ఎవరన్నది తెలుసుకొన గలుగుతారు. ఇతరుల నుండి వాగ్ధానాలను తీసుకుంటారు.

**మీనం :** వ్యాపారస్తులకు మధ్యస్తంగా ఉంటుంది. అసత్యమైన ఆరోపణలను త్రిప్పి కొట్టగలుగుతారు. అధికంగా శ్రమిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



గురువారం పెరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన తెలంగాణ విమోచన దినోత్సవంలో కళాకారుల పేరిణి నృత్యం

# ఒక గొప్ప చరిత్ర

>> మంత్రులు గజేంద్ర సింగ్ షెకావత్, కిషన్‌రెడ్డి, బండి సంజయ్ ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ సంస్కృతి మీద పాట రూపంలో అద్భుతమైన కార్యక్రమం నిర్వహించారు. నృత్య రూప ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది. హైదరాబాద్-జోద్‌పూర్‌కు మధ్య విడదీయరాని బంధం ఉందని కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ అన్నారు. తాను జోద్‌పూర్ ప్రతినిధిగా ఇక్కడికి వచ్చానని, ఇక్కడ నిజాంకు వ్యతిరేకంగా అనేక మంది యోధులు పోరాటం చేశారన్నారు. స్వాతంత్ర్యం, స్వేచ్ఛ కోసం ఎంతో పోరాటం చేసి తెలంగాణను భారత్‌లో కలిపేందుకు కృషి చేశారన్నారు. అప్పట్లో నిజాంకు వ్యతిరేకంగా ఎంతో మంది వీరులు పోరాటం చేశారని గుర్తు చేశారు.

**సిఎం రేవంత్‌రెడ్డి నిజాంను పొగడటం సిగ్గు చేటు: కిషన్‌రెడ్డి**

తెలంగాణ విమోచన దినోత్సవ వెడుకలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రసంగిస్తూ నిజాం అద్భుత పాలన చేశాడన్న సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యల పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్న వేళ అసెంబ్లీలో సీఎం వ్యాఖ్యలు శోచనీయమని నిప్పులు చెరిగారు. నిజాం అంత మంచొడైతే వందేమాతరం రాంచందర్‌రావు, భాగ్యరెడ్డి వర్మ, బండి యాదగిరి, కోదాటి నారాయణ రావు, రాంజీగోండు, సురవరం ప్రతాపరెడ్డి, మాడపాటి హనుమంతరావు, బూర్గుల రామకృష్ణారావు, రావి నారాయణ రెడ్డి, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమురయ్య, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల రాంచంద్రారెడ్డి, ఆరుట్ల లక్ష్మినరసింహారెడ్డి, ముఖ్దుం మొహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి, ప్రభాకర్‌రావు, కుమురం భీం, బొమ్మగాని ధర్మభిక్షం గౌడ్, సుద్దాల హనుమంతు, నారాయణరావు పవార్ వంటి యోధులు ఎందుకు పోరాటం చేశారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలన్నారు. నిజాం మీద భారత ఆర్మీ ఎందుకు యుద్ధం చేసిందో చెప్పాలని అన్నారు. రాజకీయాలు, అధికారం కోసం ఎంతకైనా దిగజారుతామనే విధంగా రాష్ట్ర ప్రభుత్వ పాలన ఉందని విమర్శించారు. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి నిజాం గొప్ప వాడని పొగుడుతున్నారని,

ఇలాంటి వారి డీఎన్ఏను పరీక్షి ంచాలని కేంద్రమంత్రి బండి సంజయ్ విమర్శించారు. తెలంగాణ చరిత్రను తెరమరుగు చేసే ప్రయత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ చరిత్రను భావితరాలకు తెలియజెప్పే విధంగా ప్రధాని నరేంద్ర మోదీ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నారని చెప్పారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అవినీతి, ఆరోపణలు లేకుండా పాలన చేస్తుందని వివరించారు. తెలంగాణలో మార్పు కోసం రాష్ట్ర ప్రజలు ఆలోచించాలన్నారు. 13నెలలు ఆలస్యంగా తెలంగాణ గడ్డకు స్వాతంత్ర్యం వచ్చిందన్న బండి సంజయ్, రాష్ట్ర ప్రజలపైన జరిగిన మారణకాండను పాలకులు 80 ఏళ్లుగా తొక్కి పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. మజ్లీస్‌కు భయపడి, ఓటు బ్యాంకు రాజకీయాల కోసం రజాకార్ల దౌర్జన్యాలను దాచి పెట్టారని అన్నారు. రజాకార్ల సంస్థ 1940లో ప్రారంభించి హిందువులు, దేవాలయాలపై దాడులు చేశారని తెలిపారు. తెలుగు అనాగరిక భాష అని నిషేధించి పరభాష అయిన ఉర్దూను మన మీద రుద్దారని మండిపడ్డారు.

నిజాం పోయిన ఆయన వారసత్వమైన మజ్లీస్ పార్టీ అరాచకాలు సృష్టిస్తోందని బండి సంజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 1980 నుంచి తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ డిమాండ్ చేస్తూ వస్తుందన్నారు.

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఐదేళ్లుగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను అధికారికంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. 2029లో బీజేపీ ప్రభుత్వ ఆధ్యర్యంలో తెలంగాణలో ప్రతి గ్రామ గ్రామాన అధికారికంగా తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహిస్తామని స్పష్టం చేశారు.



ప్రధాని మోడీ పుట్టినరోజు సందర్భంగా గురువారం కాశీ విశ్వనాథునికి ప్రత్యేక పూజలు చేస్తున్న రక్షణ మంత్రి రాజ్‌నాథ్, కేంద్ర మంత్రి చిరాగ్ పాశ్వాన్, యుపి, ఎపి సిఎంలు యోగి ఆదిత్యనాథ్, చంద్రబాబు

## నేడు హైదరాబాద్‌లో దక్షిణాది వ్యవసాయ మంత్రుల సదస్సు

>> కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ ఉన్నతాధికారులు పాల్గొననున్నారు. ఉదయం 9.30 గంటలకు ప్రారంభోత్సవ సమావేశంతో కార్యక్రమం మొదలవును. 10.40 గంటలకు ప్రారంభమయ్యే సమీక్షా సమావేశంలో డిజిటల్ అగ్రికల్చర్ మిషన్, రైతు రిజిస్ట్రీ, ఎరువుల యాప్ పురోగతిని కేంద్ర అదనపు కార్యదర్శి డాక్టర్ ప్రమోద్ కుమార్ మెహెర్దా సమీక్షించనున్నారు. అనంతరం రైతు కేంద్రీకృత విస్తరణ వ్యవస్థ అయిన రైతు నేస్తం కార్యక్రమంపై తెలంగాణ ప్రభుత్వం ప్రజంటేషన్ ఇవ్వనుండగా, వాతావరణ మార్పులను ఎదుర్కొనే విధానంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వివరణ అందించనుంది.

ఈ సదస్సులో ఐసీఏఆర్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ మంగీ లాల్ జాట్, కేంద్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి అతిష్ చంద్ర చర్చల సారాంశాన్ని వెల్లడించనున్నారు. అనంతరం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, తమిళనాడు, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల వ్యవసాయ, ఉద్యాన శాఖ మంత్రులు ప్రసంగించనున్నారు. కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రులు రామ్‌నాథ్ ఠాకూర్, భగీరథ్ చౌదరి కూడా సభను ఉద్దేశించి మాట్లాడనున్నారు. కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ముగింపు ప్రసంగంతో సదస్సు ముగియనుంది. అనంతరం సంయుక్త కార్యదర్శి సంజయ్ కుమార్ అగర్వాల్ కృతజ్ఞతలు తెలుపనున్నారు.

కార్యక్రమం అనంతరం కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మీడియా సమావేశంలో పాల్గొననున్నారు. ఈ సదస్సులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలంగాణ ప్రభుత్వం గత రెండేళ్లలో చేపట్టిన రైతు సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్ర రైతులకు అవసరమైన వివిధ అంశాలను ప్రస్తావించనున్నారు.

## ఎసిబి వలలో కీసర సిఐ, ఎస్ఐ

>> తెలిపిన వివరాల ప్రకారం ఆగస్టు 31న కీసర సర్కిల్ పరిధిలోని అహ్మద్‌గూడలో సయ్యద్ ఇర్షాద్ అనే వ్యక్తి లారీలో 650 కిలోల రేషన్ బియ్యం తరలిస్తుండగా పట్టుబడ్డాడు. సివిల్ సప్లై అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కీసర పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రేషన్ బియ్యం కేసులో సయ్యద్ ఇర్షాద్‌కు 41 సీఆర్‌పీసీ నోటీసు ఇవ్వకుండా కేసు విషయంలో ఎలాంటి వేధింపులకు గురి చేయకుండా ఉండేందుకు రూ 10 లక్షలు డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు. సీఐ ఆంజనేయులు 10 లక్షలు లంచం ఇవ్వకుంటే కేసును తారుమారు చేస్తానని బెదిరించాడని బాధితుడు తెలిపారు. పోలీసులు 10 లక్షలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేయడమే కాకుండా బిర్యానీలు, కూల్‌డ్రింక్‌లు తీసుకురావాలి అని తనను వేధింపులకు గురిచేయడంతో సయ్యద్ ఇర్షాద్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. బుదవారం రాత్రి నాగారం డివిజన్ పరిధిలోని రాంపల్లి చెరువు వద్ద గణేష్ నిమజ్జనాల విధుల్లో ఉన్న ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి కారులో కూర్చొని నిందితుడి నుంచి 5 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. లంచం సొమ్ము రూ 5 లక్షలు కారు నుంచే స్వాదీనం చేసుకున్నారు. ఈ కేసులో ఇప్పటికే రూ 3.50 లక్షలు తీసుకున్నట్లు విచారణలో తేలిందని డీఎస్పి తెలిపారు. ఏసీబీకి పట్టుబడ్డ ఎస్ఐ జ్ఞానేందర్‌రెడ్డి కెమికల్ పరీక్షలకు సహకరించకుండా ఏసీబీ అధికారులను ముప్పుతిప్పలు పెట్టాడు. ఏసీబీ అధికారులను చూసి ఎస్ఐ కారు చుట్టూ చక్కర్లు కొట్టాడు. ఈ కేసులో సీఐ ఆంజనేయులు పాత్ర కూడా ఉన్నట్లు విచారణలో తెలియడంతో ఏసీబీ అధికారులు ఇద్దరిని అదుపులోకి తీసుకొని కీసర పోలీస్‌స్టేషన్‌కి తీసుకువచ్చి విచారించారు. హబ్సిగూడలో సీఐ, బోడుప్పల్‌లో ఎస్ఐ ఇళ్లల్లో ఒకేసారి ఏసీబీ అధికారులు సోదాలు జరిపారు. సీఐ ఆంజనేయులు ఇంట్లో రూ 5 లక్షలు, ఎస్ జ్ఞానేందర్‌రెడ్డి ఇంట్లో రూ 10 లక్షలు, కొన్ని కీలక డాక్యుమెంట్లు లభించాయి. గురువారం సాయంత్రం సీఐ, ఎస్ఐలను కోర్టులో ప్రవేశపెట్టారు. కాగా రేషన్ బియ్యం కేసు విషయంలో లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సీఐ, ఎస్ఐలు వివిద కేసుల్లో వేధింపులకు గురి అయిన బాధితులు గురువారం కీసర పోలీస్‌స్టేషన్ ముందు టాపాకాయలు కాల్చి సంబరాలు చేసుకున్నారు. కాగా కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో గత కొన్ని నెలలుగా దొంగ ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన కేసుల్లో సీఐ ఆంజనేయులు చర్యలు చేపట్టి నట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. ఇటీవల ఉన్నతాధికారులు సహ కారంతో కీసర మాజీ సబ్ రిజిస్ట్రార్ రహమాన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సమాచారం.

# 30 వేల ఎకరాల్లో నెట్‌జీరో స్మార్ట్‌సిటీ

>> నిరంకుశ పాలకులకు వ్యతిరేకంగా ప్రాణాలకు తెగించి పోరాడిన యోధులకు పుట్టినిల్లు తెలంగాణ. అస్తిత్వం, ఆత్మగౌరవం, హక్కుల కోసం ఈ నేల ఎప్పటికప్పుడు ప్రజా చైతన్యాన్ని రగిలించిందని, 1948 సెప్టెంబర్ 17న హైదరాబాద్ రాజ్యం అధికారికంగా భారతదేశంలో అంతర్భాగమైంది. రాచరిక పాలన నుంచి ప్రజాస్వామ్య పాలనకు మార్గం తెరుచుకున్న చారిత్రక సందర్భం. అందుకే సెప్టెంబర్ 17ను మనం ప్రజా పాలన దినోత్సవంగా జరుపుకుంటున్నాం అని వివరించారు. ప్రజా పాలన అంటే ప్రజల మాటకు విలువ ఇవ్వడం.. వారి సమస్యలకు పరిష్కారం చూపడం. వారి హక్కులను కాపాడడం. ప్రభుత్వ వనరులు అందరికీ చేరేలా చూడడం. అదే స్ఫూర్తితో ప్రజల ఆత్మగౌరవానికి పట్టం కడుతూ ప్రజా పాలన కొనసాగిస్తున్నామని చెప్పారు. తెలంగాణ ఇప్పుడు పొరుగు రాష్ట్రాలతో కాదు, ప్రపంచంతో పోటీ పడుతోంది. రాష్ట్ర తలసరి ఆదాయం రూ. 4,18,931కు చేరింది. ఇది దేశ తలసరి ఆదాయం కన్నా దాదాపు 91 శాతం అధికం. అభివృద్ధి అంకెల్లో మాత్రమే కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలన్నదే మా లక్ష్యం అని చెప్పారు. ప్రజా ప్రభుత్వం రైతు పక్షపాతి. ప్రతి రైతు కుటుంబం సంతోషంగా ఉండాలనే లక్ష్యంతో రూ.2 లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేశాం. రూ.20,616 కోట్లు విడుదల చేసి 25.35 లక్షల రైతు కుటుంబాలను అప్పుల ఊబి నుంచి బయటపడేశాం అని పేర్కొన్నారు. రైతు భరోసా కింద రూ.36 వేల కోట్లకు పైగా రైతుల ఖాతాల్లో జమ చేశాం. సన్నాలకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లించాం. ప్రభుత్వం ఇచ్చిన మద్దతుతో వరి సాగు విస్తీర్ణం, దిగుబడిలో తెలంగాణ దేశంలోనే నెంబర్‌వన్ స్థానంలో నిలిచింది. 32 నెలల్లో వ్యవసాయం, రైతు సంక్షేమానికి దాదాపు రూ.1 లక్ష 72 వేల కోట్లు ఖర్చు చేశాం అని పేర్కొన్నారు. భూ భారతి చట్టం ద్వారా భూ పరిపాలనలో సమగ్ర సంస్కరణలు తీసుకొచ్చాం. భూధార్, ఏఐ ఆధారిత భూమిత్ర సేవలు ప్రారంభించాం. 5 లక్షల 94 వేల మంది రైతులకు పట్టాదార్ పాస్‌బుక్‌లు జారీ చేశాం అని చెప్పారు. కృష్ణా జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటా కోసం న్యాయపోరాటం చేస్తున్నాం. పాలమూరు-రంగారెడ్డి, సీతారామ ఎత్తిపోతలు, ఎస్ఎల్‌బీసీతో పాటు ఇతర పెండింగ్ ప్రాజెక్టుల పనులను యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నాం అని వెల్లడించారు. 'తెలంగాణలో ప్రతి ఆడబిడ్డ సగర్వంగా జీవించాలి. ఆర్థికంగా స్వతంత్రంగా ఎదగాలి. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో మా ప్రభుత్వం పనిచేస్తోంది. మహాలక్షి ్మ పథకం ద్వారా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. ఈ ప్రయాణాలతో మన ఆడబిడ్డలకు రూ.12,385 కోట్ల మేర ఖర్చు ఆదా అయింది, గృహజ్యోతి కింద 53 లక్షలకు పైగా కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. 43 లక్షల కుటుంబాలకు రూ. 500కే వంటగ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. కల్యాణలక్షి ్మ, షాదీ ముబారక్ ద్వారా 1 లక్ష 68 వేల మంది ఆడబిడ్డలకు రూ. 4,709 కోట్ల సహాయం చేశాం అని పేర్కొన్నారు. 4.54 లక్షల స్వయం సహాయక సంఘాలకు రూ.60 వేల 487 కోట్ల బ్యాంకు లింకేజీ, రూ. 1,900 కోట్ల వడ్డీ రాయితీ కల్పించాం. మహిళా మార్ట్‌లు, పెట్రోల్ బంకులు, ఆర్టీసీ అద్దె బస్సులతో మహిళల ఆదాయం పెంచుతున్నాం.

ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా 3.42 కోట్ల మందికి సన్న బియ్యం అందిస్తున్నాం. 15 లక్షలకు పైగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశాం. 43 లక్షలకు పైగా మందికి సామాజిక భద్రతా పింఛన్లు అందిస్తున్నాం. మేం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల కింద సుమారు రూ. 31 వేల కోట్లు అందించాం. తాజాగా మరో 2.25 లక్షల మందికి పింఛన్లు ఇచ్చేందుకు రంగం సిద్ధమైంది' అని వివరించారు. ప్రతి కుటుంబం ఆత్మగౌరవంతో నివసించాలనేది మా ప్రభుత్వ ఆశయం. ఇందిరమ్మ ఇళ్ల తొలి దశలో రూ. 22,500 కోట్లతో 4.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. ఒక్కో ఇంటికి రూ. 5 లక్షలు అందించాం. రెండో దశలో మరో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేశాం. హైదరాబాద్ నగర పరిధిలో లక్ష ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇందిరమ్మ టవర్ల నిర్మాణాన్ని ప్రారంభించామని చెప్పారు. సామాజిక అంతరాలను తగ్గించి ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలనే లక్ష్యంతో సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కుల సర్వేను శాస్త్రీయంగా చేపట్టాం. ఆ సర్వే గణాంకాల ఆధారంగా విద్య, ఉపాధి, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లులను శాసనసభలో ఆమోదించి రాష్ట్రపతి ఆమోదానికి పంపించాం. సుప్రీంకోర్టు తీర్పును అనుసరించి దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాం. ఫిబ్రవరి 4ను ప్రతి ఏటా తెలంగాణ సోషల్ జస్టిస్ డేగా జరుపుకుంటున్నాం అని చెప్పారు. సామాజిక న్యాయం అంటే మాకు నినాదం కాదు. వెనుకబడిన వారిని ముందుకు తీసుకురావడం, ప్రజా ప్రభుత్వానికి విద్య, వైద్యం రెండు కళ్లలాంటివి. కుల, మత భేదాలు లేకుండా పిల్లలందరికీ నాణ్యమైన విద్య అందాలనే లక్ష్యంతో ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూళ్లు నిర్మిస్తున్నాం. ఒక్కో నియోజకవర్గంలో 20 నుంచి 25 ఎకరాల్లో సకల వసతులతో వీటి నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనేది మా సంకల్పం. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచే దిశగా అడుగులు వేస్తున్నాం అని పేర్కొన్నారు. దాదాపు 30 వేల ఎకరాల్లో భారత్ ఫ్యూచర్ సిటీని దేశంలో తొలి నెట్‌జీరో స్మార్ట్ సిటీ నిర్మిస్తున్నాం. డిసెంబర్‌లో నిర్వహించే ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్2026 సందర్భంగా ఫ్యూచర్ సిటీ మాస్టర్ ప్లాన్‌ను ఆవిష్కరిస్తాం. ఫ్యూచర్ సిటీలో టీసీఎస్ రూ.70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటా సెంటర్ నిర్మించేందుకు ముందుకు వచ్చింది. రూ.లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటా సెంటర్ నిర్మాణం చేపట్టింది అని వివరించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, లైఫ్ సైన్సెస్ హబ్, ఈవీ పార్క్, ఏఐ సిటీ, హెల్త్ సిటీ, ఎడ్యుకేషన్ సిటీ వంటి ప్రత్యేక జోన్లతో ఫ్యూచర్ సిటీని అభివృద్ధి చేస్తున్నాం. రీజినల్ రింగ్ రోడ్డు, గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, డ్రైపోర్టులు, హైదరాబాద్-నాగపూర్, హైదరాబాద్-బెంగళూరు, హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్లు తెలంగాణ ముఖచిత్రాన్ని మార్చనున్నాయి. రహదారులు అభివృద్ధికి సూచిక. గ్రామం నుంచి మండలానికి, మండలం నుంచి జిల్లాకు, జిల్లా నుంచి రాష్ట్ర రాజధానికి మెరుగైన రహదారి అనుసంధానం కల్పించేందుకు పనులు చేపట్టాం అని పేర్కొన్నారు. ఆర్ అండ్ బీ పరిధిలో రూ.13 వేల కోట్లతో, పంచాయతీరాజ్ పరిధిలో రూ. 6,294 కోట్లతో రహదారి పనులు చేపడుతున్నాం అని చెప్పారు.



జిల్లా కలెక్టరేట్‌లో వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న సుదర్శన్‌రెడ్డి, కలెక్టర్ ప్రియాంక తదితరులు

## 'సర్' వెరిఫికేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** జిల్లాలో ఎస్ఐఆర్ వెరిఫికేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అధికారులకు సూచించారు.గురువారం హైదరాబాద్ కలెక్టరేట్‌ను సందర్శించి ఈసిలాగిన్ ద్వారా కొనసాగుతున్న ఎస్ఐఆర్2026 ధృవీకరణ ప్రక్రియ పురోగతిని జిల్లా ఎన్నికల అధికారి ఆర్ వి కర్ణన్, జిహెచ్ఎంసి అడిషనల్ కమిషనర్ అడిషనల్ ఎలక్షన్స్ సంతోష్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక అలా లతో కలసి ఎస్ఐఆర్ వెరిఫికేషన్ కేంద్రాన్ని సందర్శించి సమీక్షి ంచారు. ఈసందర్భంగా ప్రక్రియలో పాల్గొంటున్న సిబ్బందితో మాట్లాడి వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల సంఘం జారీ చేసిన మార్గదర్శకాలు, సూచనలను కచ్చితంగా పాటిస్తూ ధృవీకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. విచారణల అనంతరం పత్రాలు బిఎల్‌వోల నుంచి ఏఈఆర్‌వో, ఈఆర్‌వోల ద్వారా డిప్యూటీ జిల్లా ఎన్నికల అధికారి లాగిన్‌కు చేరుకుని ధృవీకరణకు వస్తున్నట్లు అధికారులు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారికి వివరించారు. ఈకార్యక్రమంలో ఏవో వెంకట్రామిరెడ్డి, ఎన్నికల పర్యవేక్షకులు రహీం, ఎన్ఐసి డిఐఓ మధు సూదన్, ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## త్రుటిలో తప్పిన ప్రమాదం.. అందరూ క్షేమం

**ఉమ్మడి వరంగల్ బ్యూరో, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయానికి బయలుదేరిన ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యుడు డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్, జిల్లా యువజన నాయకులు నూకల అభినవ్‌రెడ్డి, ఇతర ప్రజాప్రతినిధులు, గన్ మెన్లు, నాయకులు ప్రయాణిస్తున్న వాహనం చింతపల్లి గ్రామం మార్గ మధ్యంలో స్వల్ప అగ్నిప్రమాదానికి గురైంది. డ్రైవర్ పక్కన ఉన్న ఫోన్ పవర్ బ్యాంక్ ఒక్కసారిగా పేలడంతో వాహనంలో స్వల్పంగా మంటలు చెలరేగినట్లు సమాచారం. అప్రమత్తమైన సిబ్బంది వెంటనే స్పందించి మం టలను అదుపులోకి తీసుకువచ్చారు. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణహాని జరగలేదు. ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రాంచందర్ నాయక్‌తోపాటు వాహనంలో ప్రయాణిస్తున్న వారందరూ క్షేమంగా ఉన్నారు. సిబ్బంది అప్రమత్తతతో ప్రమాదం త్రుటిలో తప్పింది.

## సమస్యలపై సర్కార్‌తో నేడు ఉద్యోగ సంఘాల జెఎసి భేటీ

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** తెలంగాణలో పీఆర్సీ, డీఏ తదితర ఉద్యోగుల ప్రధాన సమస్యలపై శుక్రవారర ఉద్యోగ సంఘాల జేఏసీతో ప్రభుత్వం జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ భేటీ నిర్వహించనుంది. ఈ చర్చల్లో ముఖ్యంగా పీఆర్సీ, డీఏలు పెండింగ్‌లో ఉన్న కరువు భత్య , దానికి సంబంధించిన బకాయిలు, వేతన సవరణ సంఘం నివేదికపై ప్రధానంగా చర్చించనున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం సానుకూల నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. భవిష్యత్ ఈ సమావేశంలో ప్రభుత్వ వైఖరిని బట్టి ఉద్యోగ సంఘాలు తమ తదుపరి నిర్ణయాలను ప్రకటించనున్నాయి.

## స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టెర్సన్ రాజీనామా

**స్టాక్‌హోమ్, సెప్టెంబరు 17:** స్వీడన్ ప్రధానమంత్రి ఉల్ఫ్ క్రిస్టెర్సన్ తన పదవికి రాజీనామా చేశారు. దేశంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ఆయన



నేతృత్వంలోని రైట్‌వింగ్ కూటమి. మధ్యేవామపక్ష ప్రతిపక్ష కూటమిపై స్వల్ప తేడాతో ఓటమి పాలైన నేపథ్యంలో రాజీనామా చేసారు. గురువారం మధ్యాహ్నం ఎక్స్‌లో పోస్టు ద్వారా క్రిస్టెర్సన్ స్వయంగా తన రాజీనామా విషయాన్ని ప్రకటించారు. ఆదివారం జరిగిన ఎన్నికల ప్రాథ మిక ఫలితాల్లో రెండు రాజకీయ కూటముల మధ్య తేడా సుమారు 50 వేల ఓట్లుగా ఉంది. దాదాపు కోటి జనాభా ఉన్న స్వీడన్‌లో ఇది అత్యంత స్వల్ప తేడాగా నిలిచింది. స్వీడన్ ఎన్నికల అథారిటీ వెల్లడించిన వివరాల ప్రకారం సోషల్ డెమోక్రాట్ల నేత మాగ్దలీనా ఆండర్సన్ నాయకత్వంలోని ప్రతిపక్ష కూటమికి 349 స్థానాలున్న రిక్స్‌డాగ్‌లో సుమారు 176 సీట్లు లభించే అవకాశం ఉంది. క్రిస్టెర్సన్ నేతృత్వంలోని రైట్‌వింగ్‌కూటమి 173 స్థానాలతో వెనుకబడింది.

ఈ ఫలితాలకు ఇంకా అధికారిక ధ్రువీకరణ జరగాల్సి ఉంది. ఈ ప్రక్రియ ఈ వారాంతంలో పూర్తవుతుంది. కన్జర్వేటివ్ నేత అయిన ఉల్ఫ్ క్రిస్టెర్సన్ స్వీడన్ డెమోక్రాట్ల మద్దతుతో ప్రభుత్వాన్ని నడిపారు. వలసలకు వ్యతిరేక వైఖరికి పేరుగాంచిన ఈ రైట్‌వింగ్ పార్టీకితన కూటమి తిరిగి అధికారంలోకి వస్తే కేబినెట్‌లో పదవులు ఇస్తామని క్రిస్టెర్సన్ హామీ ఇచ్చినట్లు సమాచారం.అయితే ఎన్నికల ఫలితాలతో ఆ ప్రణాళిక ముందుకు సాగలేదు. స్వీడన్ రాజకీయ వ్యవస్థలో సాధారణంగా రెండు ప్రధాన కూటములు ఉంటాయి.

ఒక్కో కూటమిలో నాలుగు పార్టీలు ఉంటాయి. దీంతో కూటమి ప్రభుత్వాలు, మైనారిటీ ప్రభుత్వాలు స్వీడన్ రాజకీయాల్లో సాధారణంగా మారాయి. క్రిస్టెర్సన్ రాజీనామాతో స్వీడన్‌లో కొత్త ప్రభుత్వం ఏర్పాటు ప్రక్రియ ప్రారంభం కానుంది. దేశ వ్యవస్థ ప్రకారం ప్రధాని రాజీనామా చేసిన తర్వాత రిక్స్‌డాగ్ స్పీకర్ తదుపరి దశను పర్యవేక్షిస్తారు. అన్ని పార్టీలతో చర్చలు జరిపిన అనంతరం కొత్త ప్రధానమంత్రి అభ్యర్థిని ప్రతిపాదిస్తారు. ఆ అభ్యర్థిపై పార్లమెంట్‌లో ఓటింగ్ జరుగుతుంది.తన రాజీనామా ప్రకటనలో ఈ ప్రక్రియను ఆలస్యం చేయకుండా ప్రారంభించాలని క్రిస్టెర్సన్ స్పష్టం చేశారు.


## కెటిఆర్ పిఆర్ఒ మహేశ్‌పై కేసు నమోదు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఆర్ఓ మహేష్‌పై బొల్లారం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నెల 8న ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్తున్న బీఆర్ఎస్ నేతలను పోలీసులు అడ్డుకున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద అప్పటికే ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడంతో అక్కడికి వెళ్లేందుకు బీఆర్ఎస్ నేతలకు పోలీసులు అనుమతి నిరాకరించారు. ఈ క్రమంలో బొల్లారం చెక్‌పోస్ట్ వద్ద బేగంపేట్ ఏసీపీ గోపాలకృష్ణమూర్తితో కేటీఆర్ పీఆర్ఓ మహేష్ వాగ్వాదానికి దిగినట్లు పోలీసులు పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు విధించిన ఆంక్షలను పట్టించుకోకుండా పోలీసులతో దురుసుగా ప్రవర్తించారని, పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఏసీపీని దూషించడం, కేకలు వేయడంతోపాటు విధులకు ఆటంకం కలిగించినట్లు ఆరోపణలు ఉన్నాయి.ఈ ఘటనకు సంబంధించి మహేష్‌పై భారతీయ న్యాయ సంహిత (బిఎన్ఎస్)లోని సెక్షన్ 132, 223 కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

# భారత్‌పై పెరిగిన అంతర్జాతీయ విశ్వాసం

### 7.8 శాతంతో దేశ ఆర్థిక వ్యవస్థ మరింత పరిపుష్టం

### సెమికాన్ ఇండియా-2026 కార్యక్రమంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ప్రపంచవ్యాప్తంగా క్లిష్ట పరిస్థితులు ఉన్నప్పటికీ భారత ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటోందని, దేశంపై అంతర్జాతీయ విశ్వాసం గణనీయంగా పెరిగిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అన్నారు. సెమీకండక్టర్, ఫిన్‌టెక్, లాజిస్టిక్స్ వంటి కీలక రంగాల్లో చోటుచేసుకుంటున్న అభివృద్ధి దీనికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గురువారం సెమీకాన్ ఇండియా 2026 కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ప్రధాని ప్రసంగించారు. ప్రపంచం గడ్డు కాలాన్ని ఎదుర్కొంటున్నప్పటికీ, ఇటీవలి త్రైమాసికంలో భారత్ 7.8 శాతం ఆర్థిక వృద్ధిని నమోదు చేసింది. ఇది మన ఆర్థిక వ్యవస్థ స్థితిస్థాపకతను చూపుతోంది. గడిచిన 15 రోజుల్లో జరిగిన పరిణామాలే దీనికి ఉదాహరణని తెలిపారు. ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్‌లో ఏజెంటిక్ ఏఐ, టోకెనైజేషన్, క్వాంటం టెక్నాలజీ వంటి అంశాలపై చర్చ జరిగిందని, అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 3,000 కిలోమీటర్ల డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ల కార్యకలాపాలు ప్రారంభించామని గుర్తుచేశారు. ఈ కారిడార్లు దేశంలో సరుకు రవాణాను వేగవంతం చేసి, లాజిస్టిక్స్ రంగాన్ని మెరుగుపరచడమే కాకుండా తయారీ రంగానికి కొత్త ఊపు ఇస్తాయని వివరించారు. సెమీకండక్టర్ రంగం గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ భారత చిప్ పరిశ్రమ వేగంగా పుంజుకుంటోంది. త్వరలోనే భారత్ చిప్స్ ప్రపంచానికి వెళ్తాయి అన్నది వాస్తవరూపం దాలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఇటీవలే ఒక ప్రముఖ క్రెడిట్ రేటింగ్ ఏజెన్సీ భారత్‌కు సావరిన్ రేటింగ్ అప్‌గ్రేడ్ ఇవ్వడం కూడా భారత ఆర్థిక వ్యవస్థపై పెరుగుతున్న ప్రపంచ విశ్వాసానికి నిదర్శనమని అన్నారు.

భారత్ అధ్యక్షతన జరిగిన బ్రిక్స్ సదస్సులో ఏకాభిప్రాయంతో న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను ఆమోదించడం కూడా అంతర్జాతీయంగా మన దేశానికి ఉన్న ఆమోదాన్ని స్పష్టం చేస్తోందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ సెమీకాన్ 2.0 కార్యక్రమం ద్వారా దేశంలో సెమీకండక్టర్ల పర్యావరణ వ్యవస్థను ఆరు కీలక స్తంభాలపై నిర్మిస్తున్నామని తెలిపారు.

చిప్ డిజైన్, యంత్రాలుముడి పదార్థాలు, ఫ్యాబ్‌లు, అడ్వాన్స్‌డ్ ప్యాకేజింగ్, నైపుణ్యాభివృద్ధి ఇందులో భాగమని వివరించారు. సెమీకండక్టర్ కార్యక్రమంలో భాగంగా తొలి దశలో 105కు పైగా స్టార్టప్‌లు పాల్గొన్నాయని, వాటిలో 20 స్టార్టప్‌లు వెంచర్ క్యాపిటల్ ఫండింగ్ ద్వారా రూ.800 కోట్ల నిధులను సమీకరించాయని మంత్రి వెల్లడించారు. సెమీకాన్ 2.0 కింద కనీసం 200 చిప్‌డిజైన్ స్టార్టప్‌లు, కంపెనీలకు మద్దతు ఇవ్వాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని అన్నారు. పదేళ్లలో 85వేల మంది డిజైన్ ఇంజినీర్లను తయారు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, కేవలం నాలుగేళ్లలోనే 70వేలమందికి శిక్షణ పూర్తి చేశామని ఆయన ప్రకటించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 400కు పైగా యూనివర్సిటీలకు ఎలక్ట్రానిక్ డిజైన్ ఆటోమేషన్ (ఈడీఏ) టూల్స్ అందుబాటులో ఉన్నాయని మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.

# అభివృద్ధి, సంక్షేమమే బిజెపి ఆశయం

### తిమ్మాపూర్‌లో గ్రామస్థులతో కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ముఖాముఖి



గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో ముఖాముఖిగా మాట్లాడుతున్న కేంద్రమంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్, చిత్రంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**కందుకూరు, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** కేంద్రంలోని ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలోని ప్రభుత్వం దేశాభివృద్ధితోపాటు ప్రజా సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ అన్నారు. రైతులు, గ్రామీణ మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించినప్పుడే దేశం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ జన్మదిన వేడుకలను పురస్కరిం చుకుని గురువారం రంగారెడ్డి జిల్లా కందు కూరు మండలం తిమ్మాపూర్ గ్రామంలో రైతులు, స్వయం సహాయక సంఘాల మహిళలతో కేంద్ర మంత్రి శివ రాజ్‌సింగ్ చౌహాన్ ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి కూడా పాల్గొన్నారు. రైతులు, మహిళలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు, అనుభవాలను కేంద్ర మంత్రి తెలుసుకున్నారు. శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి, మహిళల ఆర్థిక సాధికార తకు అనేక కార్యక్రమా లను అమలు చేస్తోందన్నారు. మహిళలు ఆర్థికం గా బలోపేతం కావడంతో కుటుంబాల జీవన ప్రమాణాలు మెరుగుపడటంతో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతమవుతుందని పేర్కొన్నారు. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో దేశంలో అనేక రంగాల్లో మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. రైతులు, మహిళలు, యువత ఆర్థికంగా అభివృద్ధి చెందితే దేశం మరింత పురోగతి సాధిస్తుందని పేర్కొ న్నారు. కేంద్ర ప్రభుత్వ పథకాల ప్రయోజనాలను ప్రజలకు వివరించి, అర్హులైన వారికి అవి అందేలా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

## గోల్కొండ కోట నుంచి తీన్మార్ మల్లన్న 'బిసి రాజ్యాధికార యాత్ర' ప్రారంభం

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** చరిత్రాత్మక గోల్కొండ కోట వేదికగా తీన్మార్ మల్లన్న చేపట్టిన 'బిసి రాజ్యాధికార యాత్ర' గురువారం అట్టహాసంగా ప్రారంభమైంది. యాత్రను ప్రారంభించే ముందు ఆయన గోల్కొండ కోటపై కొలువుదీరిన జగదాంబికా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భారీగా తరలివచ్చిన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల జయజయధ్వానాల మధ్య పార్టీ పతా కాన్ని ఆవిష్కరించి బిసి రాజ్యాధికార యాత్రలో తొలి అడుగు వేశారు. ఈ సందర్భంగా ప్రాంగణమంతా బహుజన, బిసి నినాదాలతో హోరెత్తింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోల్కొండ గడ్డపై పడిన తొలి అడుగు బిసిల రాజకీయ ఆత్మగౌరవానికి, రాజ్యాధికార సాధనకు నాంది అని స్పష్టం చేశారు. జనాభాలో సింహభాగం ఉన్న బిసిలు కేవలం ఓటు బ్యాం కుగా మాత్రమే మిగిలిపోకుండా, రాబోయే రోజుల్లో శాసనకర్తలుగా, పాల కుల స్థానంలో నిలబడాలనే లక్ష్యంతోనే ఈ యాత్రను చేపట్టినట్లు తెలి పారు. బిసిల విద్య, ఉపాధి, రాజకీయ సాధికారతపై అవగాహన కల్పిం చడమే యాత్ర లక్ష్యమన్నారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వివిధ జిల్లాల నుంచి భారీఎత్తున బిసి సంఘాల ప్రతినిధులు, యువత, అభి మానులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. కాగా, ఈ యాత్రకు మజ్లిస్ బచావో తెహ్రీక్ (ఎంబిటి) మద్దతు ప్రకటించింది. ఆ పార్టీ ప్రతినిధి అమ్జద్ ఉల్లాఖాన్ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# 1.50 లక్షల కోట్ల విలువైన మూడువేల ఎకరాలకు రక్షణ

### హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** ప్రభుత్వ భూములు, పార్కులు, చెరువులు, నాలాలు ప్రజా సవరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణ హైడ్రా ప్రధాన విధిగా భావించాలని కమిషనర్ ఏవీ రంగనాథ్ సిబ్బందికి సూచించారు. ప్రజల ఆస్తుల పరిరక్షణ, ప్రకృతి వైపరీత్యాల నియంత్రణ, నిర్వహణ హైడ్రా ప్రధాన విధులుగా ఉన్నాయని.. ఆ దిశగా అందరూ నిబద్ధతతో పని చేయాలని కోరారు. గురువారం హైడ్రా కార్యాలయంలో ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన అనంతరం రంగనాథ్ సిబ్బందినుద్దేశించి ప్రసంగించారు. ప్రజా పాలన అంటే ప్రజల ఆకాంక్షల మేరకు సాగించే పాలనగా భావించాలన్నారు. ప్రజల ఆస్తులను కాపాడటం అంటే భవిష్యత్ తరాల హక్కులను పరి రక్షించడమని.. ఇందుకు అందరూ కంకణ బద్ధుల వ్వాలన్నారు. తెలంగాణ రైతాంగ పోరాటం, సాయుధ పోరాటం, రాష్ట్ర సాధన ఇలా తెలంగాణ లో జరిగిన ప్రతి ఉద్యమంలో భూమి ప్రధానాంశంగా ఉందని.. మన ప్రధాన విధి కూడా ప్రజలకు చెందిన ఆస్తుల కాపాడడమేనని అన్నారు. ప్రకృతి వైపరీత్యాల నిర్వహణతో పాటు ప్రజా ఆస్తుల పరిరక్షణే లక్ష్యంగా హైడ్రాను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. 1948 సెప్టెంబరు 17న హైదరా బాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనం కావడంతో రాచరిక పాలన ముగిసిందని.. ప్రజాస్వామ్య పాలన ప్రారంభ మైందన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం సెప్టెం బరు 17ను ప్రజాపాలన దినోత్సవంగా నిర్వహి స్తోందని చెప్పారు. ఈ చారిత్రక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజా ఆస్తుల పరిరక్షణలో మనవంతు కృషి చేద్దామన్నారు. ఈ క్రమంలో మనం 3 వేల ఎకరాలకు పైగా ప్రభు త్వ, ప్రజా వసరాలకు ఉద్దేశించిన భూములను, స్థలాలను కాపాడామని.. వాటి విలువ రూ. 1.50 లక్షల కోట్లకు పైగా ఉందన్నారు. మనం ఎంతో నిబద్ధతతో పని చేయడంతో ప్రజల నుంచి కూడా పూర్తి స్థాయి మద్దతు లభిస్తోందన్నారు.

హైడ్రా ప్రతి చర్యనూ ప్రజలు సూక్ష్మంగా పరిశీలి స్తున్నారని.. అంతే స్థాయిలో సహకరిస్తున్నారన్నారు. హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్ల పాపయ్య, అడిషనల్ కమిషనర్లు ఆర్. సుదర్శన్, డి. ఆనంద్‌కుమార్, ఏసీపీలు తిరుమల్, ఉమా మహేశ్వరరావు, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



గురువారం హైడ్రా కార్యాలయంలో ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన హైడ్రా కమిషనర్ రంగనాథ్.

# నవంబరు 29న ఎస్ఐ, డిసెంబరు 20న కానిస్టేబుల్ పరీక్ష

### మొత్తం 7,437 పోస్టులకు 5.77 లక్షలకుపైగా దరఖాస్తులు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణలో పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవు తున్న లక్షలాది మంది నిరుద్యోగులకు కీలకమైన ప్రకటన వెలువడింది. ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి సంబంధించిన ప్రాథమిక రాత పరీక్ష (ప్రిలిమినరీ) తేదీలను తెలంగాణ రాష్ట్ర స్థాయి పోలీస్ నియామక మండలి గురువారం ఖరారు చేసింది. ఈ వివరాలను టీఎస్ఎల్ పీఆర్బీ ఛైర్మన్ వి.వి. శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

షెడ్యూల్ ప్రకారం, ఎస్ఐ పోస్టులకు ఈ ఏడాది నవంబర్ 2న, కానిస్టేబుల్ పోస్టులకు ఈ ఏడాది డిసెంబర్ 20న ప్రిలిమినరీ రాత పరీక్షలు నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. పోలీస్, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్, అగ్నిమాపక, జైళ్ల శాఖల పరిధిలో మొత్తం 7,437 పోస్టుల భర్తీకి ఈ నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఈ ఉద్యోగాలకు రాష్ట్రవ్యాప్తంగా అభ్యర్థుల నుంచి భారీ స్పందన లభించింది. ఆగస్టు 19 నుంచి సెప్టెంబర్ 16 వరకు కేవలం 28 రోజుల వ్యవధిలో మొత్తం 5,77,064 దరఖాస్తులు అందినట్లు బోర్డు వెల్లడించింది. ఇందులో ఎస్ఐ పోస్టులకు 1,60,756 మంది, కానిస్టేబుల్ పోస్టులకు 3,89,356 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. సగటున ఒక్కో అభ్యర్థి 1.34 పోస్టులకు దరఖాస్తు చేసినట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

దరఖాస్తుదారుల్లో 74.66 శాతం పురుషులు, 25.33 శాతం మహిళలు ఉన్నారు. సామాజిక వర్గాల వారీగా చూస్తే బీసీ అభ్యర్థులు 49.19 శాతం, ఎస్సీ/ఎస్టీలు 43.60 శాతం, ఓసీలు 7.20 శాతం చొప్పున ఉన్నారు.

# చేవెళ్ల సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఎసిబి సోదాలు

### రూ. లక్ష లంచం తీసుకుంటూ దొరికిన అధికారులు

### చేవెళ్ల ఎటిఒ అనురాధ, ఎస్‌టిఒ లక్ష్మయ్య, అటెండర్ జంగయ్య రిమాండ్



లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన చేవెళ్ల ఎటిఒ అనురాధ, ఎస్‌టిఒ లక్ష్మయ్య, అటెండర్ జంగయ్య

**చేవెళ్ల, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా చేవెళ్ల ట్రెజరీ కార్యాలయంలో ఎసిబి అధికారులు గురువారం సోదాలు చేశారు. పదవీ విర మణ చేసిన ఓ పంచాయతీ కార్యదర్శి వద్ద లక్ష రూపాయలు లంచం తీసుకుంటూ ఎసిబి అధికారులకు రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన ఘటన చేవెళ్ల మండల కేంద్రంలో జరిగింది. చేవెళ్ల డివిజనల్ సబ్‌ట్రెజరీ కార్యాలయం లో అవినీతి నిరోధక శాఖ అధికారులు అకస్మాత్తుగా సో దాలు నిర్వహించారు. బాధితుడి నుంచి రూ. 1,00,000 లంచం తీసుకుం టుండగా సంబం ధిత అధికారు లను ఎసిబి బృం దం రెడ్‌హ్యాం డెడ్‌గా పట్టుకున్నారు. రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శి చేసిన ఫిర్యాదుతో రంగారెడ్డి జిల్లా ఎసిబి డిఎస్పీ అనంద్‌కుమార్ దాడులు నిర్వహించి లంచం తీసుకుంటున్న ట్రెజరి అధికారులను పట్టుకని నగదును స్వాధీనం చేసుకున్నారు.

రిటైర్డ్ పంచాయతీ కార్యదర్శికి 23 లక్షలు ప్రభుత్వం నుండి బకాయిలు రావాల్సి ఉందని, దీంతో పంచాయతీ కార్యదర్శి చేవెళ్ల సబ్‌ట్రెజరీ కార్యాలయంలో ఎటిఒ అనురాధ, ఎస్‌టిఒ లక్ష్మయ్యను కలిసి తనకు రావాల్సిన బెనిఫిట్ బిల్లులు ఇప్పించాలని కోరగా బిల్లు పాస్ చేయాలంటే రెండు లక్షల యాభై వేయిల రూపాయలు లంచం ఇవ్వాలని వారు డిమాండ్ చేసి అడ్వాన్సుగా లక్ష రూపాయలను ఇవ్వాలన్నారు.

బ్యాంకులో జమ చేసిన నగదు నుంచి అడ్వాన్స్‌గా లంచం ఇవ్వాలని ఫోన్‌లో ఇబ్బంది పెట్టడంతో బాదితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించాడని తెలిపారు. నగదును చేవెళ్ల ఎటిఒ అనురాధ సమక్షంలోనే అటెండర్ జంగయ్యకు యాభై వేలు, ఎస్‌టిఒ లక్ష్మయ్యకు యాభై వేల రూపాయలను తీసుకున్నారు. అక్కడే కాపు కాసిన ఎసిబి అధికారులు లంచం తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ట్రెజరీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తూ పూర్తి స్థాయి విచారణ చేశారు. లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండ్‌గా దొరికిన చేవెళ్ల ఎటిఒ అనురాధ, ఎస్‌టిఒ లక్ష్మయ్య, అటెండర్ జంగయ్యపై కేసు నమోదు చేసి, ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరుపరచామని ఎసిసి అధికారులు తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
ఫారం - VI
ప్రాథమిక ప్రకటన

గెజిట్ నెం.: 88/2026 తేది: 08.09.2026
ఫైల్ నెం.: G/1375/2023

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 1 యొక్క సెక్షన్ (2013/30 కేంద్ర చట్టం) 1(1) మరియు రాష్ట్ర రూల్ (1) 19ననుసరించి

తెలంగాణ ప్రభుత్వ /శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి గారు ప్రజా ప్రయోజనార్థ అవసర నిమిత్తం వనపర్తి జిల్లా శ్రీరంగాపూర్ మండలములోని నాగరాల రెవెన్యూ గ్రామ పరిధిలో "RBLISP-RBLI-Package No 17" రంగసముద్రం బాలేన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణం కొరకు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదాహరించిన భూమి 10116 చ.మీ గల సర్వే నెం 740లోని ఖాళీ స్థలం పట్టా/ప్రభుత్వ భూములు సేకరించుటకు ప్రతిపాదించనైనది. భూసేకరణ కొరకు భూసేకరణ పునరావాస, పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం-2013లోని చాప్టర్-(II)లోని సామాజిక ప్రభావ అధ్యయన నివేదిక మరియు చాప్టర్-(III)లోని ఆహార భద్రత మరియు పరిరక్షణకు సంబంధించిన మినహాయింపు ఇస్తూ, తెలంగాణ సవరణ చట్టం-2016 అనుసరించి, సెక్షన్-10A ప్రకారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జి.ఓ.యం.యస్.నం.51 (Irrigation CAD (LA.R&R/A2), Dept., తేది: 25.07.2017 జారి చేసినది, కేంద్ర భూసేకరణ చట్టం, 2013 (చట్టము నెం. 30/2013) యొక్క సెక్షన్ 11(1) ప్రకారం ప్రకటన జారీ చేయనైనది.

పై ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ పనులను చేపట్టుటకు చట్టంలోని నిబంధనలననుసరించి జిల్లా కలెక్టర్, వనపర్తి గారు జారీ చేసిన ఉత్తర్వుల నంబర్ G/225/2026 తేది:30.03.2026 ప్రకారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్(భూ.సే), ఆర్.యల్.ఐ.యస్.పి-II, పెబ్బేర్‌గారిని భూసేకరణ అధికారిగా నియమించినారు.

కావున పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి జిల్లా మరియు శ్రీరంగాపూర్ మండలములోని నాగరాల రెవెన్యూ గ్రామ పరిమితిలో గల ప్రామాణిక కొలత కంటే ఎక్కువ లేదా తక్కువ 10116 చ.మీ గల సర్వే నెం 740లోని ఖాళీ స్థలం కొలిచే డివిజన్ భూమి, భూసేకరణ ద్వారా సేకరణ చేసే భూముల వివరములు క్రింది విధంగా గలవు.

షెడ్యూల్

గ్రామము : నాగరాల మండలం : శ్రీరంగాపూర్ జిల్లా : వనపర్తి

| క్ర. సం | సర్వే నెం | భూమి రకం మెట్ట/ తరి | పట్టా/ అసైన్డ్ /ప్రభుత్వ/ ఇతర.. | భూసేకరణ కొరకు ప్రతిపాదితభూ విస్తీర్ణం చ మీ | పట్టాదారు/ అనుభవదారు పేరు మరియు తండ్రి/ భర్త పేరు శ్రీ/శ్రీమతి/కుమారి | సరిహద్దులు ఉ | ద | తూ | ప |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 740 | మెట్ట | పట్టా | 1316 | కే.నారాయణ @ నరసింహ తండ్రి లేట్ కుడుముంట్ల రంగన్న | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ |
| 2 | | | | 2200 | కే.ధర్మేందర్ తండ్రి కే.నారాయణ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ |
| 3 | | | | 2200 | నందిని కుడుముంట్ల భర్త కే.ధర్మేందర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ |
| 4 | 740 | మెట్ట | పట్టా | 2200 | కుడుముంట్ల భరత్ కుమార్ తండ్రి కే.ధర్మేందర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ |
| 5 | | | | 2200 | కే.హేమశ్రీ తండ్రి కే.ధర్మేందర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ | రిజర్వు వయర్ |
| మొత్తం విస్తీర్ణం చ.మీ. | | | | 10116 | | | | | |

భూసేకరణ, పునరావాసం మరియు పునస్థాపనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు తెలంగాణ సవరణ-2016 (చట్టం.21/2017) మరియు భూ సేకరణ చట్టం-2013 (నెం.30/2013)లోని సెక్షన్ (నిబంధన)-11(1) ప్రకారం సంబంధిత భూయజమానులకు/ఆసక్తి గల వ్యక్తులందరికి తెలియచేయుట నిమిత్తం ఇట్టి ప్రకటన (నోటిఫికేషన్) జారీ చేయనైనది.

సదరు చట్టం యొక్క సెక్షన్ 11(4) ప్రకారం శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తిగారి అనుమతి లేకుండా ఇట్టి ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసిన తేదీ నుండి ఆ నోటిఫికేషన్‌లో ప్రకటించిన/ఉదాహరించిన భూములకు సంబంధించిన ఎవరు ఎటువంటి లావాదేవీలు/ తాకట్టు, అమ్మకం/కొనుగోలు మొదలగు చర్యలు చేపట్టరాదు అని తెలియచేయనైనది.

సదరు చట్టంలోని సెక్షన్-12లో గల అధికారాలను అనుసరించి తెలంగాణ ప్రభుత్వం/శ్రీయుత జిల్లా కలెక్టర్ గారు భూసేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), ఆర్.యల్.ఐ.యస్.పి-II, పెబ్బేర్ Hq IDOC, వనపర్తి మరియు అతని సిబ్బందికి సదరు భూమిపైకి ప్రవేశించడానికి, సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు, భూమిని తీసుకోవటానికి, త్రవ్వటానికి అధికారం ఇవ్వడానికి, ఇతర పనులు అమలు చెయ్యడానికి అనుమతించనైనది.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి/భూసేకరణ అధికారి & స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), ఆర్.యల్.ఐ.యస్.పి-II, పెబ్బేర్ Hq IDOC, వనపర్తి గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలో పరిశీలించుకోవచ్చును.

భూసేకరణ చట్టంలోని సెక్షన్-15(1) ప్రకారం, ఇట్టి నోటిఫికేషన్ జారి చేసిన తరువాత పైన చూపించిన భూములలో ఎలాంటి సంబంధమున్న వ్యక్తులైన భూసేకరణ పై అభ్యంతరాలున్నచో, అట్టి వ్యక్తులు ఇట్టి నోటిఫికేషన్ ప్రచురించిన తేదీ నుండి 60 (అరవై) రోజులలోపు శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి/ భూసేకరణ అధికారి & ప్రత్యేక ఉప కలెక్టర్ (భూ. సే), ఆర్.ఎల్.ఐ.యస్.పి. యూనిట్-2, పెబ్బేరు, Hq at IDOC, వనపర్తి గారికి లిఖిత పూర్వకంగా తెలియపరచగలరు.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఆర్.పి.ఎస్.ఐ.ఎల్., యూనిట్-2, పెబ్బేర్.
సం/- అదనపు కలెక్టర్, వనపర్తి
సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR RO.NO: 886/LA/PP/Advt/Pub/2026-27

వార్త

తమ గుర్రాలు, కుక్కల సంతతిని గురించి అతి జాగ్రత్త వహించే మానవులు తమ సంతతిపై అంతగా శ్రద్ధ వహించరు.

- విలియం పెన్

# ప్రకృతితో చెలగాటాలొద్దు!

ప్రపంచవ్యాప్తంగా మానవతప్పిదాల వల్లనే విపత్తులు ఒకదానివెంట ఒకటి తోసుకువస్తున్నాయి. అపార ప్రాణ, ఆస్తి నష్టాలకు కారణమవుతున్నాయి. వాతావరణంలో తలెత్తుతున్న అనేక మార్పులు ప్రకృతి వైపరీత్యాలకు దారి తీస్తున్నాయి. మొన్న నేపాల్ అతలాకుతలం చేసిన వరద భీభత్సం నుండి ఆ దేశం ఇప్పట్లో కోలుకునే అవకాశాలు కన్పించడం లేదు. నేటికీ ఎంత మంది అసువులు బాశారో, గల్లంతైనవారి పరిస్థితి ఏమిటో అర్థంకాదు. ఇక ఆస్తి నష్టం గూర్చి పూర్తి అంచనాలు అందలేదనే చెప్పొచ్చు. ఈ బీభత్సానికి కారణం మానవుని విధ్వంస చర్యలేననేది పర్యావరణ శాస్త్రవేత్తలే స్పష్టం చేస్తున్నారు. పర్యావరణాన్ని కాపాడుకోలేకపోతే మానవుని మనుగడే భవిష్యత్తులో ప్రశ్నార్థకంగా మారుతుందని ఎందరో పర్యావరణ శాస్త్రవేత్తలు, ప్రేమికులు ఎంతో కాలంగా పదేపదే చెబుతూ ఆందోళన వ్యక్తం చేస్తున్నా పట్టించుకునే నాధుడే లేకుండా పోతున్నాడు. పర్యావరణాన్ని కాపాడడం అటుంచి తూట్లు పొడవడం దురదృష్టకరం. అభివృద్ధి పేరుతో ప్రభుత్వాలు చేపడుతున్న కొన్ని కార్యక్రమాలు పర్యావరణానికి చేటు తెస్తున్నాయి. ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాల నుంచి మొదలుపెడితే కొండలను తొలచి ప్రాజెక్టులను, రహదారుల నిర్మాణం, నగరీకరణ పేరుతలో ప్రపంచవ్యాప్తంగా కోట్లాది ఎకరాల పంట పొలాలను జనవాసాలుగా మార్చడం ఒకటేమిటి ఎన్ని విధాలుగా పర్యావరణానికి నష్టం చేయగలుగుతారో అన్ని మార్గాల్లో నిత్యం అన్వేషణ, విధ్వంసం కొనసాగుతూనే ఉన్నది. విశ్వవ్యాప్తంగా పెను విధ్వంసాలు విరుచుకుపడుతున్నాయి. గత అర్థశతాబ్దంలో సంభవించిన దాదాపు పన్నెండువేలకుపైగా భారీ ఉత్పాతాల్లో దాదాపు ఇరవైఐదు లక్షల మందికిపైగా అసువులు బాసినట్లు అంచనా. అందులో అధికశాతం అభివృద్ధి చెందిన దేశాల్లోనే చోటు చేసుకుంటున్నాయనేది గమనించదగినది. మొన్నటి నేపాల్ వరదల విలయం నుంచి తేరుకోవాలంటే తమకు కనీసం ఐదువందల కోట్ల డాలర్లకుపైగా అవసరం అవుతాయని ఆదేశ ప్రభుత్వం అంచనా వేస్తున్నది. ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం మరో ఏడెనిమిదేళ్లలో ఇండియా జనాభా నూటయాభై కోట్ల సమీపానికి చేరుకుంటుందని అందుకు తగినట్లుగా దేశంలోని సహజవనరులపై ఒత్తిడి పెరుగుతుందని, ముఖ్యంగా అటవీ సంపద హరించుకుపోతుందని స్పష్టం చేసింది. ఇప్పటికే భారత్‌లో దాదాపు ప్రతిరోజూ మూడువందల యాభై ఎకరాలకుపైగా అటవీ భూములు అదృశ్యమైపోతున్నాయి. ఐక్యరాజ్యసమితి నివేదికలో వెల్లడయింది. బొగ్గుగనులు, ధర్మల్ విద్యుత్ కేంద్రాలు, పరిశ్రమలు, నదీలోయల ప్రాజెక్టుల కోసం యదేచ్ఛగా అడవులను నరికివేస్తున్నారు. ఇలాంటి కారణాలు ఎన్నో పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నాయి. ఇక ప్లాస్టిక్ వాడకం నియంత్రించడంలో విఫలమవుతున్నారనే చెప్పొచ్చు. ప్రశాంతంగా ఉన్న హిమాలయ మంచుకొండల్లో కూడా ఈ ప్లాస్టిక్ భూతం విస్తరిస్తున్నది. పర్యాటకులు పెరిగే కొద్దీ ఈ ప్లాస్టిక్ వాడకం పెరిగిపోతున్నది. కొన్ని ప్లాస్టిక్ వస్తువులు నిషేధించినా ఆ చట్టం తేవడం కాగితాలకే పరిమితమవుతున్నది. ప్లాస్టిక్ వినియోగం వల్ల పర్యావరణానికి ఎంత నష్టం కలుగుతున్నదో ప్రజల్లో అవగాహన కల్పించడంలో అధికార వర్గాలు విఫలమవుతున్నాయని చెప్పొచ్చు. ఇక పెట్రోలు, డీజిల్ ఇంధనాల వాడకం గురించి చెప్పక్కర్లేదు. వాహన కాలుష్య నియంత్రణ మాటలకే పరిమితమవుతున్నది. కల్తీ కూడా కాలుష్యాన్ని విపరీతంగా పెంచుతున్నది. ఇక పరిశ్రమలు వదులుతున్న పొగ, ధూళికణాలు తదితర అన్నీ కలిసి వాయుకాలుష్యాన్ని మరింతగా పెంచుతున్నాయి. ఇలాంటి రకరకాల కారణాలతో భూమి ఉష్ణోగ్రత పెరిగిపోతున్నది. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రత పెరిగి తీరప్రాంతాలు, దీవులతోసహా అనేక దేశాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని ఏనాటి నుంచో పర్యావరణ శాస్త్రజ్ఞులు హెచ్చరిస్తున్నారు. ఇలా ప్రకృతితో మనిషి ఆటలాడుకుంటుంటే అందుకు ప్రతీగా ప్రకృతి తీవ్రంగా స్పందిస్తున్నది. పర్యావరణ సమతుల్యం దెబ్బతిన్న కారణంగా సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిస్తే ఒకే ప్రాంతంలో కుంభవృష్టి కురవడం ఇటీవల కాలంలో పెరిగిపోతున్నది. అంతే కాదు వరదలు, తుఫాన్‌లు, భూకంపాలు లాంటి ఉపద్రవాలతోపాటు ఎల్‌నినో లాంటివి కూడా మానవ జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. ప్రస్తుతం విస్తరిస్తున్న సూపర్ ఎల్‌నినోతో వ్యవసాయరంగం కుదేలైపోతున్నది. యేటా దాదాపు మూడువందల ఎనభైకి పైగా ప్రపంచ వ్యాప్తంగా ఉపద్రవాలు సంభవిస్తున్నట్లు అధికార రికార్డులు వెల్లడిస్తున్నాయి. ఉపద్రవాల్లో వేలాది మంది ప్రాణాలు పోగొట్టుకుంటే లక్షలాది మంది రోగపీడితులుఅవుతున్నారు. పాకిస్థాన్, ఇరాన్, న్యూజిలాండ్, నేపాల్ జపాన్, లాంటి ఎన్నో దేశాలు తరచూ భూకంపాలను ఎదుర్కొంటున్నాయి. ఆ మధ్య సిరియాలో వచ్చిన భూకంపంతో తొమ్మిదివేల మందికిపైగా అసువులు బాశారు. పశ్చిమ ఆఫ్ఘానిస్థాన్‌లో భూప్రకంపనాలు విలయాన్నే సృష్టించాయని చెప్పొచ్చు. ఇప్పటికే ఆయా దేశాల్లోని బాధితులు కోలుకోలేకపోతున్నారు. మనదేశానికి సంబంధించి కూడా అనేక ప్రాంతాల్లో భూప్రకంపనాలు కన్పిస్తూనే ఉన్నాయి. పాలకులు తీసుకుంటున్న ముందుజాగ్రత్తల వల్ల కొంతమేరకు ప్రాణ, ఆస్తుల నష్టాన్ని నియంత్రించగలుగుతున్నారు. కానీ పర్యావరణ సమతుల్యత దెబ్బతిన్న కారణంగా ఏర్పడుతున్న ప్రకృతి విజృంభణకు అడ్డుకట్టవేయలేకపోతున్నారు. ఏది ఏమైనా ఈ ఉపద్రవాల నియంత్రణకు పర్యావరణాన్ని కాపాడేందుకు త్రికరణశుద్ధిగా కృషి చేయాలి. అన్నింటికంటే ముఖ్యంగా ప్రజల్లో అవగాహన కల్పించాలి. ఇందులో ఏమాత్రం నిర్లక్ష్యం చేసినా మరెన్నో ప్రళయాలు తప్పవు.



మనుషులందరూ మట్టి నుంచి వచ్చినవాళ్లే. వారు పరస్పరం గౌరవప్రదంగా వ్యవహరించవలసిన అవసరం ఎంతైనా ఉంది.

అంబేద్కర్



మనిషి మనసులో ఉత్సాహం అణగారితే, ప్రపంచంలో దాన్ని మించిన పేదరికం లేదు.

హెచ్.డబ్ల్యు ఆర్నాల్డ్

# చిన్నారుల భద్రతపై రాజీకి తావులేదు

**భవిష్యత్తులో ఎఐ మరింత శక్తివంతమవుతుంది. వర్చువల్ ప్రపంచాలు, మెటావర్స్, జనరేటివ్ ఎఐ కొత్తతరహా సోషల్ ప్లాట్‌ఫామ్‌లు మరింత విస్తరిస్తాయి. వాటితోపాటు కొత్తరకాల నేరాలు కూడా పుట్టుకొచ్చే అవకాశం ఉంది. కాబట్టి నేటి సమస్యకు మాత్రమే పరిష్కారం వెతకడం సరిపోదు. రేపటి డిజిటల్ ప్రమాదాలను ముందుగానే అంచనా వేసే విధానాలు అవసరం. సోషల్ మీడియా సంస్థలు సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. దర్యాప్తుసంస్థలు వేగంగా స్పందించాలి. తల్లిదండ్రులు,విద్యా సంస్థలు పిల్లలకు డిజిటల్ అవగాహన కల్పించాలి. సమాజం నేరస్థులను ప్రోత్సహించే లేదా బాధితులను నిందించే ధోరణిని విడిచిపెట్టాలి. చిన్నారిచేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ కేవలం వినోద సాధనంకాదు. అది ప్రపంచానికి ఒక ద్వారం. ఆ ద్వారం వెనుకవిద్య, అవకాశాలు ఉన్నట్లే ప్రమాదాలు కూడా ఉన్నాయి. ఆ ద్వారం గుండా ప్రమాదం చిన్నారి జీవితంలోకి చొరబడకుండా చూడటం మనందరి బాధ్యత.**

నండూరి రవిశంకర్

సాంకేతిక పరిజ్ఞానం మన జీవితాలను సులభతరం చేసింది. ప్రపంచాన్ని మన చేతిలోకి తెచ్చింది. సమాచారం, విద్య, వినోదం, ఉపాధి, సామాజిక సంబంధాలు ఇలా మనిషి జీవితంలోని దాదాపు ప్రతి అంశాన్నీ డిజిటల్ వేదికలు ప్రభావితం చేస్తున్నాయి. అయితే, ఈ సాంకేతిక విప్లవానికి మరో చీకటికోణం కూడా ఉంది. ముఖ్యంగా చిన్నారులు సామాజిక మాధ్యమాలను ఉపయోగిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో వారి భద్రత తీవ్రమైన సవాలుగా మారుతోంది. పిల్లలను లక్ష్యంగా చేసుకుని రూపొందించే లైంగిక వేధింపుల కంటెంట్, వారి చిత్రాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని దుర్వినియోగం చేయడం, ఆన్‌లైన్ గ్రూమింగ్, డీప్‌ఫేక్‌ల ద్వారా వేధింపులు ఇవన్నీ సమాజం ఎదుర్కొంటున్న అత్యంత ప్రమాదకరమైన డిజిటల్ నేరాల్లో భాగంగా మారాయి. ఈ నేపథ్యంలో చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌పై నేరుగా భారత దర్యాప్తు సంస్థలకు నివేదికలు అందించేందుకు మెటా అంగీకరించిందన్న తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఉపయోగించే వేదికలకు మాతృసంస్థ అయిన మెటా తీసుకున్న ఈ నిర్ణయం కేవలం ఒక సంస్థకు సంబంధించిన పరిపాలనా నిర్ణయంగా చూడలేం. డిజిటల్ ప్రపంచంలో పిల్లల హక్కులు, వారి గోప్యత, భద్రత, గౌరవాన్ని కాపాడేందుకు అవసరమైన బాధ్యతపై జరుగుతున్న పెద్ద చర్చలో ఇది ఒక ముఖ్యమైన మలుపు. ఇప్పటివరకు చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌పై మెటా అమెరికాకు చెందిన నేషనల్ సెంటర్ ఫర్ మిస్సింగ్ అండ్ ఎక్స్‌ప్లాయి టెడ్ చిల్డ్రన్‌కు సమాచారం అందించేది. అక్కడి నుంచి ప్రపంచంలోని వివిధ దర్యాప్తు సంస్థలకు సమాచారం చేరేది. ఈ విధానంలో భారత్‌కు కూడా వివరాలు అందేవి. ఇకపై భారత దర్యాప్తు సంస్థలకు మెటానే నేరుగా సమాచారం అందించేందుకు సిద్ధపడటం దర్యాప్తు ప్రక్రియను వేగవంతం చేసే అవకాశం ఉంది. ముఖ్యంగా డిజిటల్ నేరాల్లో సమయం అత్యంత కీలకం. ఒక నేరానికి సంబంధించిన డిజిటల్ ఆధారాలు తొలగిపోవడానికి, మార్పులకు గురికావడానికి లేదా ఇతర ఖాతాలకు బదిలీ కావడానికి ఎక్కువ సమయం పట్టదు. కాబట్టి సంబంధిత సమాచారాన్ని వేగంగా దర్యాప్తు సంస్థలకు అందించడం నేర నిరోధక చర్యల్లో కీలకమైన అంశం. అయితే, ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతుంది. మెటా నేరుగా సమాచారం అందించేందుకు అంగీకరించడం సరిపోతుందా? ఖచ్చితంగా కాదు. ఇది స్వాగతించదగిన పరిణామమే అయినప్పటికీ, పిల్లల ఆన్‌లైన్ భద్రత కోసం చేయాల్సిన పని ఇంకా ఎంతో ఉంది. సామాజిక మాధ్యమాల్లో ఒకసారి హానికరమైన కంటెంట్‌కి అవకాశం లభిస్తే దాని వ్యాప్తిని ఆపడం అంత సులభం కాదు. ఒక ఖాతా నుంచి తొలగించిన కంటెంట్ మరో ఖాతాలోకి, అక్కడి నుంచి మరో ప్లాట్‌ఫామ్‌లోకి వెళ్లే ప్రమాదం ఉంది. ముఖ్యంగా కృత్రిమ మేధ, డీప్‌ఫేక్ సాంకేతికతలు అందు బాటులోకి వచ్చిన తరువాత ఈ సమస్య మరింత సంక్లిష్టమైంది. నిజమైన ఫొటోలు, వీడియోలను మార్చడం మాత్రమే కాదు అసలు లేని దృశ్యాలను కూడా అత్యంత వాస్తవికంగా సృష్టించే స్థాయికి సాంకేతికత చేరింది. ఈ పరిణామం చిన్నారుల విషయంలో మరింత తీవ్రమైన ప్రమాదాన్ని సృష్టిస్తోంది. ఒక పిల్లవాడి లేదా పిల్లవాడి కుటుంబ సభ్యుడి ఫొటోను తీసుకుని దాన్ని దుర్వినియోగం చేయడం నిమిషాల్లో జరిగిపోవచ్చు. బాధిత కుటుంబానికి అది కలిగించే మానసిక వేదన మాత్రం సంవత్సరాల పాటు కొనసాగవచ్చు. అందుకే ఈ సమస్యను కేవలం కంటెంట్ మోడరేషన్ సమస్యగా చూడటం సరైంది కాదు. ఇది పిల్లల



హక్కులు, మానసిక ఆరోగ్యం, గోప్యత, వ్యక్తిగత గౌరవం, న్యాయ పరిరక్షణకు సంబంధించిన అంశం. ఇక్కడ ప్రభుత్వ బాధ్యత కూడా అత్యంత కీలకం.సామాజిక మాధ్యమ సంస్థలను బాధ్యత వహించేలా చేయడం మాత్రమే కాకుండా, భారత చట్టాలకు అనుగుణంగా స్పష్టమైన విధానాలు, వేగవంతమైన రిపోర్టింగ్ వ్యవస్థలు, సమర్థవంతమైన దర్యాప్తు యంత్రాంగం, శిక్షణ పొందిన సైబర్ నేరవిభాగాలను బలోపేతం చేయాలి. ఒక పిల్లవాడికి సంబంధించిన అభ్యంతరకరమైన కంటెంట్ బయటపడినప్పుడు ఫిర్యాదు ఎక్కడ చేయాలి? దాన్ని ఎంత సమయంలో తొలగించాలి? దర్యాప్తు సంస్థలకు సమాచారం ఎప్పుడు అందాలి? బాధితుడి గుర్తింపు ఎలా రక్షించాలి? ఈ ప్రశ్నలకు స్పష్టమైన, వేగవంతమైన వ్యవస్థ ఉండాలి. అదే సమయంలో, సోషల్ మీడియా సంస్థలు కూడా చట్టం అడిగినప్పుడు స్పందిస్తాం అనే కనీస బాధ్యతతో సరిపెట్టుకోకూడదు. నేరం జరిగిన తర్వాత స్పందించడం కంటే, నేరం జరగకుండా నిరోధించడం ముఖ్యం. అనుమానాస్పద ప్రవర్తనను గుర్తించే అల్గారిథమ్స్,పిల్లల ఖాతాలకు అదనపు భద్రతా చర్యలు, వయసు నిర్ధారణ వ్యవస్థలు, ప్రమాదకరమైన పరిచయాలను గుర్తించే సాంకేతికత, వేగవంతమైన మానవ పర్యవేక్షణ వంటి చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలి. అయితే ఇక్కడ మరో ముఖ్యమైన సమతుల్యతను మర్చిపోకూడదు. పిల్లల భద్రత పేరుతో ప్రతి ఒక్కరి వ్యక్తిగత గోప్యతను దెబ్బతీయకూడదు. వినియోగదారుల డేటాను నిర్బంధంగా సేకరించడం, అనవసరమైన పర్యవేక్షణ, పారదర్శకత లేని అల్గారిథమిక్ నిర్ణయాలు కూడా ప్రమాదకరమే. కాబట్టి భద్రతతో పాటు గోప్యత, పారదర్శకత, చట్టబద్ధత కూడా సమానంగా పరిరక్షించాలి. చిన్నారుల రక్షణ కోసం తీసుకునే చర్యలు స్పష్టమైన న్యాయపరమైన చట్రంలోనే ఉండాలి. మరోవైపు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు,పాఠశాలలు కూడా తమ బాధ్యతను గుర్తించాలి. పిల్లలకు మొబైల్ ఫోన్ ఇవ్వడం లేదా సోషల్ మీడియా ఖాతా తెరవడం మాత్రమే కాకుండా డిజిటల్ ప్రపంచంలో ఎలా ప్రవర్తించాలి, ఎవరితో మాట్లాడాలి, ఏ సమాచారాన్ని పంచుకోకూడదు, అనుమానాస్పదమైన మెసేజ్ వచ్చినప్పుడు ఏంచేయాలి వంటివిషయాలను నేర్పించాలి. పిల్లలు భయపడకుండా తల్లిదండ్రులతో మాట్లాడగల వాతావరణం ఏర్పడటం చాలా ముఖ్యం. ఏదైనా వేధింపు ఎదురైనప్పుడు నువ్వే తప్పు చేశావు అనే భావన కలిగిస్తే పిల్లలు సమస్యను దాచిపెట్టే ప్రమాదం ఉంది. చిన్నారులపై లైంగిక వేధింపులకు సంబంధించిన కంటెంట్‌ను చూడటం, డౌన్‌లోడ్ చేయడం, ఫార్వర్డ్ చేయడం, నిల్వ చేయడం లేదా ఇతరులకు పంపడం సరదాగాభావించే సంస్కృతికి పూర్తిగా ముగింపు పలకాలి. ఇలాంటి కంటెంట్ ఎదురైతే దాన్ని మరింత వ్యాప్తి చేయకుండా సంబంధిత వేదికలో రిపోర్ట్ చేయడం, చట్టబద్ధమైన మార్గాల్లో అధికా రులకు సమాచారం ఇవ్వడం బాధ్యతాయుతమైన పౌరుడి కర్తవ్యం. మెటా తాజా నిర్ణయం ఈ దిశగా ఒక సానుకూలసంకేతం. అయితే దీనిని విజయంగా ప్రకటించి ఆగిపోతే ప్రయోజనం ఉండదు. ఇది ఒక ప్రారంభం మాత్రమే.కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసినట్లుగా పిల్లలకు సురక్షితమైన ఆన్‌లైన్ వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత సోషల్ మీడియా సంస్థలపై ఉంది. ఆ బాధ్యతను గుర్తుచేసేందుకు కఠినమైన నియంత్రణ, నిరంతర పర్యవేక్షణ, పారదర్శకమైనరిపోర్టింగ్ వ్యవస్థలు అవసరం. భవిష్యత్తులో ఎఐ మరింత శక్తివంతమవుతుంది. వర్చువల్ ప్రపంచాలు, మెటావర్స్, జనరేటివ్ ఎఐ కొత్తతరహా సోషల్ ప్లాట్‌ఫామ్‌లు మరింతవిస్తరిస్తాయి. వాటితోపాటు కొత్తరకాల నేరాలు కూడా పుట్టుకొచ్చేఅవకాశం ఉంది. కాబట్టి నేటి సమస్యకు మాత్రమే పరిష్కారం వెతకడం సరిపోదు. రేపటి డిజిటల్ ప్రమాదాలను ముందుగానే అంచనా వేసేవిధానాలు అవసరం. సోషల్ మీడియా సంస్థలు సాంకేతికతను బాధ్యతాయుతంగా ఉపయోగించాలి. దర్యాప్తుసంస్థలు వేగంగా స్పందించాలి. తల్లిదండ్రులు,విద్యా సంస్థలు పిల్లలకు డిజిటల్ అవగాహన కల్పించాలి.సమాజం నేరస్థులను ప్రోత్సహించే లేదా బాధితులను నిందించే ధోరణిని విడిచిపెట్టాలి. చిన్నారిచేతిలో ఉన్న స్మార్ట్‌ఫోన్ కేవలం వినోద సాధనం కాదు. అది ప్రపంచానికి ఒక ద్వారం. ఆ ద్వారం వెనుకవిద్య, అవకాశాలు ఉన్నట్లే ప్రమాదాలు కూడా ఉన్నాయి. ఆ ద్వారంగుండా ప్రమాదం చిన్నారి జీవితంలోకి చొరబడకుండా చూడటం మనందరి బాధ్యత. ●

# రోబోల యుగంలో సృజనాత్మకతకు ప్రాధాన్యత

సి.హెచ్.ప్రతాప్

తమ పిల్లలు చదువులో రాణించాలని కోరుకోని తల్లిదండ్రులు ఉండరు. మంచి మార్కులు, మంచిర్యాంకు, మంచి కళాశాలఇవే విజయానికి మెట్లని భావించడం సహజం. కానీ కాలం మారుతోంది. నేటి ప్రపంచంలో విద్యార్థి భవిష్యత్తును నిర్ణయించేది కేవలం పరీక్షల్లో సాధించిన మార్కులు కాదు.కొత్తగా ఆలోచించే సామర్థ్యం, సమస్యను విశ్లేషించే నైపుణ్యం, పరిష్కారాలను అన్వేషించే ధోరణి, బృందంగా పనిచేయగలగడం, నాయకత్వం,సమయ నిర్వహణ, ఆత్మవిశ్వాసం వంటి లక్షణాలకు కూడా సమాన ప్రాధాన్యం పెరుగుతోంది. ఇక్కడ మార్కులు అవసరం లేదు అనేది ఉద్దేశం కాదు. మార్కులు విద్యార్థి నేర్చుకున్న విషయాన్ని అంచనా వేయడానికి ఒక ప్రమాణంమాత్రమే. కానీ అవే విద్యార్థి మేధస్సుకు, ప్రతిభకు, భవిష్యత్తుకు తుది కొలమానంగా మారకూడదు. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థి ఒక కొత్త సమస్యకు పరిష్కారం ఆలోచించలేకపోతే, అతని విద్య అసంపూర్ణంగానే ఉంటుంది. అదే సమయంలో కొంత తక్కువ మార్కులు సాధించినా, ప్రశ్నించగలిగే, ప్రయోగించగలిగే, కొత్త ఆలోచనలను సృష్టించగలిగే విద్యార్థి భవిష్యత్తులో ఎంతో దూరం వెళ్లగలడు. అందుకే మార్కుల ఆధారిత విజయ భావన నుంచి సృజనాత్మకత ఆధారిత అభ్యాసం వైపు విద్యను మళ్లించాల్సిన సమయం వచ్చింది. సృజనాత్మకత అంటే కేవలం చిత్రాలు గీయడం, కథలు రాయడం, సంగీతం నేర్చుకోవడం కాదు. ఒక విషయాన్ని అనేక కోణాల్లో చూడటం, సాధారణ విషయంపై అసాధారణ ప్రశ్న అడగటం, ఒక సమస్యకు ఒకటి కంటే ఎక్కువ పరిష్కారాలను వెతకటం,తప్పు జరిగినప్పుడు కారణాన్ని తెలుసుకుని మళ్లీ ప్రయత్నించడం సృజనాత్మక ఆలోచన. ఇందులో ఊహాశక్తితో పాటు పరిశీలన,ఆసక్తి,విమర్శనాత్మక ఆలోచన,ప్రయోగించే ధైర్యం ఉంటాయి. సృజనాత్మకత వల్ల విద్యార్థిలో కేవలం కొత్త ఆలోచనలు మాత్రమే పుట్టవు. వైఫల్యాన్ని ఎదుర్కొనే పట్టుదల పెరుగుతుంది.భవిష్యత్తులో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తనను తానుమార్చుకునే సామర్థ్యం కూడాబలపడుతుంది. ఈ అవసరాన్ని జాతీయ విద్యావిధానం 2020కూడా స్పష్టంగా గుర్తించింది. కేవలం కంఠస్థ విద్యకు బదులుగా భావనాత్మక అవగాహన, సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన, సమస్య పరిష్కారం, అనుభవాత్మక అభ్యాసం, బహుళశాఖల విద్యకుప్రాధాన్యం ఇవ్వాలని విధానం సూచించింది. కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ వివరాల ప్రకారం, ప్రయోగా త్మక అభ్యాసం, కళల సమన్వయం, క్రీడల సమన్వయం, కథా ఆధారిత బోధన వంటి పద్ధతులను ప్రోత్సహిస్తున్నారు. కేంద్ర మాధ్యమిక విద్యామండలి కూడాసృజనాత్మకత, స్వయంచింతన, విమర్శనాత్మక ఆలోచనను పెంచే అనుభవాత్మక అభ్యాసాన్ని అమలు చేస్తోంది. చాలా పాఠశాలల్లో ఇప్పటికీ విద్యార్థి ప్రతిభకు ప్రధాన కొలమానం మార్కులే. పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించాలనే ఒత్తిడితో పిల్లలు పాఠ్యాంశాన్ని అర్థంచేసుకోవడం కంటే కంఠస్థం చేయడం, అడిగిన ప్రశ్నకు సిద్ధంగా ఉన్న సమాధానాన్ని తిరిగిరాయడం వైపు మళ్లుతున్నారు. ఈ కంఠస్థ విద్యా విధానం తాత్కాలికంగా పరీక్షా ఫలితాలను మెరుగుపరచవచ్చు కానీ ప్రశ్నించేస్వభావం, స్వతంత్ర ఆలోచన,సమస్యను అనేక కోణాల్లో చూసే సామర్థ్య క్రమంగా తగ్గేప్రమాదం ఉంది. నిరంతర పరీక్షల ఒత్తిడి పిల్లల్లో ఆందోళనను పెంచడమే కాకుండా, తప్పు చేయడానికి, కొత్తగా ప్రయత్నించడానికి కూడా భయపడే పరిస్థితిని సృష్టిస్తుంది. దీనికి భిన్నంగా అనేక అభివృద్ధి చెందిన విద్యా వ్యవస్థలు విద్యార్థులకు తమ ఆలోచనలను వ్యక్తం చేసే అవకాశం,ఒక సమస్యకు అనేక పరిష్కారాలను అన్వేషించే అవకాశం, ప్రాజెక్టులు, పరిశోధన, బృందపని, అనుభవాత్మక అభ్యాసానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాయి.మార్కులను తగ్గించడం కాదు మార్కులకు ఉన్న ఏకైక ఆధిపత్యాన్ని తగ్గించాలి.రేపటి ప్రపంచాన్నియంత్రాలుఎంత మార్చినా, దానికి కొత్తదిశ చూపించేది మనిషి ఆలోచనే.ఆ ఆలోచనకు విత్తనం పడేది పాఠశాల తరగతి గదిలోనే. ●

# చేనేత కులాలు ఏకమవుతున్న వేళ

శిరందాసు నాగార్జున

చేనేత వర్గాల వారు అన్ని రంగాలలో అభివృద్ధి చెందాలన్న దృఢసంకల్పంతో చేనేత కులాల వారు అందరూ ఏకమవుతున్నారు. చేనేత వర్గంవారు విద్య, వ్యాపారపరంగా ఎదుగుతూ సమాజంలో ప్రత్యేక గుర్తింపు పొందుతున్నప్పటికీ, రాజకీయంగా తగిన ప్రాధాన్యత లేదన్న భావన వారిలో నెలకొంది. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో వ్యవసాయం తరువాత అత్యధిక మంది చేనేత, దాని అనుబంధ రంగాలపైనే ఆధారపడి జీవిస్తున్నారు. అంతేకాకుండా, ఈ రెండురాష్ట్రాలకు చెందిన చేనేత కులాల వారు విద్య, వైద్యం, వ్యాపార రంగాలలో ప్రపంచ వ్యాప్తంగా విస్తరించి ఉన్నారు. మన దేశంలో తరతరాలుగా చేనేత వృత్తిపైనే జీవించే కులాలు అనేకం ఉన్నాయి. అనేక చేనేత కులాల వారు ఉన్నారు. ఇందులో దాదాపు18 చేనేత కులాల వారు రెండు తెలుగు రాష్ట్రాలలో ఉన్నారు.ఇందులో కొన్ని కులాలు జాతీయస్థాయిలో అంత్యంత వెనుకబడిన కులాల(ఎంబీసీ) జాబితాలో ఉన్నాయి. చేనేత కులాల వారు అన్ని రంగాలలో పరస్పరం సహకరించుకుంటూ, రాజకీయంగా కూడా ఎదగడానికి ప్రయత్నిస్తున్నారు. అలాగే, ఈ కులాల మధ్య ఐక్యత కోసం వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్, ఆలిండియా వీవర్స్ ఫెడరేషన్, అఖిల భారత పద్మశాలి సంఘం, ఇతర చేనేత కుల సంఘాల వారు తీవ్రంగా కృషి చేస్తున్నారు. చేనేత కులాల వారు రాజకీయంగా బలపడటంతోపాటు, చట్టసభల్లో తమ వాటా స్థానాలకోసం ప్రయత్నించాలని నిర్ణయించుకున్నారు. చేనేత ఉత్పత్తులు, ఆప్కోప్రక్షాళన, చేనేత సహకార సంఘాల సమస్యలపై ఓవైపు చేనేత కార్మిక సంఘాలవారు రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించి, చేనేత ఉద్యమ శంఖారావం పూరించారు. ఒకే మగ్గంకే గమ్యం, చేనేత వర్గాలను ఏకం చేద్దాం అన్న పిలుపుతో న్యూజెర్సీలో వరల్డ్ వీవర్స్ ఆర్గనైజేషన్ యూఎస్ఏ ప్రాంతీయ సదస్సును నిర్వహించింది. కులం, ప్రాంతం, భాషలకు అతీతంగా ప్రపంచ వ్యాప్తంగా ఉన్న చేనేత కుటుంబాలను అంతర్జాతీయ వేదికపై ఏకం చేయాలన్నది ఈ సదస్సు లక్ష్యం. వ్యవసాయ రంగం తర్వాత అత్యధిక మంది జీవించే చేనేత కులాల నుంచి ఏపీ శాసనసభలో ఒక్కరు మాత్రమే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గత శాసనసభలో ఆ ఒక్కరు కూడాలేరు. అత్యంత దయనీయమైన పరిస్థితి ఏమిటంటే, రెండ తెలుగు రాష్ట్రాలలో చేనేత శాఖలకు మంత్రులుగా చేనేత రంగానికి చెందని ఇతర కులాల వారు ఉన్నారు. చేనేత కులాల మధ్య ఐక్యత లేకపోవడం, నాయకత్వం లోపమే దీనికి ప్రధాన కారణంగా భావిస్తున్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో దాదాపు పదిశాతం చేనేత కులాల జనాభా ఉన్నట్లు ఓ అంచనా.ఆ ప్రాతిపదికన జనాభా దామాషా ప్రకారం ఎన్నికలలో రాజకీయ పార్టీలు టికెట్లు కేటాయించా



లన్నది చేనేత వర్గాల డిమాండ్. రాజకీయ పార్టీలు తమను గుర్తించేవిధంగా ఐక్యత చాటే ప్రయత్నంలో చేనేత కులాల వారు ఏకం కానున్నారు.ఏపీలో 175 మంది శాసనసభ్యుల్లో చేనేతకులాల నుంచి ఒక్కరంటే ఒక్కరే ఉన్నారు.శాసన మండలిలో ఒకరు ఉన్నారు. అయినా, వారికి ఆశాఖమంత్రి పదవి కూడా ఇవ్వలేదు. తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీ నుంచి చేనేత కులాల వారు ఒక్కరు కూడా లేరు. టీఆర్ఎస్ నుంచి శాసనసభలోఇద్దరు మాత్రమే ఉన్నారు. అందువల్ల, తెలంగాణలో అత్యధికంగా ఉన్న చేనేత కులం పద్మశాలీయుల్లో ఒకరిని శాసన మండలికి తీసుకుని,మంత్రి పదవి ఇవ్వవలసిన అవసరం ఉంది. దీర్ఘకాలంగా చేనేత కులాలకు చెందిన వారికి మంత్రి పదవి ఇవ్వకపోవడం వల్ల వారి సమస్యలను ఇతర కులాలు, వృత్తులకు చెందిన మంత్రులకు చెప్పుకోవలసిన పరిస్థితి ఏర్పడింది. వారికి ఈ రంగం పట్ల తగినంత అవగాహన లేకపోవడ వల్ల వీరి సమస్యల పరిష్కారం పట్లవారు ఆసక్తి చూపించే అవకాశాలు తక్కువ. చేనేత వృత్తికి సంబంధించిన నూలు, సిల్క్, రంగులు, రసాయనాలు ముడిసరుకులు వంటి వాటిధరలు, చేనేత ఉత్పత్తులు, అమ్మకాలు,ఎగుమతులు,పన్నులు, సబ్సిడీలు, ఇతర సౌకర్యాలు వంటి సమస్యలు సమగ్రంగా తెలుసుకోవడానికి వారికి సమయం ఉండదు. ఈ కారణంగా కూడా చేనేత సమస్యలు రోజురోజుకు పేరుకుపోతున్నాయి. ఆ సమస్యల పరిష్కారం దిశగా కూడా అడుగులు పడటం లేదు. అవగాహనా లోపం వల్ల నిజమైన చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు అందడంలేదు.ప్రభుత్వానికి, మంత్రులకు,అధికారులకు చేనేత కార్మికుని బతుకు చిత్రంపై అవగాహన లేకపోవడం వల్లఇలా జరుగుతోంది. రాష్ట్రంలోని చేనేత కార్మికుల స్థితిగతులను, వృత్తిపరంగా వారు ఎదుర్కొనే సమస్యలను ప్రభుత్వానికి అర్థమయ్యేరీతిలో వివరించవలసి ఉంది. అందుకు చేనేత వర్గాలనుంచి, చేనేత రంగంపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తులు రాజకీయ నేతలుగా ఎదగవలసిన అవసరం ఉంది. చేనేత కులాల నుంచికొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రగడ కోటయ్యవంటి నేతలులేకపోవడం వల్ల ఈ రంగం నుంచి రాజకీయంగా నాయకత్వం లోపం కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది. వారు చేనేత కార్మికులకు సన్నిహితంగా ఉండేవారు. వారికి చేనేత సమస్యలపై పూర్తి అవగాహన ఉండేది. జాతీయ స్థాయిలో చేనేత గళం వినిపించగల దమ్ముండేది. అందువల్ల వారి హయాంలో ఈ రంగానికి ఎంతో మేలు జరిగింది. ఆ తరువాత ఈ కులాల విద్య, వ్యాపార,పారిశ్రామిక పరంగా ఎదిగినా,రాజకీయంగా బలహీనమవడం వల్ల చేనేత రంగానికి తీవ్ర నష్టం జరుగుతూ వస్తోంది. నేరుగా చేనేత రంగంతో సంబంధం ఉన్న, చేనేత వృత్తి, ఆ రంగంలోని సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నవారు శాసనసభలో, మంత్రి మండలిలో ఉండవలసిన అవసరం ఉంది. ఆ దిశగా, రాజకీయం లక్ష్యంతో ఉద్యమించాలని చేనేత కులాల వారు నిర్ణయించుకున్నారు. అందరూ ఐక్యంగా ఉండి ఒక్కతాటిపై నిలబడి, శాసనసభ్యులను గెలిపించుకోకపోతే పరిస్థితి ఇంకా దిగజారుతుందని వారు గ్రహించారు. ఈ నేపథ్యంలో చేనేత కుల సంఘాల పునరేకీకరణ అవసరాన్ని గుర్తించారు. ●

# ప్రజావాక్కు

### రోడ్ల విస్తరణ జరపాలి

**ఇవ** కరకట్ట రోడ్డు విస్తరణలో భాగంగా అక్కడ ఉన్న ఆశ్రమాన్ని తొలగించాలి. అడ్డుగా ఉన్నఅన్ని ఆశ్రమాలను, గుళ్లను కూడా తొలగించాలి. రోడ్ల విస్తీర్ణం చేస్తేనే నగరం అందంగా ఉంటుంది. అమరావతిలోని రోడ్ల విస్తీర్ణం చేస్తున్న సందర్భంగా కరకట్టను కూడా వెడల్పు చెయ్యాలని సంబంధిత అధికారులు నిర్ణయించడం అభినందనీయం. ఇక్కడ రికమండేషన్లు, మొహమాటాలు లేకుండా అడ్డమొచ్చిన అన్ని నిర్మాణాలను కూల్చి వెయ్యాలి. గతంలో జగన్ ముఖ్యమంత్రిగా ప్రమాణంచేసిన మొదట్లోనే, వేదికను కూల్చివేశారు. అప్పుడే కరకట్టమీద ఉన్నఆశ్రమాన్ని, ఇస్కాన్ కేంద్రాన్ని, గణపతి ఆశ్రమాన్ని, ఇంకొక స్వామి ఆశ్రమాన్ని కూల్చి వెయ్యకుండా, వేదికను కూల్చిన జేసీబీలు వెనక్కు వెళ్ళాయి. సుప్రీం కోర్టు పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వాలను రోడ్లకుఅడ్డంగా ఉన్న మందిరాలను, చెరువు కట్టలమీద ఉన్న మందిరాలను, పబ్లిక్ పార్కులలో ఉన్న మందిరాలను కూల్చి వెయ్యాలని హెచ్చరించింది.

- నార్నె వెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### మద్యం దుకాణాలను ఎత్తివేయాలి

**తమిళనాడు** ప్రభుత్వం ప్రార్థనాలయాలు, విద్యాసంస్థలు, బస్టాండ్ల సమీపంలో ఉన్న మద్యం దుకాణాలను తొలగించేందుకు తీసుకున్న నిర్ణయం ప్రశంసనీయమైనది. ఇటువంటి చర్యలు విద్యార్థులకు, ప్రజలకు ప్రశాంతమైన వాతావరణాన్ని కల్పించడంలో దోహదపడతాయి. ఆధ్యాత్మిక కేంద్రాల పవిత్రతను, విద్యాలయాల గౌరవాన్ని కాపాడే ఈ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా పరిశీలించి అమలు చేస్తే సమాజ శ్రేయస్సుకు మరింత తోడ్పాటు అందుతుంది. సమాజంలో సానుకూల ఆలోచనలు, మంచి విలువలు, ఆరోగ్యకరమైన జీవనవిధానాన్ని ప్రోత్స హించేందుకు కూడా ఇది దోహదపడుతుంది.

- ఎన్. కృష్ణ, హైదరాబాద్

### నోటీసులకు వేగంగా స్పందించాలి

**రాష్ట్రవ్యాప్తంగా** చేపట్టిన ఓటరు ప్రక్షాళన జాబితాలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు తగిన గుర్తింపు పత్రాలతో వేగంగా స్పందించి ఓటు హక్కు కాపాడుకోవాలి. ఓటర్లు నోటీసులకు సంబంధించిన పత్రాలు బీఎల్వోలు దాదాపు నాలుగైదు రకాల పత్రాలు అడుగుతున్నారు. ఏ పత్రం ఐతే అవసరమో ఆ పత్రాన్ని వివరాలు తీసుకుని వెంబడే ఆన్లైన్‌లో అప్లోడ్ చేయాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### అందరూ సమానమే

**గణపతి** మండపాలలో ఒకరిని ఎక్కువగాను, ఒకరిని తక్కువగాను చూడటం మంచిదికాదు. ఆ వ్యత్యాసాలు దేవుడ్ని ప్రతిష్ఠించిన పవిత్ర మండపాలలో అసలు చేయకూడదు. అక్కడ అందరూ సమానమే! బంధు ప్రీతి, ప్రాంతం, కులమతాలు అక్కడ చూపకూడదు. వినాయకుని మండపాల దగ్గర ఎదుటివారిని చిన్నచూపు చూస్తే వాళ్ళ మనోభావాలు దెబ్బ తింటాయి. ఇలాచేయడం వల్ల కొన్నిచోట్ల ఘర్షణ జరగడానికి అవకాశం ఇచ్చిన వారమవుతాం. గణేష్ మండపాలలో అతిగా ప్రవర్తిస్తూ, ఏ ఎండకా గొడుగు పట్టేవారిని, నీతి, నిజాయితీ తప్పే వారిని వినాయకుడు గమనిస్తూ ఉంటాడని మాత్రం మరచిపోవద్దు. విఘ్నేశ్వరుడు మనకే కాదు, అందరికీ పూజ్యుడు . ఆయనను పూజించి నిశ్చలహృదయంతో ధ్యానిస్తే, మంచి బుద్ధి కలుగుతుంది. కార్య సిద్ధి సిద్ధిస్తుంది. లేకపోతే ఆకార్యం నిర్విఘ్నంగా కొనసాగదు.

- కాయల నాగేంద్ర, హైదరాబాద్

### సబ్జెక్టు అటెండెన్స్ ఉండాలి

విద్యార్థులు కొన్ని సబ్జెక్టులలో హాజరు కావడం లేదు. నోట్స్ రాసుకోవడం లేదు. వాటర్, భోజన విరామ సమయం పేరుతో బయట తిరుగుతున్నారు. స్మోకింగ్, గంజాయి, మత్తు పదార్థాలను సేవించడం వంటివి చేస్తున్నారు. అలాంటివారు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా పేరెంట్స్ విద్యార్థులు ప్రతి తరగతిలో ప్రతి సబ్జెక్టు వినే విధంగా ప్రణాళిక రూపొందించాలి. కొన్ని సబ్జెక్టులకు మాత్రమే హాజరు అయ్యి మిగతా సబ్జెక్టులను వారికి వారుగా నిర్లక్ష్యం చేస్తున్నారు. ప్రతి విద్యార్థి ప్రతి సబ్జెక్టుకు హాజరు కావడం విద్యార్థుల డ్యూటీ. హాజరు కాకా పోవడానికి విద్యార్థులే బాధ్యులు. ఫెయిల్ అయినా కూడా లెక్చరర్స్, టీచర్స్‌లను తప్పు పట్టకూడదు.

- కదురు శ్రీనివాస్, వరంగల్

### అన్నదాతకు భరోసా కల్పించాలి

**ఆరుగాలం** శ్రమించి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు లేక కుదేలవుతున్న రైతన్న కష్టాలు వర్ణనాతీతం. అనాది నుంచి కర్షకుడికి అతివృష్టి, అనావృష్టి అవినాభావ సంబంధం అంటే అతిశయోక్తికాదు. అగ్నికి ఆజ్యం పోయకుండా కల్తీ విత్తనాలు, ఎరువులు తదితర వ్యవసాయ సంబంధిత వనరులతో మూలిగే నక్కమీద తాటికాయపడినట్లు ఈ యేడాది వర్షాభావంవల్ల పంటలకు కోలుకోలేని దెబ్బ. దేశానికి వెన్నెముఖ శ్రామికుడు కళ్లలో మెరుపులు చూసినప్పుడే ప్రజలు సుభిక్షం. ప్రభుత్వాలు అన్నదాత పట్ల చొరవ చూపాలి.

- కె.రామారావు, నల్గొండజిల్లా

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

# 76వ వసంతంలోకి ప్రధాని మోడీ

## సుదీర్ఘ పనిగంటలు, అలుపెరుగని ఉత్సాహం 'మోడీ స్పెషల్'

## కఠినమైన ఆహారపు అలవాట్లే ఆరోగ్య రహస్యం



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీనేడు 76వ వసంతంలోకి అడుగుపెట్టారు. ఈ వయసులోనూ ఆయన సుదీర్ఘ పని గంటలతో, అలుపెరగని ఉత్సాహంతో ఉండటం వెనుక ఉన్న రహస్యం ఏంటని చాలామంది ఆసక్తి చూపుతుంటారు. యోగా, వ్యాయామం ఆయన దినచర్యలో భాగమని అందరికీ తెలిసిందే. అయితే, ఆయన ఫిట్‌నెస్ రహస్యం ఖరీదైన డైట్ చార్టులలో కాకుండా, నిరాడంబరమైన భారతీయ సంప్రదాయ ఆహారం, కఠినమైన ఉపవాస దీక్షలలో దాగి ఉంది. ఆయన ఆహార నియమాల్లో ఫ్యాషన్ డైట్‌లకు చోటు లేదు, కేవలం ఇంట్లో వండిన భోజనం, స్థానిక ఉత్పత్తులకే ప్రాధాన్యం ఉంటుంది. ప్రధాని మోడీ ఆహారంలో మునగాకు పరాఠాకు ప్రత్యేక స్థానం ఉంది. 2020లో జరిగిన ఫిట్ ఇండియా డైలాగ్ కార్యక్రమంలో పోషకాహార నిపుణురాలు రుజుతా దివేకర్‌తో మాట్లాడుతూ, తాను వారానికి ఒకటి లేదా రెండు సార్లు మునగాకుతో చేసిన పరాఠాలు తింటానని స్వయంగా వెల్లడించారు. పోషకాలు పుష్కలంగా ఉండే మునగాకును ఆహారంలో చేర్చుకోవడానికి ఇదొక సులువైన మార్గమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇదే సంభాషణలో పసుపు తీసుకుంటున్నావా అని తన తల్లి ఎప్పుడూ అడిగేవారని గుర్తుచేసుకున్నారు. ఇది సంప్రదాయ భారతీయ పదార్థాలపై ఆయనకున్న నమ్మకాన్ని తెలుపు తుంది. ఆయన ఆహారపు అలవాట్లన్నీ రోటీ, కూర, పప్పు, అన్నం, పోహా, ఉప్మా వంటి సాధా రణ భారతీయ కుటుంబాల్లో కనిపించేవే. ఆహారం విషయంలో ఎంత సాదాసీదాగా ఉంటారో, ఉపవాసాల విషయంలో మాత్రం ప్రధాని మోడీ అంతే కఠినంగా ఉంటారు. ఈ నియమాలను ఆయన దశాబ్దాలుగా పాటిస్తు న్నారు. 2025లో లెక్స్ ఫ్రిడ్‌మన్‌తో మాట్లా డుతూ తన ఉపవాస దీక్షల గురించి వివరంగా తెలిపారు. చాతుర్మాస దీక్ష సమయంలో (సుమారు జూన్ మధ్య నుంచి దీపావళి వరకు) 24 గంటల్లో ఒక్కసారి మాత్రమే భోజనం చేస్తానని ఆయన తెలిపారు. ఇక సెప్టెంబర్ లేదా అక్టోబర్‌లో వచ్చే శరన్నవరాత్రుల సమయంలో 9 రోజుల పాటు ఎలాంటి ఆహారం తీసుకోకుండా కేవలం వేడినీళ్లు మాత్రమే తాగుతానని వెల్ల డించడం అందరినీ ఆశ్చర్యపరిచింది. చైత్ర నవరాత్రుల్లో మరో విభిన్నమైన నియమం పాటిస్తారు. ఈ 9 రోజుల పాటు రోజుకు ఒక్కసారి ఒకే రకమైన పండును తింటారు. బొప్పాయిని ఎంచుకుంటే, ఆ 9 రోజులు కేవలం బొప్పాయినే స్వీకరిస్తారు. దాదాపు 50–55 ఏళ్లుగా ఈ ఉపవాస దీక్షలను ఆచరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మొత్తం మీద చూస్తే, ప్రధాని మోడీ ఫిట్‌నెస్ రహస్యం ఫ్యాషన్ డైట్‌లలోనో, విదేశీ ఆహార పద్ధతుల్లోనో లేదు. మన వంటిళ్లలో వండుకునే పప్పుఅన్నం, నెయ్యి, రోటీ వంటి సంప్రదాయ భోజనాన్ని గౌరవి ంచడంలో, స్థానిక ఉత్పత్తులను ప్రోత్స హిం చడంలో, ఆధ్యాత్మిక విశ్వాసాలతో కూడిన కఠిన ఉపవాస దీక్షలను ఆచరించడంలోనే ఆయన ఆరోగ్య రహస్యం ఇమిడి ఉంది. ప్యాకేజ్డ్, ప్రాసెస్ చేసిన ఆహారానికి దూరంగా ఉంటూ, తాజాగా వండిన భోజనానికే ఆయన ఎప్పుడూ ప్రాధాన్యతనిస్తారు.

## ప్రధానిమోడీకి జన్మదిన శుభాకాంక్షల వెల్లువ

ప్రధాని నరేంద్ర మోడీ గురువారం 76వ పుట్టిన రోజు జరుపుకున్న నేపథ్యంలో శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. భారతీయ జనతా పార్టీ మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా సంకల్ప్ అభియాన్ ప్రచారాన్ని చేపట్టింది. మోడీ ప్రజాజీవితానికి 25 ఏళ్లు నిండిన నేపథ్యంలో ఆ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈనెల 17వ తేదీ ఆయన పుట్టిన రోజు కాగా, ఇక అక్టోబర్‌లో ఆయన ప్రజాజీవితానికి 25 ఏళ్లు నిండనున్నాయి. మోడీ జన్మదినం సందర్భంగా ఇవాళ దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. టీడీపీ చీఫ్, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, శివసేనా ప్రెసిడెంట్ ఏకనాథ్ షిండే, ఎల్‌జీపీ ప్రెసిడెంట్ చిరాగ్ పాశ్వాన్‌తో పాటు మూడు చోట్ల కార్యక్రమాలను నిర్వహించనున్నారు. వారాణాసిలో చంద్రబాబు, పాశ్వాన్ పాల్గొంటారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ మోడీ ఆరోగ్యాన్ని కోరుకుంటూ పూజలు చేయనున్నారు. వారాణాసిలో సుమారు 51 మంది బైకర్లు గంగా నదిలో నీటిని తీసుకుని కాశీ విశ్వనాథ్ ఆలయంలో జలాభిషేకం నిర్వహించారు. గుజరాత్‌లోని వాద్‌నగర్‌లో కేంద్ర మంత్రి అమిత్ షా ప్రత్యేక కార్యక్రమంలో పాల్గొన్నారు. వాద్‌నగర్‌లోనే మోడీ జన్మించారు. సిటీలో ఉన్న జగన్నాథ్ టెంపుల్‌లో షా పూజలు చేయనున్నారు. షిండేతో పాటు అనుప్రియా పాటిల్ ఆ కార్యక్రమంలో పాల్గొంటారు. ఇక ఉజ్జయినిలో బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ ప్రత్యక పూజలు చేయనున్నారు. ఢిల్లీలో రక్తదాన శిబిరాన్ని కూడా ప్రారంభించనున్నారు. 1950, సెప్టెంబర్ 17వ తేదీన వాద్‌నగర్‌లో మోడీ జన్మించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత జన్మించిన తొలి ప్రధాని ఆయనే కావడం విశేషం. ఇక గుజరాత్ సీఎం ఆయన 2001, అక్టోబర్ 7వ తేదీన బాధ్యతలు స్వీకరించారు. ఈ ఏడాది అక్టోబర్‌లో ఆయన ప్రజాజీవితానికి 25 ఏళ్లు పూర్తి కానున్నాయి. మోడీ నాయకత్వంలో దేశం వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా విశ్వాసంతో ముందుకు వెళ్తున్నట్లు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సడలని పట్టుదలతో మోదీ దేశాన్ని ముందుకు నడిపిస్తున్నారని అస్సాం సీఎం హిమంత శర్మ అన్నారు. మోడీ రాజకీయ జర్నీ త్యాగానికి, జాతీయ సేవకు, మొక్కవోని దీక్షకు నిదర్శనమని కేంద్ర మంత్రి అమిత్ షా అన్నారు. ప్రధానికి బర్త్‌డే గ్రీటింగ్స్ చెప్పిన రాష్ట్రపతి ముర్ము తన ఎక్స్‌లో రియాక్ట్ అయ్యారు.సుపరిపాలనలో కొత్త ప్రమాణాలను మోడీ నెలకొల్పినట్లు ఆమె అన్నారు. దేశ సమగ్ర అభివృద్ధికి ఆయన కొత్త మార్గదర్శనం చేస్తున్నట్లు చెప్పారు.

# రష్యా చమురు దిగుమతులపై చైనా, భారత్‌కు ట్రంప్ వార్నింగ్!



**వాషింగ్టన్, సెప్టెంబరు 17:** రష్యా నుంచి చమురు, సహజవాయువు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా వంటి దేశాలకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం తీవ్రమైన హెచ్చరికలు జారీ చేసింది. రష్యాపై ఆధారపడటం తగ్గించుకోకపోతే, అసాధారణమైన ఆర్థిక ఆంక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని స్పష్టం చేసింది. రష్యాపై కొత్త ఆంక్షల బిల్లును యూఎస్ కాంగ్రెస్ ఆమోదించిన నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యతను సంతరించుకుంది. అమెరికన్ కాంగ్రెస్‌లో రిపబ్లికన్ సెనేటర్ రిచర్డ్ బ్లూమెంటల్ మాట్లాడుతూ భారత్, చైనాలకు మా సందేశం ఒక్కటే. మీ పద్ధతి మార్చుకోండి. మీకు కావాల్సిన చమురు, గ్యాస్‌ను వేరే దేశాల నుంచి కొనండి. బుజ్జగింపులు సరైన వ్యూహం కాదని ఘాటుగా వ్యాఖ్యానించారు. ఈ కొత్త ఆంక్షల ద్వారా రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను చర్చల వైపు నెట్టి, ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకవచ్చని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పుతిన్, మా దగ్గర నీ నంబర్ ఉంది. ఉక్రెయిన్ మీరు ఒంటరి కాదని ఆయన అన్నారు. లిండ్సే ఓ గ్రాహం సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ ఆఫ్ 2026 పేరుతో రూపొందించిన ఈ చట్టం, రష్యా అధికారులు, బ్యాంకులు, అలాగే రష్యా ఇంధనాన్ని ప్రపంచవ్యాప్తంగా రవాణా చేస్తున్న షాడో ఫ్లీట్ (రహస్య ట్యాంకర్ల వ్యవస్థ)పై కఠిన ఆంక్షలు విధిస్తుంది. ఈ చట్టం ప్రకారం, రష్యా నుంచి అత్యధికంగా చమురు, గ్యాస్ దిగుమతి చేసుకుంటున్న మొదటి ఐదు దేశాలపై 100శాతం వరకు టారిఫ్‌లు విధించే అధికారాన్ని అమెరికా అధ్యక్షుడికి కట్టబెడుతుంది. ఈ జాబితాలో భారత్, చైనాలు ప్రధానంగా ఉన్నాయి. రష్యా గ్యాస్ ఎగుమతుల్లో 15శాతం కంటే తక్కువ దిగుమతి చేసుకుంటూ, వాటిని తగ్గించడానికి గణనీయమైన చర్యలు తీసుకున్న దేశాలకు మినహాయింపు ఇచ్చారు. ఈ బిల్లుకు అమెరికా ప్రతినిధుల సభలో 262–159 ఓట్ల తేడాతో ఆమోదం లభించింది. ప్రస్తుతం ఇది అధ్యక్షుడు ట్రంప్ సంతకం కోసం వేచి ఉంది. అమెరికా హెచ్చరికలపై భారత ప్రభుత్వం తీవ్రంగా, స్పష్టంగా స్పందించింది. తమ దేశ ప్రజల ఇంధన భద్రతకు కట్టుబడి ఉన్నామని, మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి ఇంధన సరఫరాలను కొనసాగిస్తామని స్పష్టం చేసింది. అమెరికా తీసుకుంటున్న ఇలాంటి చర్యలు ఇరు దేశాల ద్వైపాక్షిక సంబంధాలను దెబ్బతీస్తాయని తాము ముందుగానే వాషింగ్టన్‌ను హెచ్చరించినట్లు న్యూఢిల్లీ పేర్కొంది. ఈ బిల్లు ఆమోదాన్ని గమనించామని, దీనివల్ల ద్వైపాక్షిక సంబంధాలపై, అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై పడే ప్రభావం గురించి గత కొన్ని నెలలుగా అమెరికన్ అధికారులతో జరిగిన చర్చల్లో చాలా స్పష్టంగా వివరించామని భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది.

భారత వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కూడా ఆ ప్రకటనలో ప్రభుత్వం స్పష్టం చేసింది. దేశంలోని వాణిజ్య, పారిశ్రామిక సంస్థలతో కలిసి ఈ చట్టం వల్ల కలిగే పరిణామాలను ఎదుర్కొంటామని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. తమ భారీ జనాభా, ఆర్థిక వ్యవస్థ అవసరాల దృష్ట్యా సురక్షితమైన, సరసమైన, నమ్మకమైన ఇంధన సరఫరాలు అత్యవసరమని భారత్ తన వైఖరిని పునరుద్ఘాటించింది.

## 100 శాతం సుంకాలపై భారత్ సీరియస్ రియాక్షన్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** రష్యా నుంచి చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం వరకు సుంకాలు విధించేలా అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన బిల్లుపై భారత్ స్పందించింది. దేశ వాణిజ్య, ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకునేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని స్పష్టం చేసింది. సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా కాంగ్రెస్ ఆమోదించిన విషయాన్ని గమనిస్తున్నామని విదేశాంగ శాఖ తెలిపింది. ఈ పరిణామంపై తదుపరి చర్యలను నిశితంగా పరిశీలిస్తున్నట్లు పేర్కొంది. రష్యా నుంచి అత్యధికంగా ముడిచమురు కొనుగోలు చేస్తున్న దేశాల్లో భారత్ ఒకటి. ఈ నేపథ్యంలో కొత్త చట్టం భారత్‌పై కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అయితే అమెరికా ప్రభుత్వం భారత్ నుంచి దిగుమతయ్యే ఏ వస్తువులపై ఎంత సుంకం విధిస్తుంది ఏ ఉత్పత్తులకు వర్తిస్తుంది ఎప్పటి నుంచి అమలు చేస్తుంది అనే అంశాలపై ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. 140 కోట్ల మంది భారతీయుల ఇంధన అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటుందని విదేశాంగ శాఖ తెలిపింది. మార్కెట్ పరిస్థితులకు అనుగుణంగా వివిధ దేశాల నుంచి చమురు దిగుమతులు కొనసాగిస్తామని పేర్కొంది. ఇటీవల అమెరికా అధికారులతో జరిగిన పలు ఉన్నతస్థాయి చర్చల్లో రష్యా చమురు కొనుగోళ్ల అంశాన్ని భారత్ ప్రస్తావించినట్లు వెల్లడించింది. ఈ నిర్ణయం భారత్‌అమెరికా సంబంధాలతో పాటు అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌పై చూపే ప్రభావాన్ని కూడా అమెరికా దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపింది. సాంక్షనింగ్ రష్యా అండ్ ఇరాన్ యాక్ట్ 2026ను అమెరికా సెనేట్ గత నెల ఆమోదించింది. బుధవారం ప్రతినిధుల సభలో 262159 ఓట్లతో బిల్లు ఆమోదం పొందింది. ఇక అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంతకం చేస్తే చట్టంగా మారుతుంది. రష్యా చమురు, గ్యాస్‌పై ఆధారపడటాన్ని తగ్గించేందుకు చైనా, భారత్ సహా పలు దేశాలపై 100 శాతం వరకు అదనపు సుంకాలు విధించే అధికారం ఈ చట్టం ద్వారా అమెరికా అధ్యక్షుడికి లభిస్తుంది. అమెరికా నుంచి వచ్చే తుది సుంకాల రేటు, ఏయే ఉత్పత్తులకు వర్తిస్తుందన్న వివరాలు వెల్లడైన తర్వాతే భారత్‌పై అసలు ప్రభావం ఎంత ఉంటుందో స్పష్టమవుతుంది.

## పెట్టుబడుల మోసం.. భారత్ సంతతి సిద్ధార్థ్ జవహర్‌కు 11 యేళ్ల జైలు

**న్యూయార్కు, సెప్టెంబరు 17:** అమెరికాలో భారీ పెట్టుబడి మోసానికి పాల్పడిన కేసులో భారత సంతతికి చెందిన సిద్ధార్థ్ జవహర్‌కు అక్కడి న్యాయస్థానం 11 ఏళ్ల జైలు శిక్ష విధించింది. సుమారు 31 మిలియన్ డాలర్ల అంటే సుమారు రూ. 335 కోట్ల మేర ఆర్థిక మోసానికి పాల్పడినట్లు రుజువు కావడంతో కోర్టు ఈ తీర్పునిచ్చింది. ఈ కేసులో బాధితుల్లో ప్రముఖ పాప్ సింగర్ టేలర్ స్విఫ్ట్ భర్త ట్రావిస్ కెల్సీ (అమెరికన్ ఫుట్‌బాల్ స్టార్) కూడా ఉండటం గమనార్హం. టెక్సాస్‌కు చెందిన స్విఫ్టార్క్ క్యాపిటల్ ఎల్‌ఎల్‌సీ అనే సంస్థకు సిద్ధార్థ్ జవహర్ సహ వ్యవస్థాపకుడు. ఇతనిపై 2023లో అభియోగాలు నమోదుకాగా, సుదీర్ఘ విచారణ అనంతరం కోర్టు తీర్పు వెలువరించింది. 11 ఏళ్ల జైలు శిక్షతో పాటు, బాధితులైన 64 మందికి 31.35 మిలియన్ డాలర్లను తిరిగి చెల్లించాలని జవహర్‌ను న్యాయస్థానం ఆదేశించింది. పెట్టుబడిదారుల నుంచి సేకరించిన నిధులను జవహర్ ఫిలిప్ మోరిస్ పాకిస్థాన్ (పీఎంపీ) అనే కంపెనీలో పెట్టుబడి పెట్టాడు. ఆ పెట్టుబడి విలువ భారీగా పడిపోయినప్పటికీ, ఆ నష్టాలను కప్పిపుచ్చి లాభాలు వస్తున్నాయని ఇన్వెస్టర్లను నమ్మించాడు. 2016 నుంచి 2023 మధ్య కాలంలో సుమారు 35 మిలియన్ డాలర్లు సేకరించిన ఆయన, అందులో కేవలం 10 మిలియన్ డాలర్లను మాత్రమే పెట్టుబడిగా పెట్టాడు. కొత్త పెట్టుబడిదారుల నుంచి వచ్చిన డబ్బును పాతవారికి చెల్లిస్తూ తరహాలో ఈ మోసానికి పాల్పడ్డాడు. మిగిలిన నిధులను తన జల్సాల కోసం ప్రైవేట్ జెట్లు, లగ్జరీ హోటళ్ళు, ఖరీదైన దుస్తులు, రెస్టారెంట్ల కోసం విచ్చలవిడిగా ఖర్చు చేశాడు. పెట్టుబడిదారుల నమ్మ కాన్ని జవహర్ దుర్వినియోగం చేశారు.

# గాఢనిద్ర పోతే రూ.13.76 లక్షలు బహుమతి

## జపాన్ మాట్రెస్ కంపెనీ విచిత్ర పోటీ



**టోక్యో,సెప్టెంబరు 17:** నిద్రపోవడమంటే విశ్రాంతి తీసుకోవడమే అనుకుంటాం. కానీ జపాన్‌లో మాత్రం నిద్రపోతే ఏకంగా లక్షలు గెలుచుకునే అవకాశం వచ్చింది. ఒక జపాన్ మ్యాట్రెస్ కంపెనీ నిద్రపై ప్రత్యేక పోటీ నిర్వహించనుంది. ఇందులో ఎవరు అత్యుత్తమంగా నిద్రపోతారో తేల్చి విజేతకు 22.2 లక్షల యెన్‌లు, అంటే భారత కరెన్సీలో సుమారు రూ.13.76 లక్షలు బహుమతిగా ఇవ్వ నున్నారు. అక్టోబర్ 5న టోక్యోలోని షేర్ గ్రీన్ మినామి అయోమాలో ఈ పోటీ జరగనుంది. పోటీలో పాల్గొనేవారికి 90 నిమిషాల సమయం ఇస్తారు. ఆ సమయంలో వారు ఎంత త్వరగా నిద్రలోకి జారుకున్నారు ఎంత గాఢంగా నిద్రపోయారునిద్ర ఎంత స్థిరంగా కొనసాగింది వంటి అంశాలను ప్రత్యేక పరికరాలతో నిర్వాహకులు పరిశీలిస్తారు. అయితే పోటీకి ముందు కంటెస్టెంట్లకు కొన్ని వ్యాయామాలు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ప్రతి ఒక్కరికీ దిండు, దుప్పటి, కంటి ముసుగు లాంటి ఏదో ఒక నిద్ర వస్తువు కేటాయిస్తారు. పోటీ కోసం ముందుగానే రాత్రంతా మేల్కొని ఉండటం, కావాలనే నిద్రకు దూరంగా ఉండటం వంటి వాటికి అనుమతి లేదు. సహజంగా వచ్చే నిద్రనే పరీక్షించాలన్నది నిర్వాహకుల ఉద్దేశం. నిద్ర పట్టేందుకు నిద్రమాత్రలు లేదా ఇతర మందులు వాడటంపైనా నిషేధం ఉంది. పోటీ సమయంలో నిర్వాహకులు కావాలనే కొన్ని అనూహ్యమైన అంతరాయాలు కలిగించే అవకాశం కూడా ఉంది. వాటి మధ్య కూడా నిద్రను ఎంత స్థిరంగా కొనసాగిస్తారన్నది పరిశీలించనున్నారు. ప్రధాన విజేతతో పాటు ప్రత్యేక ప్రతిభ కనబరిచిన వారికి కూడా బహుమతులు అందించనున్నారు. గాఢ నిద్రలోకి జారుకున్న వారికి డీప్ స్లీప్ డైవ్ అ వార్డు, చిత్రమైన భంగిమలో నిద్రపోయిన వారికి మరో ప్రత్యేక బహుమతి ఇవ్వనున్నారు. పోటీకి దరఖాస్తు చేసుకోవడం ఉచితం 16 వరకు దర ఖాస్తులు స్వీకరించారు. మూడు విడతల్లో పోటీ నిర్వహించి, ఒక్కో విడతలో సుమారు 20 మంది పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తు న్నారు. జపాన్‌లో పెరుగుతున్న నిద్రలేమి సమస్యపై అవగాహన కల్పించడంతో పాటు నాణ్యమైన విశ్రాంతి ప్రాధా న్యాన్ని చాటడమే ఉద్దేశమని తెలిపారు.

# హిందీ అమలుపై టివికె సర్కార్‌కు సుప్రీం షాక్




**చెన్నై, సెప్టెంబరు 17:** ప్రతి జిల్లాలో జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుకు అవసరమైన భూమిని గుర్తించాలంటూ ఇచ్చిన మధ్యంతర ఆదేశాలను వెనక్కి తీసుకోవాలన్న తమిళనాడు ప్రభుత్వ విజ్ఞప్తిని సుప్రీంకోర్టు గురువారం తిరస్కరించింది. రాష్ట్ర ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని సూచించిన ధర్మా సనం. తమిళ నాడులో హిందీని పూర్తిగా దూరంగా ఉంచలేం అని వ్యాఖ్యానించింది. జస్టిస్ బీవీ నాగ రత్న నేతృత్వంలోని ధర్మాసనం నవోదయ విద్యాలయాల కోసం ప్రతి జిల్లాలో అనువైన భూమిని మూడు నెలల్లోగా గుర్తించాలని తమిళ నాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అదే సమ యంలో భాషా విధానానికి సంబంధించిన అం శంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు చర్చలు కొనసాగించాలని సూచించింది. సంభాషణ, సహకార సమాఖ్య విధానం అవసరమని కోర్టు స్పష్టం చేసింది. రాష్ట్రవ్యాప్తంగా నవోదయ విద్యా లయాలను ఏర్పాటు చేయాలంటూ మద్రాస్ హై కోర్టు ఇచ్చిన ఆదేశాలను తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసిన సంగతి తెలిసిందే. దేశంలో జవహర్ నవోదయ విద్యాలయం లేని ఏకైక రాష్ట్రం తమిళనాడు.తమిళనాడు ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా వాదిస్తూ.. నవోదయ విద్యాలయాల పథకం మూ డు భాషల సూత్రంతో ముడిపడి ఉంది.

# జిన్‌పింగ్‌కు బ్రెయిన్‌స్ట్రోక్?

## సోషల్ మీడియాలో హల్‌చల్

**బీజింగ్, సెప్టెంబరు 17:** న్యూఢిల్లీలో జరిగిన 18వ బ్రిక్స్ సదస్సు తర్వాత చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఆరోగ్యంపై సోషల్ మీడియాలో తీవ్రమైన ప్రచారం జరుగుతోంది. సదస్సు మధ్యలో ఆయన సొమ్మసిల్లి పడిపోయారని, ఆ తర్వాత తీవ్రమైన బ్రెయిన్ స్ట్రోక్‌కు గురయ్యారని వదంతులు వ్యాపించాయి. ఈ ఆరోపణలకు ఎలాంటి అధికారిక ధ్రువీకరణ లేదు. చైనాలో ప్రవాస జీవితం గడుపుతున్న విపక్ష నేత వాన్‌జున్ క్సీ ఈ ప్రచారానికి తెరలేపడంతో ఇది అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. తన సోషల్ మీడియా పోస్టులో వాన్‌జున్ క్సీ పలు ఆరోపణలు చేశారు. సదస్సులో అస్వస్థతకు గురైన జిన్‌పింగ్‌కు ఆయన వ్యక్తిగత వైద్య బృందం అత్యవసర చికిత్స అందించిందని, భారత్‌లోని ఆసుపత్రిలో చేరితే విషయం బయటకు పొక్కుతుందని భయపడి పర్యటనను అర్థాంతరంగా ముగించుకుని ప్రత్యేక విమానంలో చైనాకు తిరిగి వెళ్లారని పేర్కొన్నారు. బీజింగ్‌లో దిగిన వెంటనే ఆయనను హెలికాప్టర్‌లో నేరుగా మిలిటరీ ఆసుపత్రికి తరలించారని, అక్కడ ఇస్కీమిక్ స్ట్రోక్‌కు శస్త్రచికిత్స జరిగిందని, ప్రస్తుతం ఆయన ఐసీయూలో ఉన్నారని క్సీ ఆరోపించారు. ఈ ప్రచారానికి, అధికారిక రికార్డులకు ఏమాత్రం పొంతన లేదు. చైనా విదేశాంగ శాఖ ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారమే, ఈనెల 12, 13 తేదీల్లో జిన్‌పింగ్ సదస్సులో పాల్గొన్నారు. 12న న్యూఢిల్లీకి చేరుకుని, తొలి సెషన్‌లో ప్రసంగించారు. ప్రధాని నరేంద్ర మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. 13న రెండో సెషన్‌లోనూ పాల్గొని, మధ్యాహ్నం ఢిల్లీ నుంచి బయలుదేరారు. భారత ఉన్నతాధికారులు ఆయనకు విమానాశ్రయంలో వీడ్కోలు పలికారు. సెప్టెంబర్ 12న ప్రధాని మోదీ ఇచ్చిన విందుకు జిన్‌పింగ్ గైర్హాజరైనప్పటికీ, సుదీర్ఘ ప్రయాణం, వరుస సమావేశాల కారణంగా ఆయన విశ్రాంతి తీసుకున్నారని, ఆయన స్థానంలో విదేశాంగ మంత్రి వాంగ్ యీ హాజరయ్యారని సంబంధిత వర్గాలు తెలిపాయి. అలాగే, సదస్సులో మోడీ ప్రసంగిస్తూ మధ్యలో ఆగి జిన్‌పింగ్ వైపు చూసి అంతా ఓకేనా అని అడగటం కూడా చర్చనీయాంశమైంది. అయితే అది ట్రాన్స్‌లేషన్ హెడ్‌ఫోన్లలో సాంకేతిక సమస్య వల్లే జరిగిందని, ఆరోగ్య సమస్య కాదని నివేదికలు చెబుతున్నాయి.

# అక్టోబర్ 1 నుంచి అమల్లోకి జనన, మరణాల నమోదు సవరణ చట్టం

## కేంద్రం గెజిట్ నోటిఫికేషన్ విడుదల




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** జనన, మరణాల ఆలస్య నమోదుపై నిబంధనలను మరింత కఠినతరం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన 'జనన, మరణాల నమోదు (సవరణ) చట్టం2026 అక్టోబర్ 1వ తేదీ నుంచి దేశవ్యాప్తంగా పూర్తిస్థాయిలో అమల్లోకి రానుంది. ఈ మేరకు భారత రిజిస్ట్రార్ జనరల్ (ఆర్‌జిఐ) మృత్యుంజయ్ కుమార్ నారాయణ్ అధికారికంగా గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పార్లమెంటు ఉభయ సభలు ఆమోదం తెలిపిన అనంతరం, రాష్ట్రపతి ఆమోద ముద్ర పడటంతో ఈ సవరణ బిల్లు చట్ట రూపం దాల్చింది. ఈ నూతన చట్టం ప్రకారం పుట్టుకలు, మరణాల వివరాల నమోదులో ఎలాంటి జాప్యం, అవకతవకలు జరగకుండా నిరోధించేందుకు ప్రభుత్వం పటిష్టమైన చర్యలను నిర్దేశించింది.సెక్షన్ 1 లోని ఉపసెక్షన్ (2) ద్వారా సంక్రమించిన అధికారాల మేరకు కేంద్ర ప్రభుత్వం 2026 అక్టోబర్ 1ని ఈ చట్ట నిబంధనలు అమలులోకి వచ్చే తేదీగా ఖరారు చేసినట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. ఈ నూతన సవరణ చట్టం ద్వారా డిజిటల్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం కావడంతో పాటు పాఠశాల ప్రవేశాలు, పాస్‌పోర్ట్, ఆధార్, ఓటర్ కార్డు, వివాహ రిజిస్ట్రేషన్లు, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు జనన ధ్రువీకరణ పత్రం అత్యంత కీలకమైన ప్రాథమిక పత్రంగా మారనుంది.

# మెడికల్ షాపుల్లో సిసిటివి కెమెరాలు తప్పనిసరి

- ప్రిస్క్రిప్షన్ మందుల విక్రయాలపై నిఘాకు కేంద్రం ప్రతిపాదన
- రికార్డులు కనీసం మూడు నెలలు భద్రపరచాలని సూచన

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** వైద్యుల సిఫార్సుతో విక్రయించే మందులపై కేంద్రం మరింత కఠిన నిఘాకు సిద్ధమవుతోంది. మందుల దుకాణాలు, ఇతర లైసెన్స్ పొందిన రిటైల్ కేంద్రాల్లో ప్రిస్క్రిప్షన్ ఆధారంగా మందులు విక్రయించే సమయంలో సిసి కెమెరా నిఘా తప్పనిసరి చేసే ప్రతిపాదనను కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తీసుకొచ్చింది. సెప్టెంబర్ 8న జారీ చేసిన ముసాయిదా నోటిఫికేషన్ ప్రకారం, రిజిస్టర్డ్ వైద్యుడు సూచించిన ఏదైనా మందును హోల్‌సేల్ విక్రయాలు మినహా ఇతర మార్గాల్లో సరఫరా చేసే సమయంలో లైసెన్స్ పొందిన ప్రాంగణంలో సిసిటివి వ్యవస్థ పనిచేస్తూ ఉండాలి. మందు విక్రయం జరిగిందని ధ్రువీకరించుకునేలా రికార్డింగ్ ఉండాలి.

# సంక్షిప్త వార్తలు

## వివాహితపై మాజీ ఎమ్మెల్యే అత్యాచారం!




**ముంబయి,సెప్టెంబరు 17:** వివాహితకు బలవంతంగా మద్యం తాగించి ఆపై తుపాకీ చూపించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన ఘటన మహారాష్ట్రలో కలకలం రేపుతోంది కళ్యాణ్‌భివండి ప్రాంతంలో 22 ఏళ్ల వివాహిత చేసిన ఫిర్యాదు ఆధారంగా బీజేపీ మాజీ ఎమ్మెల్యే నరేంద్ర పవార్, బర్తరఫ్ అయిన పోలీస్ ఉద్యోగి శైలేష్ పాటిల్‌పై పద్ఘా పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. తన భర్తతో ఉన్న వివాదాన్ని పరిష్కరించేందుకు సాయం చేస్తామని నమ్మించి తనను ఫామ్‌హౌస్‌కు తీసుకెళ్లారని అక్కడ లైంగిక దాడికి పాల్పడ్డారని మహిళ ఆరోపించింది. ఈ కేసుపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదుల హతం



**శ్రీనగర్, సెప్టెంబరు 17:** జమ్మూకశ్మీర్‌లోని ఉదం పూర్ జిల్లాలో గురువారం ఎన్‌కౌంటర్ జరిగింది. ఆ ఎదురుకాల్పుల్లో ఇద్దరు ఉగ్రవాదులు హతం అయ్యారు. ఉదంపూర్ జిల్లాలోని మజాల్తాలో అనుమానాస్పద కదలికలు ఉన్నట్లు బుధవారం సాయంత్రం అధికారులకు సమాచారం అందింది. దీంతో సంయుక్త బలగాలు ఆ ప్రదేశంలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఆ తర్వాత ఉగ్రవాదులు, భద్రతా దళాల మధ్య కాల్పులు మొదలయ్యాయి. గన్‌ఫైట్ సమయంలో ఇద్దరు ఉగ్రవాదులు హతమైనట్లు అధికారులు చెప్పారు.

## ఆదిత్య ఠాక్రేకు రూ.500 కోట్ల లీగల్ నోటీసు




**ముంబై, సెప్టెంబరు 17:** దివంగత నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా శాలియన్ మృతి కేసులో మహారాష్ట్ర మాజీ మంత్రి శివసేన (యుబిటి) నేత ఆదిత్య ఠాక్రేకు రూ. 500 కోట్ల లీగల్ నోటీసు జారీ అయింది. ఆయనతోపాటు ఎన్‌సిపి (ఎస్పీ), మహారాష్ట్ర మాజీ మంత్రి అనిల్ దేశ్‌ముఖ్‌కు కూడా ఈ నోటీసులు అందాయి. దిశా మృతి కేసులో న్యాయం కోసం చేస్తోన్న పోరాటాన్ని రాజకీయ ప్రేరేపితమైనదిగా చిత్రీకరించేందుకు వారు ప్రయత్నించారని ఆరోపిస్తూ ఆమె తండ్రి సతీశ్ ఈ నష్టపరిహారం కోరారు.

## లిండే గ్రాహం బిల్లుకు యుఎస్ చట్టసభల్లో ఆమోదం

**న్యూయార్క్,సెప్టెంబరు 17:** అమెరికా కీలక బిల్లును పాస్ చేసింది. రష్యాపై ఆంక్షలు విధించే బిల్లుకు చట్టసభ ప్రతినిధుల సభలో ఆమోదం దక్కింది. బుధవారం జరిగిన ఓటింగ్‌లో అనుకూలంగా 262, వ్యతిరేకంగా 159 మంది ఓటేశారు. పాసైన బిల్లు ఇప్పుడు అధ్యక్షుడు ట్రంప్ ముందుకు వెళ్తుంది. ఇప్పటికే ప్రపంచ దేశాలపై టారిఫ్‌లు విధిస్తూ ఉక్కిరిబిక్కిరి చేస్తున్న ట్రంప్‌కు ఇప్పుడు మరింత శక్తి తోడైనట్లు అయ్యింది. దక్షిణ కరోలినా దివంగత సేనేటర్ లిండ్సే గ్రహం గౌరవార్ధం ఈ బిల్లును రూపొందించారు. సుమారు ఏడాది పాటు ఆ బిల్లుపై చర్చలు జరిగాయి.

## పంజాబ్‌లో రైతుల రైల్‌రోకో: నిలిచిన రైళ్లు



**చండీగఢ్, సెప్టెంబరు 17:** దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల కోసం పంజాబ్ రైతులు రాష్ట్రవ్యాప్తంగా రైల్‌రోకో చేపట్టారు. పలు రైల్వే స్టేషన్ల వద్ద నిరసనలు తెలిపారు. ఈ నేపథ్యంలో పలు రైళ్లు నిలిచిపోగా, రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. గురువారం కిసాన్ మజ్దూర్ మోర్చా ఆధ్వర్యంలో పంజాబ్ రైతులు రాష్ట్రవ్యాప్తంగా 'రైల్ రోకో' ఆందోళన చేపట్టారు. దీంతో పలుచోట్ల రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కాగా, అమృత్‌సర్‌లోని దేవిదాస్‌పురా వద్ద రైతులు ధర్నా చేశారు.

# 22ఎ కాంగ్రెస్ తప్పుకాదు.. బిఆర్ఎస్ తప్పు

## పిసిసి చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్



**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** 22 ఎ భూముల వ్యవహారంలో తప్పు కాంగ్రెస్ పార్టీది కాదని, గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భూ దోపిడీ జరిగిందని పిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ ఆరోపించారు. గురు వారం ఢిల్లీలో విలేఖరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ భూవ్యవహారాలపై ప్రస్తు తం విచారణ జరుగుతోందని చెప్పారు. ఈ అంశంపై జ్యుడీషియల్ ఎంక్వైరీ జరగాలా? లేదా? అనేది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు. తెలంగాణ ఉద్యమ సమ యంలో పోరాటాలు చేసిన వారు సర్వం కోల్పోతే కెసిఆర్ కుటుంబం మాత్రం భూములను కొల్లగొట్టిందని ఆరోపించారు. గత ప్రభుత్వ భూ వ్యవహారాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విచారణకు ఆదేశించడం అభినంద నీయమన్నారు. 22ఎభూముల అంశంపై బిఆర్ఎస్ ఇప్పటికే జ్యుడీషియల్ విచారణకు డిమాండ్ చేస్తుందని. ప్రభుత్వం కూడా భూ వ్యవహారాలపై విచారణకు చర్యలు చేపట్టిందనీ వివరించారు.తన టి పిసిసి అధ్యక్ష పదవీకాలానికి మరో ఏడాది సమయం ఉందని మహేష్ కుమార్‌గౌడ్ తెలి పారు. మంత్రివర్గవిస్తరణ జరపాలా? వద్దా? అనేది ముఖ్య మంత్రి నిర్ణయిస్తారని అన్నారు. పార్టీలో పెండింగ్ లో ఉన్న పదవుల భర్తీపై అధిష్ఠా నంతో చర్చిస్తామని చెప్పారు. వీలైనంత త్వరగా డిసిసి అధ్యక్షులను నియ మిస్తామని వెల్లడించారు. రాష్ట్రంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల వివరాలను పార్టీ అధిష్టానానికి వివరిస్తానని తెలిపారు. పిసిసి అధ్యక్షుడిగా రెండేళ్లలో సంస్థాగతంగా సాధించిన పురోగతిని అధిష్ఠానం పెద్దలకు వివరిం చేందుకే ఢిల్లీకి వచ్చినట్లు చెప్పారు. గాంధీభవన్ నుంచి క్షేత్రస్థాయి వరకు పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేశామని పేర్కొన్నారు.

# క్రమశిక్షణ కమిటీ ముందు వివరణ ఇచ్చిన మంచిర్యాల కాంగ్రెస్ నేతలు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** పెద్దపల్లి ఎంపి గడ్డం వంశీకృష్ణ పర్య టన సందర్భంగా ఆయన కారును అడ్డుకొన్న ఆరుగురు గురువారం గాంధీభవన్‌లో క్రమశిక్షణ కమిటీ ఛైర్మన్ రవిని కలిసి వివరణ ఇచ్చారు. క్రమశిక్షణ కమిటీకి వచ్చిన ఫిర్యాదు మేరకు మంచిర్యాలకు చెందిన నాయకులకు ఛైర్మన్ మల్లు రవి నోటీసులు ఇచ్చారు. దండెపల్లి మండలం గూడెం గ్రామం పర్యటన సందర్భంగా కొందరు అసమ్మతి వాదులు అడ్డు కొని నినాదాలు చేయడమే కాకుండా అక్కడ ఫ్లెక్సీలను చింపివేశారు. నోటీసులు అందుకొన్న గడ్డం త్రిమూర్తి,అక్కల వెంకటేశ్వర్లు అంకతి శ్రీనివాస్, ముత్యాల శ్రీనివాస్,లక్కాకుల సృజన్ ఆకుల దర్గా ప్రసాద్‌లు వచ్చి వివరణ ఇచ్చారు. వీరు ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్ అనుచరులుకావడం విశేషం. సెప్టెంబరు 7న తొమ్మిది మంది కాంగ్రెస్ నేతలకు టిపిసిసి క్రమ శిక్షణకమిటీ షోకాజు నోటిసులు జారీచేసింది. గాంధీభవన్‌లో టిపిసిసి క్రమశిక్షణ కమిటీ సమావేశంలో ఛైర్మన్ మల్లు రవి ఎంపీ, వైస్ ఛైర్మన్ ఆనంతుల శ్యామ్ మోహన్‌కు తన వివరణ లేఖను గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే మాజీ డిసిసి అధ్యక్షులు నర్సా రెడ్డి కూడా అందజేశారు. గజ్వేల్ నర్సా రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఫిర్యాదు రావడంతో జూపల్లి మల్లారెడ్డికి నోటీ సులు జారీచేయగా, నర్సా రెడ్డిపై పలువురు ఫిర్యాదు చేయడంతో ఆయనకు కూడా షోకాజ్ నోటీసు ఇచ్చారు. ఈ అంశాలపై సంబంధిత నేతలు తమ వివరణను నిర్ణీత గడువులోగా సమర్పించాలనీ పదిరోజులక్రితం ఆదేశిం చారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి, సంజీవరెడ్డి పరస్ప రం ఫిర్యాదులు చేసుకోవడంతో వారికి కూడా షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

# అసెంబ్లీ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించిన స్పీకర్ ప్రసాద్‌కుమార్

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** తెలంగాణ ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా శాసనసభ ఆవరణలో జాతీయ జెం డాను అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆవి ష్క రించారు. ముందుగా జాతిపిత మహాత్మా గాంధీ, రాజ్యాంగ నిర్మా త డాక్టర్ బిఆర్ అంబే ద్కర్, తెలంగాణ తల్లి విగ్రహాలకు పూలమా లలు వేసి నివాళు లర్పిం చారు. శాసనసభ్యులు, శాసన మండలి సభ్యు లు, శాసన మండలి కార్యదర్శి డా.వి నరసిం హాచార్యులు, శాసనసభ కార్యదర్శి రేండ్ల తిరుపతి, లెజిస్లేచర్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



గురువారంన శాసనసభ ఆవరణలో జాతీయ జెండాను ఆవిష్కరించిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్

# మీనాక్షి ఉన్నత చదువులకు అడ్డుపడుతున్న శ్రీలత కేసు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి, కాంగ్రెస్ సీనియర్ నేత మీనాక్షి నటరాజన్‌కు శ్రీలత కేసు గుది బండగా మారింది. రాజ్యసభ సభ్యత్వం కోసం వేసిన నామినేషన్ తిరస్క రణకు కారణమైన ఈ కేసు ఇప్పుడు ఆమె భవిష్యత్ ఉన్నత చదువులకు కూడా అడ్డుపడుతోన్నది. మీనాక్షి లండన్ పర్యటన అడ్డుకోవాలని నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలైంది. ఆమె పాస్‌పోర్టు జప్తుచేయాలని పిటిషనర్ కోరారు. ఒకవైపు ఉన్నత చదువుల కోసం లండన్ వెళ్లేందుకు సిద్ధమవుతున్న తరుణం లో ఆమె విదేశీ పర్యటనపై న్యాయపోరాటం మొదలైంది. ఉన్నత చదువుల కోసం మీనాక్షి నటరాజన్ లండన్ తదితర విదేశాలకు వెళ్లకుండా అడ్డు కోవాలని కోర్టులో పిటిషన్ దాఖలైంది. కంభం శివకుమార్ రెడ్డి కేసులో బాధితురాలైన శ్రీలత తాజాగా నాంపల్లి కోర్టును ఆశ్రయించారు. మీనాక్షిపై ఇప్పటికే రెండు క్రిమినల్ కేసులు పెండింగ్లో ఉన్నాయని ఈ నేపథ్యంలో ఆమె విదేశాలకు వెళ్లకుండా ఆమె పాస్‌పోర్టును తక్షణమే జప్తు చేయాలని శ్రీలత కోర్టును అభ్యర్థించారు. మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభ నామినేషన్ వేయగా అఫిడవిట్‌లో కేసుల సమాచారాన్ని సరిగ్గా వెల్లడించ లేదని బిజెపి నాయకులు ఫిర్యాదు చేశారు.

# తెలంగాణ వరి రైతుకు వరంగా ఆంధ్రప్రదేశ్ అత్యుత్సాహం

### ఎన్ఎస్‌పి ఎడమకాలువ పరిధిలో నిండిన చెరువులు

### 19 వరకు పాలేరు రిజర్వాయర్‌తోపాటు ఖమ్మం చెరువులకు నీరు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ నీటిపారుల శాఖ అధికారులు అత్యుత్సాహంతో అను మతి లేకుండా కుడికాలువకు నీటిని విడుదల చేయడం దానికి ప్రతిస్పందనగా తెలంగాణ నీటిపారుదల శాఖ అధికారులు ఎడమ కాలువకు కూడా నీరు విడుదల చేయడంతో ఆయకట్టు పరిధిలోని తెలంగాణ వరి రైతుకు వరంగా మారింది. ప్రస్తుతం తాగునీటి అవసరాలకు పాలేరు రిజర్వాయర్ తో పాటు ఖమ్మం జిల్లాలోని పలు చెరువులు నింపడానికి నీరు విడుదల చేయనున్నారు.దీని కోసం నాగార్జున సాగర్ ఎడమ కాల్వ పరిధిలోని మేజర్లకు నీటిని మంగళవారం నిలిపివేశారు. ఆగస్టు 30న కుడి కాల్వకు అనుమతి లేకుండా నీరు విడుదల చేయడంతో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడింది.

చెరువులకు, తాగునీటికి అంటూ నీటి విడుదల చేసుకొంటున్నామని ఆంధ్రప్రదేశ్ నీటిపారుదల శాఖ అధికారులు స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ అధికారులు కెఆర్ఎంబి నుంచి ఏలాంటి ప్రతిస్పందన లేకపోవడంతో ఎడమ కాల్వ పరిధిలోని చెరువులకు రెండు రోజులు ఆలస్యంగా నీటిని విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ కు చెందిన అధికారులు ఎనిమిది టిఎంసిలు తీసుకుంటామని ఆదివారం వరకు నీటిని తరలించారు. ఏదేమైనా నాగర్జున సాగర్ ఎడమ కాల్వ పరిధిలో నీటి విడుదల వల్ల చెరువులు నింపుకోవడంతో పాటు రైతులు సాగు చేసిన వరికి సకాలంలో నీరు అందింది. వర్షాభావపరిస్థితులు నెలకొన్న ఎన్ఎస్‌పి ఆయకట్టు పరిధిలో తాగునీటి పథకాల, వ్యవసాయ బోర్లలో భూగర్భ జలాలు పెరిగి కొంత ఊరట లభించింది.

కొన్ని చెరువులు మినహా చాలావరకు చెరువులకు ఎంతోకొంత నీరు చేరిందని రైతులు, గ్రామీణులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. వరి సాగు చేసిన రైతులు సైతం వారి బావుల్లో నీటి నిల్వలు పెరిగాయని ఎండిపోయాయని భావించిన బోర్లు మళ్లీ నీరు పోస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ కుడికాలువకు నీరు విడుదల నిలిపివేసినా తెలంగాణవైపు నీరు ఎడమ కాలువ నుంచి పారుతోన్నది. ప్రధాన కాల్వకు నీటి విడుదల మరో మూడు రోజులు కొనసాగిస్తారు. పాలేరుతో పాటు ఖమ్మం జిల్లాలోని బోనకల్ ముదిగొండ, చింతకాని, మధిర ప్రాంతాల అవసరాలకు అనుగుణంగా శనివారం వరకు నీరు విడుదల చేయబోతున్నారు. నీటి వృధా తగ్గించి ఆయకట్టు చివరికి చేరుకొనేలా అధికారులు కిందిస్థాయి సిబ్బందిని దగ్గరుండి మేజర్లను మంగళవారం మూసివేయించారు. నీటి చౌర్యం జరుగకుండా పహారా ఉండాలని ఎప్పటికప్పుడు మేజర్ల మూసివేత ఫొటోలు పెడుతూ నీటిని కిందకు తీసుకెళ్లాలని ఉన్నతాధికారులు కిందిస్థాయి ఉద్యోగులను అప్రమత్తంచేశారు. ఏడు వేల క్యూసెక్కుల నీరు బుధవారం వరకు పారకం కాగా గురువారం ఐదువేలకు క్యూసెక్కులకు తగ్గించారు. శుక్రవారం నుంచి నాలుగు వేల క్యూసెక్కుల నీటిని విడులచేస్తూ 19న పూర్తిగా రెగ్యులేటర్ గేట్లు మూసి ఎడమ కాల్వకు నీటిని నిలిపి వేయనున్నారు.ఎన్ఎస్‌పి జలాశయం నుంచి రెండు రాష్ట్రాలకు పదిహేను రోజులుగా నీటిని విడుదల చేస్తున్నారు. ఎడమ కాల్వకు ముందుగా 500 క్యూసెక్కులు, తర్వాత 2000 క్యూసెక్కులు వదిలారు. అనంతరం 6 వేల నుంచి 7 వేలకు పెంచారు. ఆలస్యంగా నీటిని తీసుకున్న తెలంగాణ అధికారులు సాగర్ ఎడమ్మకాల్వకు సైతం ఎనిమిది టిఎంసిల విడుదల చేశారు.

# డిజిటల్ ట్రాన్సాక్షన్లపై పన్ను వెంటనే రద్దు చేయాలి

### బిజెపికి సాయుధ పోరాటంతో సంబంధం లేదు

### తెలంగాణ ఎంపిల ఫోరం కన్వీనర్ మల్లు రవి





గురువారం మీడియాతో మాట్లాడుతున్న తెలంగాణ ఎంపిల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి

**హైదరాబాద్,సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** ప్రధాని మోడీ డిజిటల్ ట్రాన్సాక్షన్‌లపై విధించిన యుపిఐ పన్ను వెంటనే రద్దుచేయాలని తెలంగాణ ఎంపిల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపి మల్లు రవి డిమాండ్ చేశారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ ఇది యుపిఐ టాక్స్ కాదు మోడీ టాక్స్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. డిజిటల్ ట్రాన్సక్షన్ చేయాలనీ అలవాటు చేసింది మీరే అందరు అలవాటు పడ్డాక ఇప్పుడు టాక్స్ వేయడం తీవ్రంగా ఖండించారు. మోడీ పాలన పై ప్రజలు భయపడుతున్నారనీ ఎప్పుడు ఏ తప్పుడు నిర్ణయం తీసుకొని వీధుల్లోకి నెట్టుతారో అనే అభద్రతతో ఉన్నారని అన్నారు. సోనియాగాంధీ తెలంగాణ రాష్ట్రం ఇచ్చాక 10 ఏళ్లు ఒక ఫ్యూడల్, రాజుల కెసిఆర్ పాలన చేశారనీ వారి బిఆర్ఎస్ పార్టీ ఎస్సి ల వ్యతి రేకమనీ ఆ రాజుల పాలనలో ప్రగతి భవన్ కట్టించారనీ,సెక్రటేరియట్ కట్టారనీ ఎద్దేవా చేశారు. ప్రజలు తాము అడిగింది చేయాలని అధికారం ఇచ్చారని కానీ ప్రజలకు మంచి చేయడానికి కెసిఆర్‌కు చేతులు రాలేదని విమర్శించారు.ముఖ్యమంత్రి ఫామ్ హౌస్‌పై విచారణ వేశారనీ సిఎం భయపడే వారైతే ఎందుకు చిట్టా మొత్తం చెప్తారనీ ఆయన ప్రశ్నించారు. నిజంగా ఏంత ఉందో తెలడానికే కదా విచారణ వేసిందనీ ఆయన వివరిం చారు. తెలంగాణ లో అనేక మంది పోరాటం చేశారు,ప్రాణాలు కోల్పోయారు అని విమోచనదినోత్సవం సందర్భంగా అమరులను జ్ఞాపకం చేసుకొన్నారు.

తెలంగాణ సాయుధ పోరాటాన్ని గుర్తించి తొలి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ హోం మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను హైదరాబాద్ విముక్తి కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సూచించారని అన్నారు.సాయుధ పోరాటం లో ఎంతో మంది విద్యార్థులు ఒక విద్యా సంవత్సరం కోల్పోయారు సాయుధ పోరాటం లో నేను కూడా (మల్లురవి 14జులై1950న జన్మించారు) ఒక విద్యా సంవత్సరం కోల్పోయాను అనిఆవేదన చెందారు. తెలంగాణ సాయుధ పోరాటంతో బిజెపికి సంబంధం లేదనీ అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటం సిపిఐ, సిపిఎం, కాంగ్రెస్ పార్టీలు చేశాయనీ, తెలంగాణ లో రజాకార్ల కు వ్యతిరేకంగా సంవత్సరం సాయుధ పోరాటం జరిగిందనీ చెప్పారు. తెలంగాణకు కూడా స్వాతంత్రం రావాలని ప్రజలు పార్టీలకు అతీతంగా సాయుధ పోరాటం చేశారనీ ఆనాటి రోజులు ఆయన గుర్తుచేసుకొన్నారు.

# భార్య హత్య కేసులో నిందితుడైన భర్త దారుణ హత్య

### పది సెకన్లలో 9 సార్లు కత్తితో నరికిన గుర్తుతెలియని ఆగంతకుడు

### బెయిల్‌పై వచ్చి పట్టపగలు హత్యకు గురైన వైనం

**హైదరాబాద్, సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** భార్య హత్యకేసులో జైలు శిక్షణ అనుభవిస్తున్న భర్త బెయిల్‌పై బయటికి వచ్చి నిజామాబాద్ నగరంలోని ఆనంద్‌నగర్‌లో గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో గురువారం దారుణహత్యకు గుర య్యారు. నిజామాబాద్‌లో పట్టపగలు అందరు చూస్తుండగానే భార్య హత్య కేసులో నిందితుడైన హరిబాబును తొమ్మిదిసార్లు పొడిచి చంపారు. కారులో నలుగురు వ్యక్తులు వచ్చారు అందులో ఓ వ్యక్తి కారుదిగి వచ్చి పదునైన ఆయుధంతో హరిబాబు తలపై నరికిన దృశ్యాలు సిసి కెమెరాల్లో రికార్డు అయ్యాయి. నిందితుడు 10 సెకన్లలో 9 సార్లు కత్తితో నరికిన దృశ్యాలు పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు.



హతుడు హరిబాబు

జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం మాదాపూర్ గ్రామానికి చెందిన యూట్యూబర్ వైష్ణవి (19), కోరుట్ల పట్టణం ఏసుకోనిగుట్టకు చెందిన చిత్తరి హరిబాబు (26)కి వివాహం జరిగింది. హరిబాబు వైష్ణవిని ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. అనంతరం వీరిద్దరి మధ్య చోటుచేసుకున్న వివాదాలు తీవ్రరూపం దాల్చడంతో హరిబాబు వైష్ణవిని దారుణంగా కత్తితో పొడిచి హత్యచేశాడని వైష్ణవి హత్యకేసులో నిందితుడిగా పోలీసులు పేర్కొని అరెస్టు చేశారు. నాలుగు నెలల గర్భిణిగా ఉన్న వైష్ణవి గొంతు నులిమి, చేతులు, నుదిటిపై కత్తితో పొడిచి హత్య చేసినట్లు మృ తుడు హరిబాబుపై ఆరోపణలున్నాయి.

మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు హరిబాబును అరెస్టు చేశారు. హరిబాబు జైలు నుంచి విడుదలైన తర్వాత కోరుట్ల పరిసర ప్రాంతాల్లో కనిపించకుండా పోయినట్లు సమాచారం. ఈ క్రమంలో గురువారం సాయంత్రం సుమారు 4 గంటల సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు అతడిపై దాడి చేసి హత్య చేసినట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ప్రస్తుతం బెయిల్‌పై జైలు నుంచి బయటికొచ్చిన నిందితుడు దారుణహత్యకు గురి కావడంతో సంచలనం కలిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వైష్ణవి హత్య కేసులో నిందితుడైన హరిబాబు గత కొన్నిరోజులుగా తన తల్లితో కలిసి నిజామాబాద్ ఐదోటౌన్ పరిధిలోని ఇంద్రాపూర్‌లోని నివాసం ఉంటున్నాడు. రాజరాజేంద్ర చౌరస్తాలో మక్కబుట్టలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నారు. రోజులాగే గురువారం మక్కబుట్టలు అమ్ముకుంటున్న క్రమంలో దాహం వేసి నీళ్ల కోసం పక్కనే ఉన్న చాట్బండి వద్దకు వెళ్లాడు. అదే సమయంలో ఓ కారులో గురు తెలియని వ్యక్తులు వచ్చి ఆయన తలపై పదునైన ఆయుధంతో విచక్షణా రహితంగా దాడి చేశారు. తీవ్రగాయాలపాలైన హరిబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని జిజిహెచ్ మార్చురీకి తరలించారు. వైష్ణవి హత్య ఘటన తర్వాత ఆమె కుటుంబ సభ్యులు, బంధువుల్లో చిత్తరి హరిబాబుపై తీవ్రఆగ్రహం నెలకొన్నట్లు అప్పట్లో చర్చ జరిగింది. వైష్ణవి కుటుంబానికి చెందిన ఎవరైనా హరిబాబు హత్యలో పాల్గొన్నారా? లేక మరేదైనా వ్యక్తిగత వివాదం ఈ హత్యకు కారణమా? అనే కోణాల్లో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నట్లు సమాచారం. యూట్యూబర్ వైష్ణవి హత్యకేసు నిజామాబాద్, జగిత్యాల ప్రాంతాల్లో చర్చనీయాంశంగా మారింది.

# రెవెన్యూ వ్యవస్థపై ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చరిత్రాత్మకం

### గత ప్రభుత్వంలో భూరికార్డుల విధ్వంసంపై సమగ్ర విచారణ జరపాలి

### తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెవె న్యూ వ్యవస్థ, ధరణి, 22ఎ, భూభారతి, భూరి కార్డుల పరిరక్షణ తదితర అంశాలపై చేసిన సుదీర్ఘ ప్రసం గం చరిత్రాత్మకమని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ ఛైర్మన్ కోదండరెడ్డి, సభ్యులు వెంకన్న యాదవ్, కేవీఎన్‌రెడ్డి, భవానీరెడ్డి, గోపాల్‌రెడ్డి శ్లాఘించారు. గురువారం విలేఖరులతో మాట్లాడుతూ నిజాం కాలం నుంచి కొనసాగుతున్న రెవెన్యూ రికార్డుల వ్యవస్థ తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు ముందు వరకు ఒక పద్ధతి ప్రకారం కొనసాగిం దని, అయితే గత టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2017లో భూరికార్డుల ప్రక్షాళన పేరుతో చేపట్టిన కార్యక్రమం ద్వారా అనేక భూరికార్డుల్లో గందరగోళం ఏర్పడిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రత్యేకంగా భూదాన్ భూములు, అసైన్డ్ భూములు, పట్టా భూముల రికార్డుల విషయంలో అనేక సమస్యలు ఏర్పడ్డాయని తెలిపారు. తెలంగాణలో పెద్ద మొత్తంలో ఉన్న అసైన్డ్ భూములు పేదలకు అందాల్సిన భూములని, వాటి రక్షణలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.

భూదాన్ భూములకు సంబంధించిన రికార్డుల పరిరక్షణపై కూడా అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిపై సమగ్ర విచారణ అవసరమని అన్నారు. రెవెన్యూ వ్యవస్థను బలహీనపరిచేలా విఆర్ఒ వ్యవస్థను రద్దు చేయడం జరి గిందని ఆవేదన చెందారు. భూరికార్డుల డిజిటలైజేషన్‌లో తలెత్తిన సమస్యలు, ధరణి వ్యవస్థలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు వివరించారు. రాష్ట్ర వ్యాప్తంగా భూహక్కులపై ప్రభావం చూపాయని కమిషన్ సభ్యులు పేర్కొన్నారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ధరణి స్థానంలో భూభారతి చట్టాన్ని తీసుకురావడం, భూ సమస్యల పరిష్కారానికి కమిటీ ఏర్పాటు చేయడం, రెవెన్యూ అధికారులకు మార్గదర్శకాలు ఇవ్వడం వంటి చర్యలు చేపట్టిందని తెలిపారు. 22ఎ కింద ఉన్న భూముల విషయంలో అర్హులైన భూయజమానులకు న్యాయం చేస్తామని ముఖ్య మంత్రి ఇచ్చిన హామీని స్వాగతిస్తున్నామని సంతోషం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వ హయాం లో భూదాన్, అసైన్డ్ లేదా ఇతర ప్రభుత్వ భూములు అక్రమంగా బదలాయింపులకు గుర య్యాయా అనే అంశంపై సమగ్ర విచారణ జరిపి, అక్రమా లకు పాల్పడిన ఎంత పెద్దవ్యక్తులైనా, సహకరించిన అధికారులు ఎవరైనా చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భూహక్కుల పరిరక్షణ రైతు సంక్షేమంలో అత్యంత కీలకమైన అంశమని, భూమికి సంబంధించిన ప్రతి రికార్డు పారదర్శకంగా, భద్రంగా ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కమిషన్ సభ్యులు కోరారు.

# విద్యుత్ కోతలపై కొనసాగుతున్న నిరసనలు

### సబ్‌స్టేషన్ల వద్ద రైతుల ధర్నాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** అసలే వర్షాభావ పరిస్థితులకు తోడు విద్యుత్ కోతలు అమలు చేయడంతో పంటలు ఎండిపోతున్నాయని వివిధ జిల్లాల్లో రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా మెదక్, వికారాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో రైతులు సబ్ స్టేషన్ల ముట్టడి, రాస్తారోకో నిర్వహించారు. మెదక్ జిల్లా చిన్న శంకరంపేట మండలంలోని సబ్ స్టేషన్ ముందు రైతులు ధర్నా చేశారు అనంతరం గవ్వలపల్లి వెల్దుర్తి ప్రధాన రహదారిపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. విద్యుత్ శాఖ అధికారులు కరెంటు కోతలు విధించడం వల్ల వేసిన పంటలు ఎండిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కరెంటు సమస్య రోజురోజుకు తీవ్రమవుతుందన్నారు. రోజుకు 24 గంటలు ఉచిత కరెంటు ఇస్తామని వ్యవసాయానికి 8 గంటలు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం 24 గంటల కరెంటు అందించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలను చేపడతామని రైతులు హెచ్చరించారు. విషయం తెలుసుకున్న చిన్న శంకరంపేట ఎస్ శివానందం తాసిల్దార్ మాలతి సంఘటన స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి రాస్తారోకోను విరమింపచేశారు. అలాగే వికారాబాద్ జిల్లాలో కరెంట్ కోసం రైతుల రాస్తారోకో చేపట్టారు. విద్యుత్ సరఫరా సక్రమంగా చేయడం లేదంటూ ఆందోళన హామీ ఇచ్చే వరకు కదిలేది లేదంటూ దోమ మండలం మోత్కూర్ గేటు వద్ద పరిగి–మహబూబ్‌నగర్ రహదారిపై రైతులు భారీ నిరసన చేపట్టారు. 24 గంటల విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేసిన రైతులు కేవలం 7 గంటలు మాత్రమే కరెంట్ ఇస్తున్నారని, అది కూడా ఎప్పుడు వస్తుందో తెలియని పరిస్థితి ఉందని వాపోయారు. ఈ రాస్తారోకోతో రహదారిపై వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. అదేవిధంగా మహబూబ్‌నగర్ జిల్లాలోని నర్వ మండల పరిధిలో విద్యుత్ కోతలను నిరసిస్తూ రైతులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. గత కొన్ని నెలలుగా వ్యవసాయానికి విద్యుత్ సరఫరాలో కోతలు విధిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రాత్రి 9 గంటలకు విద్యుత్ సరఫరా చేయాల్సి ఉండగా, పలుమార్లు రాత్రి 1, 2 గంటల సమయంలో విద్యుత్ విడుదల చేస్తున్నారని రైతులు తెలిపారు. అదీ కూడా సక్రమంగా సరఫరా కాకపోవడంతో పంటలకు నీరు అందక ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.





గురువారం సిఎల్‌పి కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ బల్మూర్ వెంకట్

# కల్వకుంట్ల భూబాగోతం ఆధారాలతో బహిర్గతం

### ప్రభుత్వ విప్‌లు బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్

**హైదరాబాద్,సెప్టెంబరు 17,ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమనేత తెలంగాణ జాతిపితా అంటూ కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు ఆయన కుటుంబం దురా క్రమణ చేసిన భూముల గోతాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధారా లతో సహా బయటపెట్టారనీ ప్రభుత్వ విప్‌లు బల్మూర్ వెంకట్, అద్దంకి దయాకర్ తెలిపారు. గురువారం సిఎల్‌పి కార్యాలయంలో బల్మూర్ వెంకట్ విలేఖరులతో మాట్లాడుతూ గుమ్మడికాయ దొంగ ఎవరు అంటే భుజాలు తడుముకున్నట్లు హారీరావు తీరు ఉందనీ విమర్శించారు. షేర్ల బదిలీతో బాలానగర్ భూములను కొన్నామని హారీష్ రావు చెబుతున్నాడనీ పేరు మార్పిడితో టిఎం33 కింద బాలానగర్ భూములు హారీష్ రావు మామ, తమ్ముడి పైకి బదిలీలు అయ్యాయనీ, రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించకుండా కుటుంబ సభ్యులపైన మార్చుకున్నారనీ అన్నారు. బావ బొక్కబోర్లా పడితే కెటిఆర్ తాను ముందుకు వచ్చి హడావుడి చేస్తున్నాడనీ తెలిపారు. కెటిఆర్ ఎన్నికల అఫిడవిట్ బయటకు తీస్తే అన్ని నిజాలు బయటకు వచ్చాయనీ . 2009లో ఒక ఎకరం ఉన్నట్లు చూపించిన కెటిఆర్‌కు 2023లో 63 ఎకరాలు ఎలా వచ్చాయి? అని అడిగారు. 2009లో రెండు అపార్ట్‌మెంట్లు కొండాపూర్‌లో కెటిఆర్ తన అఫిడవిట్‌లో చూపించాడు. 2023లో షేక్‌పేట, మెయినాబాద్, పుప్పాలగూడ తదితర ప్రాంతాల్లో 13 లక్షల చదరపు అడుగులు ఉన్నట్లు చూపించాడనీ వివరించారు. కెసిఆర్ కుటుంబం భూస్వాములు అయితే దొంగ పాస్‌పోర్టులు ఎందుకు చేయాల్సి వచ్చింది? అని నిలదీశారు. కేసీఆర్‌కు దుబాయ్ శేఖర్అనే పేరు ఎందుకు వచ్చింది? అని ఎద్దేవా చేశారు. అద్దంకి దయాకర్ మాట్లాడుతూ భూచోర్ రాష్ట్ర సమితి అని బిఆర్ఎస్‌ను ఇక పిలుస్తామనీ హెచ్చరించారు.

# డిసెంబర్ నుంచి హైదరాబాద్‌లో హార్వర్డ్ వర్సిటీ ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సు

### యుకె బిజినెస్ స్కూళ్ల బృందంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశం

### ఫ్యూచర్‌సిటీలో ఎడ్యుకేషన్ హబ్‌ను తీర్చిదిద్దుతున్నాం

### బిజినెస్ స్కూళ్ల రాకతో అగ్రగామి కార్పొరేట్ సంస్థల చూపు రాష్ట్రం వైపు

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ యూనివర్సిటీ హైదరాబాద్‌లో ఔత్సాహికులకు ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ కోర్సులను డిసెంబర్ నుంచి అందించనున్నట్లు ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి తెలి పారు. తెలంగాణను 'గ్లోబల్ నాలెడ్జ్ హబ్'గా తీర్చిదిద్దే దిశగా తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోం దని యూకే బిజినెస్ స్కూల్స్ బృందం భేటీలో అన్నారు. గురువారం ఎంసీఆర్ హెచ్ ఆర్డీలో నిర్వహించిన భేటీలో యూకే హౌస్ ఆఫ్ లార్డ్స్ సభ్యుడు కరణ్ బిలిమొరియా, బ్రిటిష్ కౌన్సిల్ డైరెక్టర్ జనక పుష్పనాథన్, చార్టర్డ్ అసోసియేషన్ ఆఫ్ బిజినెస్ స్కూల్స్ సీఈఓ ఫ్లోరా హామిల్టన్, బ్రిటిష్ డిప్యూటీ హైకమిషనర్ ప్రతినిధులతో సహా 30 మంది వివిధ యూకే యూనివర్సిటీ ప్రతినిధులతో సీఎం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వివిధ యూకే బిజినెస్ స్కూల్స్ కు సంబంధించిన డీన్లు, ఉన్నత స్థాయి అధికారులతో చర్చిస్తూ, విశ్వవిద్యాలయాలకు అవసరాలకు తగ్గట్టు అన్ని రకాలుగా రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు.

ఎంఐటీ, పర్ద్యూ వంటి పలు ఐవీ లీగ్ యూనివర్సిటీలు హైదరాబాద్‌లో ఆఫ్ షోర్ క్యాంపస్ ఏర్పాటు ప్రక్రియ మొదలైందన్నారు.విదేశీ విద్యాసంస్థల రాకతో స్థానిక విశ్వవిద్యాలయాలు, పరిశ్రమలతో కలిసి పనిచేయడానికి, ఇక్కడే పరిశోధనలు చేపట్టడానికి దోహదపడుతుందన్నారు. యూకే బిజినెస్ స్కూల్స్ తెలంగాణలో ఏర్పాటైతే ప్రపంచ స్థాయి కార్పొరేట్ వ్యాపార సంస్థలు రాష్ట్రం వైపు చూస్తాయని అన్నారు. అదే సమయంలో రాష్ట్ర విద్యార్థులు, అధ్యాపకులకు అంతర్జాతీయ సంస్థలు, అంతర్జాతీయ అనుభవం, ప్రపంచ స్థాయి అవకాశాలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ దిశగా హార్వర్డ్, ఎంఐటి, లండన్ విశ్వవిద్యాలయం, వర్జీనియా టెక్, నార్త్‌ఈస్టర్న్ విశ్వవిద్యాలయం వంటి అనేక ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలతో ఎగ్జిక్యూటివ్ ప్రోగ్రామ్‌లు, డ్యూయల్ డిగ్రీ కోర్సులు, అధ్యాపకుల శిక్షణ, పరిశోధన వంటి రంగాల్లో భాగస్వామ్యాలు ప్రారంభించవచ్చన్నారు. అలాగే విద్యార్థులకు ఇంగ్లీష్, జర్మన్, జపనీస్ వంటి విదేశీ భాషా నైపుణ్యాలను పెంపొందించేందుకు కూడా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మారుతున్న మార్కెట్ అవసరాలకు అనుగుణంగా యువతకు అత్యాధునిక నైపుణ్య శిక్షణ అందించేందుకు భారత్ ఫ్యూచర్ సిటీలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. అత్యంత ప్రతిష్టాత్మకంగా అభివృద్ధి చేస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీని దాదాపు 30,000 ఎకరాల విస్తీర్ణంలో, దేశంలోనే మొట్టమొదటి నెట్‌జీరో గ్రీన్‌ఫీల్డ్ స్మార్ట్ సిటీగా తీర్చిదిద్దుతున్నామ న్నారు. అక్కడ ఎడ్యుకేషన్ హబ్ ఏర్పా టుతో భావితరాలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.

డిసెంబర్ లో అక్కడ నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026కు బృందానికి ఆహ్వానం పలికారు. యూకే విద్యా వ్యవస్థలో ముఖ్యులందరికీ గ్లోబల్ సమ్మిట్ కు ప్రత్యేకంగా ఆహ్వానించనున్నట్టు వివరించారు. దావోస్ లో నిర్వహించే వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ తరహాలో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ ను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీలో భారీ పెట్టుబడులు పెట్టేందుకు ప్రపంచ అగ్రగామి సంస్థలు ముందుకొస్తున్నాయి. టీసీఎస్ 70 వేల కోట్లతో దేశంలోనే అతిపెద్ద ఏఐ డేటాసెంటర్ నిర్మించనుంది. లక్ష కోట్ల పెట్టుబడితో అమెజాన్ ఇప్పటికే డేటాసెంటర్ నిర్మాణం చేపట్టిందన్నారు.

ప్రపంచంలోనే మేటి విశ్వ విద్యాలయాలు, ఫార్చ్యూన్ 500 కంపెనీలు తెలం గాణలో ఉండే విధంగా అడుగులు వేస్తున్నామన్నారు. నర్సరీ నుంచి ఉన్నత విద్య వరకు, అలాగే ఐటీఐలు, పాలిటెక్నిక్ కాలేజీలు, స్కిల్స్ యూనివర్సిటీల ద్వారా యువతలో నైపుణ్యాలను పెంపొందించడం, తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు, యంగ్ ఇండియా స్పోర్ట్స్ యూనివర్సిటీ వంటి వాటి ద్వారా విద్యా వ్యవస్థను సమూలంగా మార్చడమే ప్రభుత్వ ఉద్దేశమని వివరించారు.

2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా, 2034 నాటికి 1 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్న లక్ష్యం గురించి ప్రస్తావించారు.

# సున్నా ఎకరాల నుంచి వేల కోట్ల ఆస్తులు కెసిఆర్‌కు ఎలా వచ్చాయి?

## రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ట్వీట్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** మాజీ సిఎం, బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ కుటుంబం ఆస్తులపై రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. 2004 ఎన్నికల అఫిడవిట్‌లో సొంత భూమి లేదు అని పేర్కొన్న కెసిఆర్‌కు పదేళ్ల కాలంలో రూ.వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. ఉద్యమకారులకు అప్పులు మిగిలితే కల్వకుంట్ల కుటుంబం పేదల,అసైన్డ్ భూములను దోచుకుని రూ.లక్షల కోట్లు కూడబెట్టిందన్నారు. కెటిఆర్ అబద్దాలతో ప్రజలను మోసం చేస్తున్నారని గురువారం ట్వీట్ చేశారు. కేసీఆర్ సున్నా ఎకరాల నుండి వేల కోట్ల విలువైన ఆస్తులకు ఎదిగిన భూ బకాసురుడు కేసీఆర్ అని వ్యాఖ్యానించారు. ఒక్క ఎకరం కూడా భూమి లేదని 2004 కరీంనగర్ లోక్ సభ ఎన్నికల అఫిడవిట్‌లో తెలిపిన కేసీఆర్‌కు ఇప్పుడు వేల కోట్ల విలువైన భూములు ఎలా వచ్చాయి? తెలంగాణ ఉద్యమ సమయంలో, ఆ తరువాత అధికారంలో ఉన్న పదేండ్లలో కేసీఆర్‌కు భూములు భారీగా పెరిగిన విషయం, స్వయంగా కేసీఆర్ సమర్పించిన ఎన్నికల అఫిడవిట్‌ల ద్వారా స్పష్టమవుతుందని పేర్కొన్నారు..బీఆర్ఎస్ పదేండ్లు అధికారంలో ఉన్నప్పుడు, తెలంగాణ ఉద్యమకారులకు అప్పులే మిగిలాయి, కానీ కేసీఆర్ కుటుంబానికి లక్షల కోట్ల విలువైన ఆస్తులు వచ్చాయి.. ఎలా..? ప్రభుత్వ, పేదల, దళితుల అసైన్డ్ భూములను దోచుకోవడం ద్వారానే కదా..! అని ప్రశ్నించారు. ఉద్యమకారుల త్యాగాల పునాదుల మీద లక్షల కోట్ల ఆస్తులను అక్రమంగా సంపాదించుకున్న కల్వకుంట్ల కుటుంబం..పుట్టుకతోనే కేసీఆర్‌కు వందల ఎకరాలు ఉన్నాయని కేటీఆర్ చెప్పడంపై ఆక్షేపణ వ్యక్తం చేశారు. ఎన్నికల అఫిడవిట్ లో తప్పులు రాసి మోసం చేసారా? లేక, ప్రజలకు అబద్దాలు చెప్తున్నారా అని ప్రశ్నించారు.

# ప్రధాని నరేంద్ర మోడీకి సిఎం రేవంత్‌రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జన్మదినం సందర్భంగా, ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి వారికి హార్దిక శుభాకాంక్షలు తెలిపారు. నిత్యం ప్రజాసేవలో నిమగ్నమవుతూ భారతదేశాభివృద్ధికి పాటుపడటంలో భగవంతుడు వారికి సంపూర్ణ ఆయురారోగ్యాలు, దీర్ఘాయుష్షు ప్రసాదించాలని ఆకాంక్షించారు.



# తృణమూల్ కాంగ్రెస్ పేరు, గుర్తు స్తంభింపచేసిన ఇసి

## నందిగ్రామ్, రేజీనగర్ ఉపఎన్నికల్లో రెండు వర్గాలకూ కొత్త పేర్లు, గుర్తులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** తుది నిర్ణయం వెలువడే వరకు ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరును, ఆ పార్టీ ఎన్నికల గుర్తు పూలుగడ్డిను ప్రస్తుతానికి స్తంభింపజేయాలని భారత ఎన్నికల సంఘం నిర్ణయించింది.దీంతో మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ నేతృత్వంలోని వర్గం, రిటబ్రత బెనర్జీ నేతృత్వంలోని మరో వర్గం అక్టోబర్ 6న జరగనున్న నందిగ్రామ్, రేజీనగర్ ఉప ఎన్నికల్లో ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్ పేరు, పూలుగడ్డి(ఫ్లవర్స్ గ్రాస్) గుర్తును ఉపయోగించుకోలేవు.రెండు ప్రత్యర్థి వర్గాలను సమాన స్థాయిలో ఉంచడంతో పాటు, వాటి హక్కులు, ప్రయోజనాలను పరిరక్షించేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎన్నికల సంఘం తెలిపింది. ఇందుకు గతంలో అనుసరించిన విధానాలను కూడా ప్రస్తావించింది.సెప్టెంబర్ 17న జారీ చేసిన మధ్యంతర ఉత్తర్వుల్లో రెండు వర్గాలు తమకు నచ్చిన పేర్లతో కొనసాగవచ్చని ఈసీ పేర్కొంది. అవసరమైతే తమ మాతృపార్టీ ఆల్ ఇండియా తృణమూల్ కాంగ్రెస్‌తో అనుబంధాన్ని సూచించే పేర్లను కూడా ఎంచుకోవచ్చని తెలిపింది. ప్రస్తుత ఉప ఎన్నికల కోసం ఎన్నికల సంఘం ప్రకటించిన ఉచిత గుర్తుల జాబితా నుంచి ప్రతి వర్గం తమకు నచ్చిన భిన్నమైన గుర్తులను ఎంచుకోవచ్చని పేర్కొంది.ఈ పరిణామంతో పార్టీకి ప్రాతినిధ్యం వహిస్తున్నామని చెప్పుకుంటున్న రెండు ప్రత్యర్థి వర్గాలను ఎన్నికల సంఘం అధికారికంగా గుర్తించినట్లయింది.1968 ఎన్నికల గుర్తుల (రిజర్వేషన్ కేటాయింపు) ఉత్తర్వులోని 15వ పేరా కింద ఈ అంశంపై పూర్తి స్థాయి నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఈసీ స్పష్టం చేసింది. ఆ నిర్ణయం వెలువడే వరకు ఈ మధ్యంతర ఉత్తర్వులు అమల్లో ఉంటాయని తెలిపింది. తమకు కావాల్సిన మూడు పేర్లు, మూడు ఉచిత ఎన్నికల గుర్తులను ఎంపిక చేసి ఈనెల 18 ఉదయం 11 గంటలలోపు ఎన్నికల సంఘానికి సమర్పించాలని రెండు వర్గాలను ఈసీ ఆదేశించింది.

# మహేశ్‌కుమార్, అద్దంకి దయాకర్‌కు లీగల్ నోటీసులు

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** క్షుద్ర పూజల ఆరోపణలపై టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్,ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై నాంపల్లి కోర్టులో పరువు నష్టం దావా దాఖలైంది. హరీశ్‌రావు తరఫు న్యాయవాది ఈ కేసు వేశారు. ఇప్పటికే ఆరోపణలపై క్షమాపణ చెప్పాలని లీగల్ నోటీసులు పంపినప్పటికీ గడువులోపు క్షమాపణలు చెప్పకపోవడంతో కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు.

# కెటిఆర్ పిఎ, పిఆర్వోల విచారణకు సంబంధించిన కీలకమైన సిసిటివి ఫుటేజ్ భద్రపరచండి

## పోలీసులకు హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పీఏ, పీఆర్వోల విచారణకు సంబంధించిన కీలకమైన సీసీటీవీ ఫుటేజీని భద్రపరచాలని సైబరాబాద్ పోలీసులను తెలంగాణ హైకోర్టు ఆదేశించింది. సెప్టెంబర్ 14న వారు పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్లిన సమయానికి సంబంధించిన ఫుటేజీని భద్రంగా ఉంచాలని జస్టిస్ టి. మాధవి దేవి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.సెప్టెంబర్ 7న అసెంబ్లీ వద్ద చోటుచేసుకున్న గందరగోళానికి సంబంధించి, సెప్టెంబర్ 14న కేటీఆర్ పర్సనల్ అసిస్టెంట్ కుంభా మహేందర్ రెడ్డి, పీఆర్వో మహేశ్ మాణిక్యలను పోలీసులు విచారణకు పిలిచారు. అయితే, పోలీస్ స్టేషన్‌లో విచారణ జరుగుతున్న సమయంలో ముసుగులు ధరించిన కొందరు వ్యక్తులు తమపై ఆయుధాలతో దాడికి యత్నించారని, ఆ సమయంలో పోలీసులు ప్రేక్షక పాత్ర వహించారని ఆరోపిస్తూ వారు హైకోర్టును ఆశ్రయించారు.తమను మధ్యాహ్నం 2 గంటల వరకు వేచి ఉండేలా చేశారని, ఆ తర్వాత కొందరు వ్యక్తులు గుంపుగా విచారణ గదిలోకి ప్రవేశించి దుర్భాషలాడారని పిటిషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. దాడి యత్నంపై ఫిర్యాదు చేసేందుకు పోలీసులు నిరాకరించారని కూడా ఆయన పేర్కొన్నారు.అయితే ఈ ఆరోపణలను హోం శాఖ ప్రభుత్వ న్యాయవాది తోసిపుచ్చారు. ఇవన్నీ పచ్చి అబద్ధాలని ఆయన స్పష్టం చేశారు. ఓ కార్యక్రమానికి డీజే అనుమతి కోసం కొందరు వ్యక్తులు పోలీస్ స్టేషన్‌కు వచ్చారని, అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఇప్పటికే ఫిర్యాదు నమోదైందని కోర్టుకు వివరించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయస్థానం, పిటిషనర్లు తదుపరి విచారణకు హాజరైనప్పుడు వారికి తగిన రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించింది. ఈ పిటిషన్‌పై రెండు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని హోం సెక్రటరీ, డీజీపీ, హైదరాబాద్ పోలీస్ కమిషనర్, డీసీపీ, ఖైరతాబాద్ ఏసీపీలకు నోటీసులు జారీ చేసింది.

# ఎన్డీయే ఐక్యతే దేశానికి బలం

## మోడీ నాయకత్వంలో భారత్ అభివృద్ధి అన్‌స్టాపబుల్

## వికెఎస్.. ఇదే భారత్ అభివృద్ధి మంత్రం

## అయోధ్య రామమందిర నిర్మాణ కలను మోడీ నిజం చేశారు

## దేశంలో నదుల అనుసంధానం ప్రధాని మోడీతోనే సాధ్యం

## దేశ ప్రయోజనాల కోసం



గురువారం వారణాసి-వాద్నగర్ సేవా యాత్రను ప్రారంభిస్తున్న ఏపి సిఎం చంద్రబాబు

# మోడీకి అండగా నిలవాలి

**విజయవాడ, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** "రైట్ టైమ్.. రైట్ లీడర్ నరేంద్ర మోడీ. దేశాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కాదు.. దేశ ప్రయోజనాల కోసం ప్రధాని నరేంద్ర మోడీకి అండగా నిలవాలి. ఎన్‌డియే ఐక్యతే దేశానికి బలం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ 25 యేళ్ల పాలనా ప్రస్థానాన్ని, ఆయన పుట్టిన రోజును పురస్క రించుకుని వారణాసిలో నిర్వహించిన 'వారణాసి- వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కాశీ -వాద్నగర్ సేవా యాత్రలో భాగంగా నిర్వహించిన కార్యక్రమంలో ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతిని, సంక్షేమం నుంచి సాంకేతికత వరకు చోటుచేసుకున్న మార్పులను ఆయన వివరించారు. అలాగే మోడీ నాయకత్వంలో దేశం ఏ విధంగా అభివృద్ధి చెందుతోందనే విష యాన్ని చెప్పారు. ఇక ఎపికి కేంద్రం అందిస్తున్న సాయాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రజలు ఎన్నటికీ మరువలేమని ముఖ్యమంత్రి వెల్లడించారు. ఈసందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "కాశీ క్షేత్రం ప్రధాని నరేంద్ర మోడీ కర్మ భూమి. కాశీ పుణ్యక్షేత్రం నుంచి నరేంద్ర మోడీ మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఇక్కడి ప్రజలు వారణాసికి నేతను ఎన్నుకోవడమే కాదు... దేశానికి ఓ లీడర్‌ను అందించారు. ప్రధాని నరేంద్ర మోడీ భారత్‌ను అభివృద్ధి చెందిన దేశాల సరసన చేరుస్తున్నారు. వికెఎస్ అనేది అభివృద్ధి మంత్రం... ఈ మంత్రంతో దేశం అభివృద్ధి చెందుతోంది. వి అంటే వాద్నగర్, కె అంటే కాశీ, ఎస్ అంటే సెప్టెంబర్. ప్రజలకు సేవ చేస్తే.. దేశానికి సేవ చేయడమేనని ప్రధాని నరేంద్ర మోడీ నమ్ముతారు. ప్రధాని నరేంద్ర మోడీ పాలనలో 25 కోట్ల మంది పేదరికం నుంచి బయటపడ్డారు. 80 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా ఆహార ధాన్యాలు అందుతున్నాయి. జెజెఎం, అమృత్ వంటి పథకాల ద్వారా 4 కోట్ల ఇళ్లకు తాగునీటి సౌకర్యం కల్పించారు. తాగునీటి కోసం ఎవ్వరూ ఇబ్బంది పడకూడదనేది ప్రధానికల. ఇవి కేవలం అంకెలు మాత్రమే కాదు... ఈ అంకెలు వెనుక పేద, మధ్య తరగతి కుటుంబాల అభివృద్ధి- సంక్షేమం ఉంది. పిఎంకిసాన్ కింద 11కోట్ల మంది రైతులు లబ్ధి పొందుతున్నారు... ఇందులో ఎలాంటిమధ్యవర్తులు లేరు. నేరుగా రైతులఖాతాలకే నగదును జమచేస్తున్నారు" అని వివరించారు.

**కోవిడ్ వ్యాక్సిన్‌తో 140 కోట్ల ప్రజలను కాపాడారు:**

"ప్రపంచంలోని వివిధ దేశాలు సంక్షోభంలో కూరుకుపోతున్న సందర్భంలో నరేంద్ర మోడీ దేశానికి మంచి నాయకత్వం అందిం చారు. 140 కోట్ల మంది భారతీయులను కాపాడారు... వారికి ఇబ్బందులు కలగకుండా చేశారు. 200 కోట్ల కోవిడ్ వ్యాక్సిన్ డోసులను ఉత్పత్తి చేసేలా ప్రోత్సహించిన ప్రధాని నరేంద్ర మోడీ కరోనా బారి నుంచి ప్రజలను కాపాడారు. 101 దేశాలకు కోవిడ్ వ్యాక్సిన్లను ఉచితంగా సరఫరా చేసి మానవత్వాన్ని చాటుకు న్నారు. విశ్వ మానవాళి సంక్షేమం కోసం డబ్బులు గురించి ఎలాంటి ఆలోచన చేయకుండా కోవిడ్ వ్యాక్సిన్లను నరేంద్ర మోడీ ఉచితంగా వివిధ దేశాలకు అందించారు. ఆత్మనిర్భర్ భారత్, వోకల్ ఫర్ గ్లోబల్ ఇలాంటి విధానాలతో మేకిన్ ఇండియా కాన్సెప్ట్ బలోపేతం అయ్యేలా చేశారు. గతంలో డిఫెన్స్ పరికరాలను దిగు మతి చేసుకునేవాళ్లం.. కానీ ఇప్పుడు ఎగుమతి చేసే స్థాయికి చేరాం. టెక్నాలజీని పూర్తి స్థాయిలో అర్థం చేసుకున్న ఏకైక ప్రధాని నరేంద్ర మోడీ మాత్రమే. స్పేస్, డ్రోన్, క్వాంటం, సెమీ కండక్టర్ టెక్నాలజీస్ వంటి వాటితో పాటు రోబోటిక్స్ వంటి వాటిని ప్రధాని మోదీ అర్థం చేసుకోగలరు.. వాటి వల్ల యువతకు లబ్ది చేకూర్చగలరు.ృన

**తిరుగులేని శక్తిగా భారత్:**

"ప్రపంచం ముందు భారత్‌ను తిరుగులేని శక్తిగా నిలబెడడానికి కారణం ప్రధాని మోడీ. ఇటీవలే బ్రిక్స్ సదస్సును కూడా సమర్థవంతంగా నిర్వహించారు. వివిధ దేశాల అధినేతలు మన ప్రధాని నాయకత్వంపై నమ్మకాన్ని వ్యక్తం చేశారు. ఎవరైనా దేశంపై దాడి చేయాలంటే భయపడేలా చేశారు... ఆపరేషన్ సింధూర్ ద్వారా ధీటైన జవాబుతో భారత్ శక్తిని ప్రపంచానికి చాటి చెప్పారు. ఆపరేషన్ సింధూర్‌ను నిర్వహించిన రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను అభినందిస్తున్నా. నేను కూడా వామపక్ష తీవ్రవాదాన్ని ఎదుర్కొ న్నాను.. నన్ను నక్సలైట్లు టార్గెట్ చేశారు... వారికి నేనూ బాధితుణ్ణే. కానీ ఇప్పుడు దేశంలో వామపక్ష తీవ్రవాదాన్ని రూపుమాపారు... దటీజ్ నరేంద్ర మోడీ. దేశం మొత్తానికి ఒకే పవర్ గ్రిడ్ ఏర్పాటు చేసిన ఘనత ప్రధాని నరేంద్ర మోడీదే. దేశంలో కనెక్టివిటీ పెంచారు. భిన్న సంస్కృతులు, భిన్న భాషలు దేశంలో ఉన్నాయి.. కానీ దేశాభివృద్ధి, ఆత్మనిర్భరత అనేదే మన లక్ష్యం. సుస్థిరత వల్లే ఇది సాధ్యమవుతుంది. సుస్థిరత వల్ల నమ్మకం పెరుగుతుంది.. నమ్మకంవల్ల పెట్టుబడులు వస్తాయి.. పెట్టుబడులువల్ల ఉద్యోగాలు సమకూరుతాయి.. అభి వృద్ధి జరుగుతుంది. ఉద్యోగాలవల్ల ప్రజలకు మేలు జరుగుతుంది. వందే భారత్ రైళ్లను ప్రారంభించారు.. బుల్లెట్ ట్రైన్లు రాబోతు న్నాయి. నదుల అనుసంధానం మాత్రమే ఇంకా పెండింగులో ఉంది... ఈనదుల అనుసంధానం ప్రధాని మోడీ ద్వారానే సాధ్య మవుతుంది. ృ సబ్ కా సాత్.. సబ్ కా వికాస్.. సబ్ కా విశ్వాస్.. సబ్ కా ప్రయాస్ ఇదే ప్రధాని మోడీ లక్ష్యం" అని సిఎం అన్నారు.

> **వామపక్ష తీవ్రవాదాన్ని అంతమొందించారు.. ఆపరేషన్ సిందూర్‌తో భారత్ సత్తా చాటారు**
>
> **యుపి ప్రభుత్వం అనుమతిస్తే అయోధ్యలో శ్రీవారి ఆలయ నిర్మాణం**
>
> **'వారణాసి- వాద్నగర్ సేవా సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో చంద్రబాబు**
>
> **కాశీవిశ్వనాథుని ఆలయంలో ఏపి సిఎం చంద్రబాబు ప్రత్యేక పూజలు**

**సభికులను ఇన్‌వాల్వ్ చేస్తూ సాగిన చంద్రబాబు ప్రసంగం:**

సిఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించడంతో సభికుల్లో ఉత్సాహం నెలకొంది. ప్రసంగం మొత్తం సభికులను ఇన్‌వాల్వ్ చేస్తూ సాగడంతో పలుమార్లు పెద్ద ఎత్తున చప్పట్లు, హర్షధ్వానాలు వినిపించాయి. రామజన్మభూమి నుంచి ఆపరేషన్ సింధూర్ వరకు వివిధ అంశాలను ప్రస్తావిస్తూ, ప్రధాని మోడీ నాయకత్వంలో దేశం సాధిస్తున్న ప్రగతితో పాటు ఆంధ్రప్రదేశ్‌కు కేంద్రం అందిస్తున్న సహకారాన్ని కూడా ఆయన వివరించారు. ఆజ్ మే కాశీకే పవిత్ర ధర్తీ పర్ ఖడా హూ... యే మేరేలియే గర్వ్ కారణ్ హై అంటూ సిఎం చంద్రబాబు హిందీలో తన ప్రసంగాన్ని ప్రారంభించారు. ఇక ప్రసంగం మధ్య మధ్యన దేశ్ బదల్ రహా హై, దేశ్ ఆగే బఢ్ రహా హై, నయా భారత్ హై.... ఆత్మ నిర్భర్ భారత్ హై అంటూ వ్యాఖ్యానించారు. చివరిలో ఏక్ భారత్, శ్రేష్ట్ భారత్, వికసిత్ భారత్... యహీ హమారా సంకల్ప్ హై అంటూ సిఎం తన ప్రసంగాన్నిముగించారు. ముఖ్యమంత్రి ప్రసంగానికి సభికుల నుంచి అతిథుల నుంచి ప్రశంసలు లభించాయి.

తన ప్రసంగం ప్రారంభానికి ముందు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ చంద్రబాబును ప్రత్యేకంగా అభినందించారు.

# గిరిజన సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రత్యేక శ్రద్ధ

## గిరిజన ప్రాంతాల్లో మౌలిక వసతులకు ప్రాధాన్యం..

## జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** రాష్ట్రంలోని గిరిజనుల అభివృద్ధి, సంక్షేమం, హక్కుల పరిరక్షణకు ప్రత్యేకశ్రద్ధతో అధికారులు కృషిచేయాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యులు జాటోత్ హుస్సేన్ సూచించారు. వివిధ జిల్లాల్లో పర్యటిస్తున్న కమిషన్ జిల్లా కలెక్టరేట్లలో అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా పెద్దపల్లి కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అధికారులతో గిరిజనుల సంక్షేమం, ప్రభుత్వ పథకాల అమలు, మౌలిక వసతుల కల్పన తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల మంజూరు సిఫారసుల ఆధారంగా జరుగుతున్నా యనే ఆరోపణలు ఉన్నాయని, అటు వంటి పరిస్థితులను సరిదిద్దాలని సూచించారు. అర్హత కలిగిన ఎస్టీ కుటుంబాలకు ఎలాంటి సిఫారసులకు తావులేకుండా నిబంధనల ప్రకారం ఇళ్లు మంజూరు అయ్యేలా చర్యలు తీసు కోవాలన్నారు. ప్రతి ఇంటికీ తాగునీటి కుళాయి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. పట్టణాలు, గ్రామాల్లో ఎస్టీ ప్రజలు నివసించే ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ, ఇతర మౌలిక వసతులు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ శ్రీహర్షతో పాటు, ఎస్టీ కమిషన్ డైరెక్టర్ పి కళ్యాణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్లు జె అరుణ శ్రీ బి శ్రీరాములు, గిరిజన అభివృద్ధి అధికారి సంగీత, అన్ని విభాగాల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఫ్యూచర్ సిటీలో ఎస్‌బిఐ డేటా సెంటర్ ఏర్పాటు

## 10 ఎకరాలు కేటాయించిన సర్కార్

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** ఫ్యూచర్ సిటీలో తన సొంత మెగా డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు ఎస్‌బీఐ సిద్ధమైంది. అందుకోసం రంగారెడ్డి జిల్లాలోని మీర్‌ఖాన్‌పేట పరిధిలో 10 ఎకరాల స్థలాన్ని రేవంత్ రెడ్డి సర్కార్ కేటాయించింది. తొలుత ఈ డేటా సెంటర్‌కు 8 ఎకరాల వరకు ఇవ్వాలని రేవంత్ ప్రభుత్వం భావించింది. కానీ ఎస్‌బీఐ అభ్యర్థన మేరకు 10 ఎకరాల భూమిని కేటాయించేందుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అంగీకరించింది. మీర్‌ఖాన్‌పేట ప్రస్తుతం అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాలకు హబ్‌గా మారుతోంది. అయితే అమెజాన్ సంస్థ కూడా ఇదే ప్రాంతంలో డేటా సెంటర్ ఏర్పాటు చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది జులైలో ఈ సంస్థ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి భూమి పూజ చేసిన విషయం విదితమే.

# 127 పరుగుల తేడాతో అఫ్ఘాన్‌పై భారత్ జట్టు విజయం

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** యువ ఓపెనర్ అభిషేక్ శర్మ (108) సృష్టించిన శతక సునామీకి, ఆల్‌రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డి (3/25) బౌలింగ్‌లో చూపిన పదును తోడవడంతో టీమిండియా ఆఫ్ఘనిస్థాన్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. ఢిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియం వేదికగా జరిగిన మూడో టీ20లో 127 పరుగుల భారీ తేడాతో ఘన విజయం సాధించింది. ఈ గెలుపుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 30తో క్లీన్‌స్వీప్ చేసి సత్తా చాటింది. ఆంధ్రా ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ రెండో టీ20లోనూ 3 వికెట్లతో రాణించడం తెలిసిందే. ఇప్పుడు చివరి టీ20లోనూ రాణించడం ద్వారా మేనేజ్ మెంట్ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకున్నాడు. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆఫ్ఘన్ బౌలింగ్ ఎంచుకోగా, వారి నిర్ణయం ఎంత తప్పో నిరూపిస్తూ భారత బ్యాటర్లు పరుగుల సునామి సృష్టించారు. ముఖ్యంగా, యువ సంచలనం అభిషేక్ శర్మ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయాడు. 30 బంతుల్లోనే 100 పరుగులు చేసి అనేక రికార్డులు బద్దలు కొట్టాడు. ఓవరాల్ గా 34 బంతుల్లోనే 9 ఫోర్లు, 11 సిక్సర్ల సహాయంతో 108 పరుగులు చేసి విధ్వంసం సృష్టించాడు. అతనికి మరో ఎండ్‌లో సంజూ శాంసన్ (35 బంతుల్లో 50) చక్కటి సహకారం అందించడంతో తొలి వికెట్‌కు రికార్డు స్థాయిలో 142 పరుగుల భాగస్వామ్యం నెలకొంది. వీరిద్దరి ధాటికి పవర్‌ప్లేలోనే భారత్ 100 పరుగులు చేయడం విశేషం. చివర్లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (29) కూడా రాణించడంతో టీమిండియా నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 221 పరుగుల భారీ స్కోరు సాధించింది.



222 పరుగుల భారీ లక్ష్య ఛేదనలో ఆఫ్ఘనిస్థాన్ ఏ దశలోనూ పోటీ ఇవ్వలేకపోయింది. భారత బౌలర్ల ధాటికి క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయింది. ముఖ్యంగా, తెలుగు ఆటగాడు నితీశ్ కుమార్ రెడ్డి బంతితో నిప్పులు చెరిగాడు. కీలక సమయంలో 4 ఓవర్లలో కేవలం 25 పరుగులిచ్చి 3 వికెట్లు పడగొట్టి ఆఫ్ఘన్ పతనాన్ని శాసించాడు. అతనికి రవి బిష్ణోయ్ (3 వికెట్లు), అక్షర్ పటేల్ (2 వికెట్లు) కూడా తోడవడంతో ఆఫ్ఘన్ జట్టు 14.1 ఓవర్లలో 94 పరుగులకే కుప్పకూలింది. ఈ సిరీస్ విజయం ద్వారా యువ ఆటగాళ్లతో కూడిన భారత జట్టు బ్యాటింగ్, బౌలింగ్ విభాగాల్లో సంపూర్ణ ఆధిపత్యం చూపి, రాబోయే టోర్నీలకు తాము సిద్ధంగా ఉన్నామనే బలమైన సంకేతాలు పంపింది.

# తిరుమల బ్రహ్మోత్సవాలు



తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం ముత్యపుపందిరిపై ఊరేగుతున్న మలయప్పస్వామి

# ముత్యపుపందిరిపై మలయప్ప

**తిరుమల, సెప్టెంబరు 17 ప్రభాతవార్త ప్రతినిధి:** సప్తగిరుల్లో కొలువైన శ్రీవేంకటేశ్వరస్వామికి జరుగుతున్న సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల్లో మూడవరోజు గురువారం రాత్రి మలయప్పస్వామి విశేష అలంకారంలో ముత్యపుపందిరిపై ఊరేగి భక్తులను కటాక్షించారు. శ్రీకృష్ణుని అవతారమే కలియుగంలో శ్రీవేంకటేశ్వ రుడుగా ఏడుకొండల్లో కొలువైన స్వామిచల్లనిదేవుడు. భక్తులపాలిట కొంగుబంగారంగా విరాజిల్లు తున్నాడు. రాత్రి 7గంటలకు వాహన మండపం వద్ద ముత్యపు పందిరిపై వేంచేపుచేశారు. స్వామివారి వాహనం బయలుదేరి ఆలయ నాలుగు మాఢ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షిం చారు. ఈ వాహనసేవలో రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, టిటిడి ఛైర్మన్ బిఆం ‌నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఇఒ వెంకయ్య చౌదరి దంపతులు, సివిఎస్ఒ మురళీకృష్ణ, జిల్లా ఎస్పీ లంకెల సుబ్బ రాయుడు, ఆలయ డిప్యూటీ ఇఒ భాస్కర్, పేష్కార్ రామ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**తిరుమలలో రాష్ట్ర గవర్నర్ నజీర్**

శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా వాహనసేవల వీక్షణతోబాటు స్వామి వారి దర్శనార్థం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ గురువారం మధ్యాహ్నం తిరుమల విచ్చేశారు. ఆయనకు బాగీ అతిథిగృహం వద్ద టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు, టిటిడి ఇఒ ముద్దాడ రవిచంద్ర పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. గవర్నర్ సాయంత్రం శ్రీవారి వాహనసేవలో పాల్గొన్నారు. శుక్రవారం ఉదయం శ్రీవారిని దర్శించుకుని తిరుగు ప్రయాణమవుతారు.

# నేడు నాంపల్లి కోర్టుకు కెటిఆర్

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మాజీ మంత్రి కెటిఆర్ శుక్రవారం నాంపల్లి ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరుకానున్నారు. సంచలనం సృష్టించిన ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసుకు సంబంధించి జరుగుతున్న విచారణలో భాగంగా ఆయన కోర్టుకు హాజరుకాన్నారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో ఎసిబి అధికారులు కెటిఆర్‌ను విచారించిన సంగతి తెలిసిందే. హైదరాబాద్ వేదికగా 2023లో నిర్వహించిన ఫార్ములా ఈ కార్ రేస్ నిర్వహణ కోసం విదేశీ సంస్థకు ఎలాంటి నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా నిధులు బదలాయించారనే ప్రధాన ఆరోపణలు ఉన్నాయి. ఈ అక్రమ చెల్లింపుల వల్ల ప్రభుత్వ ఖజానాకు సుమారు రూ.54.88 కోట్ల భారీ ఆర్థిక నష్టం వాటిల్లిందని ఎసిబి అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తును ముమ్మరం చేశారు.

# ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కొండూరి రవీందర్‌రావు లీగల్ నోటీసు

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** రాష్ట్ర అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన పేరును ప్రస్తావిస్తూ సిరిసిల్లలో గత ప్రభుత్వ హయాంలో పెద్ద మొత్తంలో భూమిని తీసుకున్నారంటూ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవం అని బిఆర్ఎస్ నేత కొండూరు రవీందర్ పేర్కొన్నారు. ఈ మేరకు సిఎం రేవంత్‌రెడ్డికి ఆయన లీగల్ నోటీసు పంపించారు. దశాబ్దాలుగా సహకార రంగంలో పనిచేస్తూ, వివిధ సహకార సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించిన తనకు ఉన్న వ్యక్తిగత, వృత్తిపరమైన ప్రతిష్టను అసెంబ్లీ వేదికగా చేసిన ఆరోపణలు తీవ్రంగా దెబ్బతీశాయని లీగల్ నోటీసులో పేర్కొన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం నుంచి కరీంనగర్ డీసీసీబీ, తెలంగాణ స్టేట్ కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ (టిఎస్‌కాబ్), నాఫ్స్‌కాబ్ వరకు పలు బాధ్యతలను నిర్వహించినట్లు వివరించారు. అసెంబ్లీలో సిఎం చేసిన వ్యాఖ్యలు టెలి, ప్రింట్, డిజిటల్ మీడియా, సోషల్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం కావడంతో తన వ్యక్తిగత, వృత్తిపరమైన ప్రతిష్టకు తీవ్ర నష్టం వాటిల్లిందని కొండూరి రవీందర్ రావు పేర్కొన్నారు.అసెంబ్లీలో సిఎం చేసిన ఆరోపణలను బేషరతుగా ఉపసంహారించుకుని, బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# సెప్టెంబరు 17 చరిత్రకు మతరంగు పులిమే యత్నం

## కాంగ్రెస్, బిజెపి విలీన చరిత్రను వక్రీకరిసున్నాయి: టిఆర్ఎస్ చీఫ్ కవిత

హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:తెలంగాణ విలీన పోరాట యోధుల స్ఫూర్తితో రాష్ట్రంలో రాజ్యమేలుతున్న అరాచక శక్తులను గద్దె దించుతామని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత అన్నారు. సెప్టెంబర్ 17ను పురస్కరించుకుని బంజారాహిల్స్‌లోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆమె జాతీయ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ పౌరుషానికి, పోరాట పటిమకు, త్యాగాల చరిత్రకు నిదర్శనమన్నారు. అయితే ఈ చారిత్రక రోజును కాంగ్రెస్, బీజేపీలు తమ రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరిస్తున్నాయని విమర్శించారు.తెలంగాణ విలీనానికి స్టేట్ కాంగ్రెస్ పోరాటమే కారణమని సీఎం చెబుతున్నారని, అది వాస్తవం కాదని కవిత అన్నారు.

# సెప్టెంబరు 17న నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి

## బిజెపి రాష్ట్ర కార్యాలయంలో ఘనంగా హైదరాబాద్ విమోచన దినోత్సవాలు

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** ఆగస్టు 15న దేశానికి బ్రిటిష్ పాలన నుంచి స్వాతంత్రం వస్తే.. సెప్టెంబర్ 17న నిజాం నిరంకుశ పాలన నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి లభించిందని, అందుకే తెలంగాణ ప్రజలకు ఆగస్టు 15 ఎంత ముఖ్యమైనదో సెప్టెంబర్ 17 కూడా అంతే పవిత్రమైన, చారిత్రాత్మకమైన రోజని బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు స్పష్టం చేశారు.

నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం హైదరాబాద్ విమోచన దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు గారు, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డితో కలిసి జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, శాసనమండలి సభ్యులు (ఎమ్మెల్సీ) మల్క కొమరయ్య , పార్టీ రాష్ట్ర ముఖ్య నేతలు, పదాధికారులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ.. సెప్టెంబర్ 17 తెలంగాణ ప్రజల చరిత్రలో అత్యంత పవిత్రమైన, చారిత్రాత్మకమైన రోజని కొనియాడారు.

# రైతులకు ఎల్ నినో బిగ్ షాక్

- పంట మార్చినా తప్పని కష్టాలు - వర్షాభావం, తగ్గిన నీటి మట్టాలు, కరెంటు కోతలు - ఎండిపోతున్న కూరగాయలు, ఆకుకూరల తోటలు - పెట్టుబడులు కూడా రావని ఆందోళనలో రైతాంగం

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త :** వర్షాలు, పచ్చని పంటలతో కళకళలాడాల్సిన ప్రస్తుత వాతావరణాన్ని ఎల్ నినో ప్రభావం అస్తవ్యస్తంగా మార్చింది. వర్షాకాలం నాలుగో నెలలో రెండు వారాలు దాటినా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కరువు ఛాయలు వెంటాడుతూనే ఉన్నాయి. ఆకాశం వైపు రైతన్న ఆశగా చూస్తుంటే నేల మాత్రం నెర్రలు బారుతోంది. ఒకవైపు వర్షాలు లేక పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, మరోవైపు పడిపోతున్న భూగర్భజలాలు, ఇంకోవైపు కరెంటు కోతలతో చేతికొచ్చే దశలో ఎండిపోతున్న కూరగాయలు, ఆకుకూరల తోటలు దెబ్బతింటున్నాయి. ఒకప్పుడు తెలంగాణలో 5.52 లక్షల ఎకరాల్లో పండిన కూరగాయలు ప్రస్తుతం 45 వేల ఎరాలకు పడిపోయింది. మరోపక్క హార్టికల్చర్‌కు కేంద్రంగా ఉండే హైదరాబాద్ చుట్టుపక్కల గ్రామాలు ఇప్పుడు రియల్ ఎస్టేట్ విస్తరణతో చిక్కుడు, టమాటా, బీన్స్, క్యాబేజీ, వంగ, బెండ, కంద లాంటి కూరగాయల సాగు క్రమంగా తగ్గిపోయింది, దీనికి తోడు ఇప్పుడు ఎల్ నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితుల్లో అంతంత మాత్రంగా వేసిన కూరగాయలు, ఆకుకూరల తోటలు ఎండిపోతున్నాయి. వర్షాలు సరిగ్గా పడకపోవడంతో పత్తి, మిరప జోలికి వెళ్తే రిస్క్ ఎక్కువని రైతులు భావించారు. ఎక్కువ వాటర్ అవసరం అయ్యే పంటల జోలికి వెళ్లొద్దని ప్రభుత్వం కూడా పదే పదే చెప్పింది. దీంతో తక్కువ నీటితో, తక్కువ టైంలో చేతికొచ్చే బెండ, టమాటా, దోస, చిక్కుడు, వంకాయ, బీర, సొరకాయ తదితర కూరగాయలు, ఆకు కూరల సాగు వైపు మొగ్గు చూపారు. అప్పులు చేసి మరీ వేలల్లో పెట్టుబడి పెట్టారు. అయితే ప్రభుత్వం ఊహించిన దాని కంటే దారుణంగా ఉండి రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ ఏడాది నైరుతి, ఈశాన్య రుతుపవనాలు ఎక్కువ వర్షపాతాన్ని తీసుకుని రాకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. ప్రధాన జలాశయాలు, నీటి వనరులు, చెరువులన్నీ అడుగంటిపోయి జలకళ తప్పి కరవు ఛాయలు కమ్ముకుంటున్నాయి. పోనీ బోర్ల వైపు చూస్తే భూగర్భ జలాల లెవల్స్ డేంజర్ జోన్‌కు పడిపోయాయి. నీటి ఎద్దడి ఒకవైపు అయితే, విద్యుత్ కోతలు మరోవైపు రైతుల నడుం విరుస్తున్నాయి. కొద్దో గొప్పో ఉన్న పాతాళ గంగను తోడుకుందామన్నా కరెంట్ కష్టాలు వెంటాడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో కూరగాయలు పూతకు వచ్చే కీలక దశలో సరిపడా నీరు అందక, మోటార్లు రన్ అవ్వక పంట తోటలు కళ్లముందే ఎండిపోతున్నాయి. ప్రధాన ఆహార పంటలతో పాటు, ప్రస్తుతం చేతికొచ్చే దశలో కూరగాయలు, ఆకుకూరల పైర్లు ఎండిపోతుండటం రైతుల్లో కలవరం కలిగిస్తోంది. వర్షాభావంతో చిక్కుడు పంటలు ఎండిపోతుండగా ఇక ఆశలు పూర్తిగా వదిలేసుకున్న కొందరు రైతులు ఎండిపోయిన పంటలను గేదెలు, ఆవులు, మేకలు, గొర్రెలకు మేతగా అందిస్తున్నారు.

రాష్ట్రంలోని ఖమ్మం, వరంగల్, నల్గొండ, మహబూబ్‌నగర్, రంగారెడ్డి వంటి ఉమ్మడి జిల్లాల్లో కూరగాయల తోటలు రక్షించుకునేందుకు రైతులు ట్యాంకర్ల సాయంతో నీరు పెట్టుకుంటున్నారు. ఆర్థిక భారమైనా కూడా ఒక్కో ట్యాంకరు 500 నుంచి 800 రూపాయల చొప్పున చెల్లించి పంటలకు నీరు అందిస్తున్నారు. దీంతో పెట్టుబడి పెట్ట లేక పలువురు రైతులు ఎండిపోతున్న పంటలను పశువులకు మేతగా వదిలేస్తున్నారు.

## కోల్‌కతాలో ప్రధాని మోడీ మైనపు విగ్రహం ఆవిష్కరణ

**కోల్‌కతా, సెప్టెంబరు 17:** ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినాన్ని పురస్కరించుకుని, ఆయన 25 ఏళ్ల ప్రజా సేవను స్మరించుకుంటూ పశ్చిమ బెంగాల్ బీజేపీ కార్యాలయంలో గురువారం ప్రధాని మోడీ మైనపు విగ్రహాన్ని ఆవిష్కరించారు. అసన్‌సోల్‌కు చెందిన శిల్పి సుశాంత రాయ్ ఈ విగ్రహాన్ని రూపొందించారు. దాదాపు రెండు నెలల పాటు శ్రమించి, ప్రధాని మోడీని పోలినట్టుగా కనిపించేలా ఈ విగ్రహాన్ని తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ విగ్రహాన్ని స్వయంగా ప్రధాని మోడీకి అందజేయాలని సుశాంత రాయ్ భావించారు. అయితే అధికారిక ప్రోటో కాల్ కారణంగా అది సాధ్యపడలేదు. దీంతో కోల్‌కతాలోనే విగ్రహాన్ని ఆవిష్కరించేలా ఏర్పాట్లు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సామిక్ భట్టాచార్య పర్యవేక్షణలో ప్రధాని మోడీ జన్మదినం సందర్భంగా ఈ విగ్రహాన్ని ఆవిష్కరించారు. "ప్రధాని మోడీ మైనపు విగ్రహాన్ని రూపొందించాలన్నది నా చిరకాల స్వప్నం.



మైనం, ఇనుముతో ఈ విగ్రహాన్ని తయారు చేశాను. ఇది 5.7 అడుగుల ఎత్తు ఉంటుంది. ప్రత్యేకమైన రూపాన్ని ఇవ్వడానికి బెంగాలీ ధోతీ, కుర్తాను ధరింపజేశానని సుశాంత రాయ్ తెలిపారు. పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించిన అనంతరం మే 4న ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో ప్రధాని మోడీ కనిపించిన రూపాన్ని ఆధారంగా చేసుకుని ఈ విగ్రహాన్ని రూపొందించినట్లు ఆయన చెప్పారు. రాజ్యసభ సభ్యుడు సామిక్ భట్టాచార్య మాట్లాడుతూ "నరేంద్ర మోడీ25 ఏళ్ల పరిపాలనా బాధ్యతల ద్వారా భారతదేశాన్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్లారు. ఇతరులు పరిమితులను చూసిన చోట ఆయన అవకాశాలను చూశారు. ఆ ఆకాంక్షలను వాస్తవ రూపంలోకి తీసుకువచ్చారు" అని అన్నారు. నరేంద్ర మోదీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా బీజేపీ దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా, ఆ తర్వాత ప్రధానమంత్రిగా ఆయన అందించిన సేవలను గుర్తుచేసుకుంటూ ఈ కార్యక్రమాలను చేపట్టింది. గురువారం ప్రారంభమైన ఈ వేడుకలు వచ్చే నెల రోజుల పాటు కొనసాగనున్నాయి. వేడుకల్లో భాగంగా ప్రధాని మోడీ గౌరవార్థం గురువారం సాయంత్రం దేశవ్యాప్తంగా మట్టి దీపాలను వెలిగించేందుకు కూడా ఏర్పాట్లు చేశారు.

# జపాన్ కేబినెట్‌లో స్వల్ప మార్పులు.. కీలక మంత్రులు కొనసాగింపు



**టోక్యో, సెప్టెంబర్ 17:** జపాన్ ప్రధాని సనాయే తకైచి గురువారం తన కేబినెట్‌లో స్వల్ప పునర్వ్యవస్థీకరణ చేపట్టారు. అధికార కూటమిని మరింత బలోపేతం చేయడంతో పాటు, ఆహార ఉత్పత్తులపై వినియోగ పన్నును తగ్గించే ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే లక్ష్యంతో ఈ మార్పులు చేశారు. అయితే పన్ను తగ్గింపు అమలుకు అవసరమైన నిధులను ఎలా సమకూర్చాలన్న దానిపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జపాన్‌లో ప్రధానమంత్రులు ప్రభుత్వ ప్రతిష్ఠను మెరుగుపరచడం, తమ పార్టీకి చెందిన అనుభవజ్ఞులు, విధేయులకు మంత్రిత్వ శాఖల బాధ్యతలు అప్పగించడం కోసం తరచూ కేబినెట్‌లో మార్పులు చేస్తుంటారు. పదవిలోకి వచ్చి దాదాపు ఏడాది పూర్తవుతున్న సమయంలోనూ తకైచికి అధిక ప్రజాదరణ కొనసాగుతుండటంతో కీలక మంత్రులను ఆమె కొనసాగించారు. ప్రధాని తకైచికి సన్నిహితుడిగా, ప్రభుత్వ ప్రధాన ప్రతినిధిగా ఉన్న మినోరు కిహారా ప్రకటించిన కొత్త కేబినెట్ జాబితాలో కీలక మంత్రులకు కొనసాగింపు లభించింది. కిహారాతో పాటు ఆర్థిక మంత్రి సత్సుకి కటయామా, విదేశాంగ మంత్రి తోషిమిట్సు మోటేగి, రక్షణ మంత్రి షింజిరో కొయిజుమి తమ పదవుల్లో కొనసాగనున్నారు. ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన కీలక మంత్రులకూ తకైచి కొనసాగింపు ఇచ్చారు. వాణిజ్య, పరిశ్రమల మంత్రి ర్యోసేయ్ అకాజావా, ఆర్థిక వృద్ధి వ్యూహాల మంత్రి మినోరు కియూచి తమ బాధ్యతల్లో కొనసాగనున్నారు.

అమెరికాతో జపాన్ సుంకాలపై జరుపుతున్న చర్చలకు అకాజావా నేతృత్వం వహిస్తున్నారు. ప్రభుత్వ వ్యయాన్ని చురుగ్గా పెంచాలనే విధానానికి కియూచి మద్దతు ఇస్తున్నారు. ఆర్థిక మంత్రి కటయామా నేతృత్వంలో పడిపోతున్న యెన్ విలువను నిలబెట్టేందుకు జపాన్ ప్రభుత్వం పలుమార్లు విదేశీ మారకద్రవ్య మార్కెట్లో జోక్యం చేసుకుంది. అమెరికాతో కలిసి అరుదైన ఉమ్మడి జోక్యం కూడా చేపట్టింది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం,

బలహీనపడుతున్న యెన్ మధ్య తకైచి ప్రభుత్వం వచ్చే ఏడాది నుంచి ఆహార ఉత్పత్తులపై వినియోగ పన్నును తగ్గించే ప్రయత్నం చేస్తోంది. పన్ను తగ్గింపు హామీకి ఓటర్ల నుంచి మద్దతు ఉన్నప్పటికీ, ఆర్థికవేత్తలు ఈ ప్రణాళికపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## అద్భుత కావ్యంగా ఎంఎస్ సుబ్బులక్ష్మి బయోపిక్

**చెన్నై, సెప్టెంబరు 17:** భారతీయ సంగీత ప్రపంచంలో తన గానంతో యుగాలను మైమరపించిన కర్ణాటక సంగీత సామ్రాజ్ఞి, భారతరత్న ఎం.ఎస్.సుబ్బులక్ష్మి జీవిత చరిత్ర వెండితెరపై ఆవిష్కృతం కాబోతోంది. ఎంఎస్‌ఎ లెగసీ ఆన్ స్క్రీన్ పేరిట తెరకెక్కుతున్న ఈ ప్రతిష్టాత్మక బయోపిక్ ప్రారంభోత్సవం చెన్నైలో అత్యంత వైభవంగా జరిగింది. ఈ వేడుకకు లోకనాయకుడు కమల్ హాసన్ ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు సన్నివేశానికి తొలి క్లాప్ కొట్టారు. సంగీత ప్రపంచం గర్వించే దిగ్గజ గాయనిగా నేషనల్ క్రష్ రష్మిక మందన్న నటిస్తుండటంతో ఈ ప్రాజెక్ట్‌పై దేశవ్యాప్తంగా సినీ, సంగీత వర్గాల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈవెంట్‌లో మాట్లాడిన కమల్ హాసన్ ఎంతో భావోద్వేగానికి లోనయ్యారు. కోట్లాది మంది హృదయాలను భక్తిభావంతో కదిలించిన ఎం.ఎస్.సుబ్బులక్ష్మి గారి అద్వితీయ జీవితాన్ని సినిమాగా తీసుకురావడం అభినందనీయమన్నారు. అలాంటి మహోన్నత ప్రాజెక్ట్ లాంచ్‌లో తాను భాగం కావడం పూర్వజన్మ సుకృతం, దేవుడిచ్చిన గొప్ప ఆశీర్వాదంగా భావిస్తున్నానని చెప్పారు. సుబ్బులక్ష్మి గారి పాత్రను పోషిస్తున్న రష్మిక మందన్నను ప్రత్యేకంగా అభినందించిన కమల్ ఇంతటి ఐకానిక్, లెజెండరీ పాత్రను పోషించడానికి ఎంతో ధైర్యం కావాలని, అంచనాలకు భయపడకుండా తనదైన సహజ నటనతో ఈ పాత్రకు నిండుదనం తీసుకు రావాలని ధైర్యం చెప్పారు. మళ్ళీ రావా, జెర్సీ చిత్రాలతో భావోద్వేగాలను అద్భుతంగా పండించిన దర్శకుడు గౌతమ్ తిన్ననూరి ఈ బయోపిక్‌కు దర్శకత్వం వహిస్తున్నారు. సుబ్బులక్ష్మి గారి బాల్యం, ఆమె సంగీత ప్రస్థానం, జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతితో పాటు జీవితంలోని అరుదైన కోణాలు.

## రూ.100 లంచం కేసులో 31 యేళ్లకు తీర్పు 75 యేళ్ల వయసులో జైలు శిక్ష

**రాంచీ, సెప్టెంబరు 17:** రాంచీలోని హతియా రైల్వే స్టేషన్‌లో రూ.100 లంచం తీసుకున్న కేసులో మాజీ పార్సిల్ క్లర్క్ కాళీ శంకర్ ధోబీకి విధించిన శిక్షను జార్ఖండ్ హైకోర్టు గురువారం సమర్థించింది. అయితే కేసు సుదీర్ఘకాలం కొనసాగడం, నిందితుడి వయసు 75 ఏళ్లు కావడం, అనారోగ్య పరిస్థితులను పరిగణనలోకి తీసుకున్న కోర్టు జైలు శిక్షను కొంత తగ్గించింది. 1995లో కాళీ శంకర్ ధోబీ హతియా రైల్వే స్టేషన్‌లో పార్సిల్ క్లర్క్‌గా పనిచేస్తున్నారు. ఫిర్యాదుదారు నిర్మల్ కుమార్ బెగానీ తన మోటార్‌సైకిల్‌ను హతియా రైల్వే స్టేషన్ నుంచి బిహార్‌లోని సమస్తిపూర్‌కు పంపించాలని భావించారు. మోటార్‌సైకిల్‌ను బుక్ చేసేందుకు పార్సిల్ క్లర్క్ రూ.100 లంచం డిమాండ్ చేశారని ఆరోపణలు వచ్చాయి. దీంతో నిర్మల్ కుమార్ బెగానీ ఈ విషయాన్ని సీబీఐకి తెలియజేశారు. ఫిర్యాదును పరిశీలించిన అనంతరం సీబీఐ అధికారులు వల పన్నారు. 1995 ఏప్రిల్ 27న రూ.100 లంచం తీసుకుంటుండగా అప్పటి పార్సిల్ క్లర్క్ కాళీ శంకర్ ధోబీని సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం అవినీతి నిరోధక చట్టం కింద ఆయనపై కేసు నమోదు చేశారు. సీబీఐ దర్యాప్తు అనంతరం ఈ కేసు ప్రత్యేక కోర్టుకు వెళ్లింది. దాదాపు తొమ్మిదేళ్ల పాటు విచారణ సాగిన తర్వాత 2004లో ప్రత్యేక కోర్టు కాళీ శంకర్ ధోబీని దోషిగా తేల్చింది. అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 7 కింద ఏడాది జైలు శిక్షతో పాటు రూ.4వేలు జరిమానా విధించింది. అలాగే సెక్షన్ 13(2) కింద ఏడాదిన్నర జైలు శిక్ష, రూ.6వేలు జరిమానా విధించింది. రెండు శిక్షలు ఏకకాలంలో అమలు.

## దక్షిణ మధ్య రైల్వేలో స్వచ్ఛతా హీ సేవా ప్రారంభం

**అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞచేయించిన జిఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ**

**తార్నాక, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :** భారతీయ రైల్వే ఆధ్వర్యంలో "స్వచ్ఛతా హీ సేవా-2026 పరిశుభ్రతా ప్రచారం దక్షిణ మధ్య రైల్వేలో ప్రారంభమైంది. సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు "స్వచ్ఛతలో భాగస్వామ్యం.. స్వచ్ఛ భారత్, వికసిత్ భారత్ అనే ఇతివృత్తంతో కార్యక్రమాలను నిర్వహించనున్నారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో గురువారం దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ అధికారులు, సిబ్బందితో స్వచ్ఛతా ప్రతిజ్ఞ చేయించారు. పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణపై జోన్‌కు ఉన్న నిబద్ధతను ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో అదనపు జనరల్ మేనేజర్ సత్య ప్రకాష్‌తో పాటు వివిధ విభాగాల ప్రధానాధికారులు పాల్గొన్నారు. అక్టోబర్ 2న ప్రచారం ముగియనుండగా, అదే రోజు మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని "సేవా దివస్‌గా నిర్వహించనున్నారు. అలాగే అక్టోబర్ 1 నుంచి 15 వరకు "స్వచ్ఛతా పక్షోత్సవం-2026, అక్టోబర్ 2 నుంచి 31 వరకు "ప్రత్యేక ప్రచారం-6.0ను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమాల్లో ఇవ్యర్థాల సేకరణ, విభజన, సక్రమ పారవేయడంతో పాటు రైల్వే స్టేషన్లు, రైళ్లు, కార్యాలయాల్లో పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా జీఎం సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మాట్లాడుతూ, అధికారులు, సిబ్బంది ప్రచారంలో చురుకుగా పాల్గొని పరిశుభ్రతను దైనందిన జీవితంలో అలవాటుగా మార్చుకోవాలని పిలుపునిచ్చారు. కుటుంబ సభ్యులు, పొరుగువారిలోనూ పరిశుభ్రతపై అవగాహన కల్పించి రైల్వే ప్రాంగణాలు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు సహకరించాలని కోరారు.



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యజ్ఞ పవన్‌కుమార్‌శర్మ

### శ్రీనివాస్‌కు వ్యతిరేకంగా 5 నుంచి

# ఆడ బిడ్డల ఆత్మగౌరవ యాత్ర

### యజ్ఞ పవన్‌కుమార్‌శర్మ ప్రకటన

**సైఫాబాద్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఛైర్మన్ బసవరాజు శ్రీనివాస్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా తెలంగాణ ఆడ బిడ్డల ఆత్మగౌరవ యాత్రను అక్టోబరు 5వ తేదీ నుంచి రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామని తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల జెఎసి ఛైర్మన్ యజ్ఞ పవన్‌కుమార్‌శర్మ తెలిపారు. తెలంగాణ బ్రాహ్మణ ఐక్యవేదిక, తెలంగాణ బ్రాహ్మణ ఉద్యమకారుల వేదిక ఆధ్వర్యంలో జరిగే యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఈ మేరకు గురువారం గన్‌పార్కులోని తెలంగాణ అమరవీరుల స్థూపం ఎదుట ఆయన ఈ యాత్రకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఈ యాత్ర 15 రోజుల పాటు ఈ నెల 23వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగుతుందన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న బసవరాజు శ్రీనివాస్ తెలంగాణ ఉద్యమకారులను, దళితులను, మహిళలను కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేశారని ఆయన ఆరోపించారు. ఆయన వ్యాఖ్యలు సభ్యసమాజం తలదించుకునే విధంగా ఉన్నాయని తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ఉద్యమకారులకు, దళితులకు, మహిళలకు జరిగిన అవమానకర వ్యాఖ్యలపై రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం చేస్తామని హెచ్చరించారు. సిఎం రేవంత్‌రెడ్డి తక్షణమే శ్రీనివాస్‌ను పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. ఆయనను బర్తరఫ్ చేసేంతవరకు ఉద్యమిస్తామని శర్మ చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘం జెఎసి వ్యవస్థాపక అధ్యక్షుడు సూర యాదయ్యగౌడ్, వేదిక ప్రతినిధులు పోచంపల్లి రమణరావు, గంపా రామారావు, రవికిరణ్, గూడ రాజేశ్వర్‌రావు, జ్యోతి కులకర్ణి, రజనీరావు, రమణరావు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన హాస్టల్ బాలికలకు ప్రెగ్నెన్సీ పరీక్షలా? సిజెపి చీఫ్ అభిజిత్ దీప్కే ఆగ్రహం



**ముంబయి, సెప్టెంబరు 17:** మహారాష్ట్రలోని కొన్ని గిరిజన హాస్టళ్లలో బాలికలకు ప్రెగ్నెన్సీ పరీక్షలు నిర్వహిస్తున్నారని సీజేపీ ఫౌండర్ అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే సమయంలో హాస్టళ్లలోని మౌలిక వసతులపై ఆయన ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇంటినుంచి హాస్టల్‌కు తిరిగి వచ్చిన బాలికలకు గర్భస్త పరీక్షలు నిర్వహించడాన్ని ఆయన తప్పుబట్టారు. అభిజీత్ దీప్కే తాజాగా మహారాష్ట్ర, నాగ్‌పూర్‌లోని ఒక గిరిజన బాలికల హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి బాలికలు హాస్టల్‌లో ఉన్న పరిస్థితులపై దీప్కేకు వివరించారు. ఒక బాలిక మాట్లాడుతూ తాను ఇంటి నుంచి సెలవుల తర్వాత హాస్టల్‌కు రాగానే తమ మేడమ్ ప్రెగ్నెన్సీ పరీక్ష కోసం తనను ఆస్పత్రికి పంపించిందని వివరించారు. మేడమ్ సూచన మేరకు తన సోదరుడితో కలిసి ప్రెగ్నెన్సీ పరీక్ష కోసం హాస్పిటల్‌కు పంపించిందన్నారు. అక్కడ పరీక్ష కోసం అందరూ పెళ్లైన మహిళలే ఉన్నారని, వాళ్లంతా తనను తప్పుగా చూశారని ఆ బాలిక ఆవేదన వ్యక్తం చేసింది. మరో విద్యార్థిని కూడా ఇదే తరహా ఫిర్యాదు చేసింది. తాను హాస్టల్‌లో చేరగానే తనను కూడా ప్రెగ్నెన్సీ పరీక్ష కోసం పంపించారని ఆవేదన వ్యక్తం చేసింది. బాలికలు సెలవుల్లో ఇంటికి వెళ్లొచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికీ ఇలా ప్రెగ్నెన్సీ పరీక్షలు నిర్వహించడం తప్పనిసరి అని పలువురు విద్యార్థినులు తెలిపారు. దీంతో ఈ అంశంపై అభిజీత్ దీప్కే ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ గిరిజన హాస్టళ్లలోని విద్యార్థినులకు ఇలా గర్భస్థ పరీక్షలు నిర్వహించడం ఏంటని దీప్కే ప్రశ్నించారు. మహారాష్ట్రలోని మంత్రులు, ఎమ్మెల్యేలు తమ కూతుళ్లకు కూడా ఇలా ప్రెగ్నెన్సీ పరీక్షలు నిర్వహిస్తారా అని దీప్కే ప్రశ్నించారు. అలాగే, 150 మంది ఉండే హాస్టళ్లలో రెండు, మూడు వాష్‌రూమ్‌లు మాత్రమే ఉన్నాయన్నారు. విద్యార్థినులు పడుకోవడానికి సరైన బెడ్స్ కూడా లేవన్నారు. హాస్టళ్లలో సరైన మౌలిక వసతులు కూడా లేవన్నారు. ఇలాంటి హాస్టళ్లలో ప్రజా ప్రతినిధులు తమ పిల్లల్ని చదివిస్తారా అని ప్రశ్నించారు.

## వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఢీకొని వ్యక్తి మృతి

**ఘట్‌కేసర్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త:** రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుండి బయలుదేరిన వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు తిరుపతి వెళ్తుతుండగా ఘట్‌కేసర్ -బీబీనగర్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తుతెలియని వ్యక్తి ఎంపీ24ఎన్-9936 నెంబర్ గల ఫ్యాషన్ ప్లస్ మోటార్ సైకిల్ పై కూర్చొని కాళ్లతో నెట్టుకుంటూ రైలు పట్టాల మధ్యనుండి బీబీనగర్ వైపు వెళుతుండగా వెనుక నుండి వేగంగా వస్తున్న వందే భారత్ రైలు ఢీకొట్టింది. దీంతో 99 స్లీపర్ల దూరం ఈడ్చుకు వెళ్లిన తర్వాత ఎగిరి రైలు పట్టాల పక్కన పడగా తలపగిలి, శరీరమంతా తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సికింద్రాబాద్ రైల్వేపోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించి వివరాలు సేకరించారు. ప్రమాదంలో మోటార్ సైకిల్ చిత్తుచిత్తయి రైల్వే ట్రాక్‌పై దాదాపు 300 మీటర్ల దూరం వరకు దాని భాగాలు పడిపోయాయి. మృతుడిని గుర్తించుటకు అతడి వద్ద ఏలాంటి గుర్తింపు పత్రాలు లభించలేదని మృతుడు దాదాపు 5.6 అడుగుల ఎత్తు, చామన ఛాయ రంగుతో ఉన్నాడని కుడివైపు ఛాతీపై పుట్టుమచ్చ ఉందని తెలిపారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ డిప్యూటి ఎస్ఎస్ ఇచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు.

మృతుడి వివరాలు తెలిసినవారు సికింద్రాబాద్ రైల్వే పోలీస్ ఇనెస్పెక్టర్ సెల్ నెం: 8712658581 నెంబర్‌కి గానీ దర్యాప్తు అధికారికి 9666280808 నెంబర్‌కి గానీ సమాచారం అందించాలని జిఆర్‌పి పోలీసులు తెలిపారు.

## అమెరికాలో సంతోష్‌నగర్ యువకుడు అనుమానాస్పద మృతి




మహ్మద్ జుబేర్ హుస్సేన్ ఫైల్‌ఫొటో

**సైదాబాద్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** హైద్రాబాద్ పాతబస్తీ సంతోష్‌నగర్‌కు చెందిన యువకుడు అమెరికాలో పెళ్లయిన 17 రోజులకే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. సంతోష్‌నగర్‌కు చెందిన మహ్మద్ జుబేర్ హుస్సేన్(27) ఉన్నత చదువుల కోసం 2021లో అమెరికాకు వెళ్లాడు. చదువు పూర్తయిన తర్వాత మసాచువెట్స్‌లోని లోవెల్ కంపెనీలో సివిల్ ఇంజనీర్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. గత నెల 28వ తేదీన టెక్సాస్‌లో మహ్మద్ జుబేర్ హుస్సేన్ వివాహం జరిగింది. వివాహం జరిగిన కొద్ది రోజుల తర్వాత మెసాచుసెట్స్‌లోని తన గదికి వచ్చి అక్కడే ఉంటున్నాడు. ఈ నెల 14వ తేదీన హైద్రాబాద్‌లోని తన కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి మాట్లాడాడు. కుటుంబ సభ్యులతో మాట్లాడిన దాదాపు 8 గంటల తర్వాత అతని రూమ్ మేట్ హుస్సేన్ కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి హుస్సేన్ నిద్రలోనే మృతి చెందాడని సమాచారం అందించాడు. వివాహం జరిగిన 17 రోజులకే హుస్సేన్ మృతి చెందడం, జుబేర్ అతని తల్లిదండ్రులకు ఒకే ఒక్క కుమారుడు కావడంతో వారు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. జుబేర్ మృతి విషయం తెలుసుకున్న ఎంబిటి ప్రతినిధి అమ్జద్ ఉల్లాఖాన్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మృతుని కుటుంబం ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో జుబేర్ మృతదేహాన్ని ప్రభుత్వ ఖర్చులతో హైద్రాబాద్‌కు రప్పించాలని కేంద్ర విదేశాంగ శాఖ మంత్రి జైశంకర్‌కు ట్విట్టర్ ద్వారా విజ్ఞప్తి చేశారు.

## జెన్‌జీని ఆకర్షించేందుకు రూటు మారిన మోడీ ప్రసంగాలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** ప్రధాని నరేంద్ర మోడీతన ప్రసంగ శైలిలో మార్పులు చేస్తూ, యువతకు మరింత చేరువయ్యేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా, నేటి తరం యువత ఎక్కువగా వాడే ఆధునిక పరిభాషను, స్లాంగ్ పదాలను తన ప్రసంగాల్లో ఉపయోగిస్తూ అందరినీ ఆకర్షిస్తున్నారు. ఆయన ప్రసంగాల్లో ఈ కొత్త పదజాలం వాడటం వెనుక, యువ ఓటర్లను ఆకట్టుకోవాలనే స్పష్టమైన వ్యూహం కనిపిస్తోంది. ఇటీవల ఢిల్లీలోని శ్రీరామ్ కాలేజ్ ఆఫ్ కామర్స్ (ఎస్ఆర్‌సీసీ) శతాబ్ది ఉత్సవాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ కళాశాల పూర్వ విద్యార్థులను ఓజీలుగా అభివర్ణించారు. జెన్‌జీ పరిభాషలో ఓజీ అంటే ఒరిజినల్ గ్యాంగ్‌స్టర్ అని అర్థం. అంటే తమ రంగంలో అత్యంత ప్రావీణ్యం ఉన్నవారిని, ప్రత్యేకమైన వారిని గౌరవంగా ఇలా పిలుస్తారు. ఇదే ప్రసంగంలో ఫ్లెక్స్ అనే పదాన్ని కూడా ఆయన వాడారు. "ఈ రోజుల్లో కూడా ఢిల్లీ యూనివర్సిటీలో మీరు ఎస్ఆర్‌సీసీ విద్యార్థి అని చెప్పుకోవడం ఒక ఫ్లెక్స్ లాంటిది" అని ఆయన వ్యాఖ్యానించారు. తమకున్న హోదాను, నైపుణ్యాన్ని లేదా విజయాన్ని గర్వంగా ప్రదర్శించడాన్ని ఫ్లెక్స్ అంటారు. ఇంతకుముందు 2022లో డెన్మార్క్ ప్రధానితో కలిసి ఇండియాడెన్మార్క్ బిజినెస్ ఫోరమ్‌లో ప్రసంగిస్తూ ప్రధాని ఫోమో అనే పదాన్ని ప్రస్తావించారు. ఫియర్ ఆఫ్ మిస్సింగ్ అవుట్ అనే పదబంధానికి సంక్షిప్త రూపమే ఈ ఫోమో. సోషల్ మీడియాలో ఈ పదం చాలా ప్రాచుర్యం పొందింది. భారత్‌లో పెట్టుబడులు పెట్టని వారు గొప్ప అవకాశాన్ని కోల్పోతారని, వారు ఫోమోకు గురవుతారని చెప్పడానికి మోడీ ఈ పదాన్ని చమత్కారంగా ఉపయోగించారు.

## యూఎస్ఐసి ఛాంపియన్‌షిప్‌లో సత్తాచాటిన దక్షిణ మధ్య రైల్వే ఉద్యోగి



టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో విఘ్నేష్

**సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :** ప్రపంచ రైల్వే టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో విఘ్నేష్‌కు స్వర్ణం తార్నాక, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : లాలాగూడ వర్క్‌షాప్‌లో ఆఫీస్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్న పి.సి. విఘ్నేష్ అంతర్జాతీయ స్థాయిలో సత్తాచాటారు. బల్గేరియాలో సెప్టెంబర్ 11 నుంచి 16 వరకు జరిగిన యూఎస్ఐసీ (యూనియన్ స్పోర్టివ్ ఇంటర్నేషనల్ డెస్ చెమినోట్స్) ప్రపంచ రైల్వే టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని సాధించారు. ప్రతి నాలుగేళ్లకు ఒకసారి జరిగే ఈ ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్‌లో విఘ్నేష్ భారతీయ రైల్వేకు ప్రాతినిధ్యం వహించారు. 2007 నుంచి అంతర్జాతీయ ఛాంపియన్‌షిప్‌లలో పాల్గొంటున్న ఆయన ఇప్పటివరకు ఐదు స్వర్ణ పతకాలు, ఒక రజత పతకంతో కలిపి మొత్తం ఆరు పతకాలను సాధించారు.

### కూతురిని వేధించ వద్దన్నందుకు తండ్రి దారుణ హత్య

**సైదాబాద్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** కూతురినువేధించవద్దని చెప్పినందుకు తండ్రిని దారుణంగా హత్య చేసిన సంఘటన మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. బాధుతులు, పోలీసుల కదజనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. మాదన్నపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని బాగ్ ఏ జహారా ప్రాంతానికి చెందిన యువకుడు మహ్మద్ తమ పక్కింటి యువతిని వేధింపులకు గురి చేస్తున్నాడు. దీంతో యువతి తండ్రి హస్మత్ తన కూతురుని వేధించవద్దని మహ్మద్‌ను మందలించాడు. దీంతో ఆగ్రహానికి గురైన ఆ యువకుడు కత్తితో హస్మత్‌పై దాడి చేశాడు. దాడిలో హస్మత్ అక్కడికక్కడే మృతి చెందాడు. తండ్రిని కాపాడేందుకు వచ్చిన యువతి సోదరుడు ఉమర్‌పై కూడా మహ్మద్ దాడికి పాల్పడడంతో అతనికి కూడా తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నాడు. నిందితుడు పరారీలో ఉన్నాడు.

### విత్తన రంగ అభివృద్ధిలో విశేష కృషికి డాక్టర్ కేశవులుకు జీవిత సాఫల్య పురస్కారం

**హైదరాబాద్, సెప్టెంబరు 17, ప్రభాతవార్త** విత్తన రంగ అభివృద్ధితో పాటు, వ్యవసాయ రంగ పురోభివృద్ధికి డాక్టర్ కె. కేశవులు అందించిన విశిష్ట సేవలు, చేసిన విశేష కృషికి జీవిత సాఫల్య పురస్కారానికి ఎంపికయ్యారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 2వ ఇండియా-ఆఫ్రికా సీడ్ సమ్మిట్-2026.లో భాగంగా, గురువారం తెలంగాణ రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా చేతుల మీదుగా కేశవులు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ఆయన సాధించిన ఈ ఘనత విత్తన రంగానికి, వ్యవసాయ రంగానికి గర్వకారణమని ఈ సందర్భంగా తెలిపారు. కాగా అంతర్జాతీయ విత్తన రంగంలో అత్యున్నత సంస్థ అయిన ఇంటర్నేషనల్ సీడ్ టెస్టింగ్ అసోసియేషన్ అధ్యక్షునిగా, తెలంగాణ రాష్ట్ర విత్తన, సేంద్రీయ ధృవీకరణ సంస్థ డైరెక్టర్‌గా సుదీర్ఘ కాలం పనిచేశారు. అంతర్జాతీయ వేదికలపై భారతీయ, తెలంగాణ విత్తన నాణ్యతను ప్రదర్శించి, విదేశాలకు విత్తన ఎగుమతులు పెరిగేలా కృషి చేశారు. రైతు సాధికారత విషయంలో చిన్న, మధ్యతరహా విత్తన కంపెనీలను ప్రోత్సహిస్తూ, సాంకేతికతను జోడించి రైతులకు గిట్టుబాటు ధరలు లభించేలా విధాన రూపకల్పన చేశారు.

### ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ తండ్రి కూతురు మృతి

**మైలార్‌దేవ్‌పల్లి,సెప్టెంబరు 17 ప్రభాతవార్త :** ద్విచక్ర వాహనంపై ప్రయాణం చేస్తున్న తండ్రి,కూతురును అతి వేగంగా వచ్చిన టిప్పర్ లారీ ఢీ కొట్టడంతో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి,కూతురు మృతి చెందిన సంఘటన బుధవారం అర్ధరాత్రి మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. మైలార్‌దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సి.హెచ్ శ్రీనివాస్ కథనం ప్రకారం....అత్తాపూర్ పరిధిలోని సులేమాన్‌నగర్‌కు చెందిన మహ్మద్ ఇస్మాయిల్ ఖాన్ (45) జీవనోపాధి నిమిత్తం పాతబస్తీ చార్మినార్ వద్ద బ్యాగులు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. కాగా ఇస్మాయిల్ ఖాన్ కూతురు బుస్రాబేగం (24) వివాహం అక్టోబరు నెలలో జరగనున్నది, ఈ నేపథ్యంలోనే పెళ్లి పనుల నిమిత్తం ఇస్మాయిల్ ఖాన్ బుధవారం రాత్రి 11.18 గంటల సమయంలో కూతురు బుస్రా బేగంతో కలిసి టివిఎస్ చాంప్ ద్విచక్ర వాహనంపై ఆరాంఘర్ చౌరస్తా మీదుగా ప్రయాణం చేస్తున్నారు. అదే సమయంలో హయత్‌నగర్ నుంచి అత్తాపూర్ వైపు కంకర లోడ్‌తో వెళుతున్న టిప్పర్ లారీ ఇస్మాయిల్ ఖాన్ ప్రయాణం చేస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో తండ్రి ఇస్మాయిల్ ఖాన్ సంఘటన స్థలంలోనే మృతి చెందగా, తీవ్ర గాయాల పాలైన కూతురు బుస్రా బేగం ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.

### మాజీ ఎమ్మెల్యే ఉప్పల మల్సూర్ కుటుంబానికి సిఎం రేవంత్‌రెడ్డి అండ

**హైదరాబాద్,సెప్టెంబరు17,ప్రభాతవార్త:** తెలంగాణలో రజాకార్ల నిరంకుశత్వానికి ఎదురొడ్డి పోరాడిన మాజీ ఎమ్మెల్యే ఉప్పల మల్సూర్ కుటుంబానికి సీఎం రేవంత్ రెడ్డి అండగా నిలిచారు. ఉప్పల మల్సూర్ కుటుంబం నేడు నిలువ నీడ కోసం ఎదురు చూస్తోందన్న విషయం సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి వెళ్లింది. ఈ నేపథ్యంలో ఆయన వెంట నే స్పందించారు. పేదల సొంతింటి కలను నెర వేర్చడమే ఇందిరమ్మ ప్రభుత్వ లక్ష్యమన్నారు.

# నాచుతో అందంగా !



అందంగా కనిపించాలని ఎవరికి ఉండదు. అందుకోసం చాలా ఉత్పత్తులే వాడతా కదా! అయితే, చర్మ సంరక్షణకు వాడే ఔషధాల జాబితాలోకి ఈసారి ఆల్గే చేరడమే కాదు, ట్రెండ్‌గానూ మారింది. ఇంతకీ ఇది మేలు చేసేనా?

నాచు అంటే వర్షాకాలంలో ఇంటి చుట్టు పక్కల చేరేది అనుకునేరు! దీన్ని ప్రత్యేకంగా సముద్రాలు, నదుల నుంచి సేకరిస్తారు. ఇది కొన్ని దేశాల్లో ఆహారం కూడా. దీనిలోని పాలీశాకరైడ్లు చర్మంలో తేమను బంధించి ఉంచుతాయి. ఇన్‌ఫ్లమేషన్‌నీ దరిచేరనీయవు. వాతావరనంలో మార్పులు, కలుష్యం కారణంగా ఏర్పడే హాని నుంచి రక్షిస్తాయి. అందుకే బ్యూటీ ఉత్పత్తుల్లో నాచుకి చోటిస్తున్నారు. దీనిలోని అమైనో యాసిడ్లు, పాలీశాకరైడ్లు, పాలీఫినాల్స్ ఆక్సిడేటివ్ స్ట్రెస్‌ని తగ్గిస్తాయి. తద్వారా వృద్ధాప్యఛాయల్ని త్వరగా దరి చేరనీయవు. ఎన్నో పరిశోధనలూ దీన్ని రుజువు చేస్తున్నాయి. వీగన్.. ఇప్పుడు చాలామంది బ్యూటీ ఉత్పత్తుల్లో చూస్తున్నది ఇదే! ఆల్గేని వృక్షజాతుల కిందే లెక్కేస్తారు కాబట్టి, ధైర్యంగా వాడొచ్చంటారు నిపుణులు. సీరమ్, మాయిశ్చరైజర్లలో దేన్నైనా నాచుతో తయారు చేస్తే ప్రయత్నించమంటున్నారు. వారానికోసారి దీంతో తయారు చేసిన మాస్క్‌ని వేసుకున్నా ప్రయోజనమేనట. నిజానికి మన వాడే చాలారకాల యాంటీ పిగ్మెంటేషన్, యాంటీ యాక్నే ఉత్పత్తుల్లో చాలావరకూ ఆల్గే ప్యాక్‌ల పేరుతో ఆన్‌లైన్ వేదికల్లో ట్రెండ్ అవుతున్నాయి. నాచులోని విటమిన్లు, మినరల్స్ చర్మానికి మేలు చేస్తాయన్నది వాస్తవమే. టాక్సిన్లు, మలినాలను తొలగించి చర్మకణాల పునుద్ధరణకూ తోడ్పడతాయి. అయితే కొందరిలో ఇవి దురద, దద్దుర్లకు దారితీస్తాయి. కాబట్టి, వాడే ముందు ప్యాచ్ టెస్ట్ తప్పనిసరి అంటున్నారు నిపుణులు. అదదండీ సంగతి. మీరూ ప్రయత్నిస్తారా ఈ ఆల్గే ట్రెండ్?

# వంటకు ఏ నూనె మేలు..

ఆరోగ్యంగా ఉండాలని మార్కెట్‌లోకి వచ్చిన అన్ని రకాల నూనెలను వాడేస్తుంటారు. కాని ఏది మేలు చేస్తుంది అనేది తెలియదు. మరి ఏది మంచిదో తెలుసుకుందామా..

**వేరు శెనగ..** దీంట్లో విటమిన్ ఇ, మోనో శాచురేటెడ్, ఒమేగా 6 యాసిడ్లు ఎక్కువగా ఉంటాయి. కంటిచూపునూ రక్త సరఫరాను మెరుగుపరుస్తుంది.

**నువ్వుల నూనె..** ఇతర వాటితో పోలిస్తే ఇది ఆహారం సులువుగా జీర్ణం కావడానికి సాయపడుతుంది. ఇందులో ఫ్యాటీయాసిడ్లు ఎక్కువ. దీనిలోని యాటీ ఇన్‌ఫ్లమేటరీ లక్షణాలు కీళ్లు, వంటి నొప్పులను తగ్గిస్తాయి.



**సన్ ఫ్లవర్ నూనె ..** దీనిలో శాచురేటెడ్ ఫ్యాటీయాసిడ్లు తక్కువ. మోనోశాచ్యురేటెడ్, పాలీ అన్ శాచురేటెడ్ కొవ్వులు చాలా ఎక్కువ. కాబట్టి ఇది గుండె ఆరోగ్యానికి మేలు చేస్తుంది. దీంట్లో ఉండే యాసిడ్లు రక్తంలో కొవ్వు తగ్గేందుకు తోడ్పడతాయి.

**ఆవ నూనె..** ఆరోగ్యకరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. దీంట్లో ఒమేగా 3 ఫ్యాటీయాసిడ్లు ఉంటాయి. కాలేయం చుట్టూ కొవ్వు ఏర్పడకుండా చేస్తుంది. ఇది చర్మాన్ని కాంతిమంతంగా మారుస్తుంది.

# ఏది ముద్దు వద్దు

‘ఈ అమ్మాయిలు షాపింగ్ చేస్తూ రోజంతా గడిపేయగలరు’ గంటలకొద్దీ నడిచినా నీరసమే రాఏమిటో ... మన గురించి ఇలాంటివి చాలాసార్లే వింటాం కదూ! అయినా పట్టించుకుంటామా ఏంటి? స్నేహితులు, కజిన్స్ ఎవరు పిలిచినా సరేననేస్తాం. నిజానికి ఇది అమ్మాయిలకు ఒత్తిడి పోగొట్టుకునే మార్గం.అయితే ఇప్పుడు చాలామంది తీరు మారింది. మనసు బాగాలేకపోతే ఆన్‌లైన్‌లో వెదికేస్తున్నారు. అదే ఆనందం తిరగాల్సిన పని లేకుండా దొరుకుతు న్నప్పుడు తప్పేముంది? పైగా చాలా సమయమూ కలిసొస్తుంది. అనేస్తున్నారు. నిజానికి అది మంచి తీరేనా? మామూలు షాపింగ్ అయితే



ప్రయాణం,ట్రాఫిక్ ఇబ్బందులు, ట్రయల్ రూమ్ వద్ద వేచి ఉండటం... ఇలాంటి తిప్పలెన్నో! ఆన్‌లైన్‌లో కొంటే షాపింగ్ తేలిగ్గా పూర్తవుతుంది. ఆనందాన్నిచ్చే డోపమైన్ అదే స్థాయిలో విడుదలవుతుంది. అలాంటప్పుడు ఇదే మేలు అనుకుంటున్నాం కానీ...శరీరాన్ని బద్ధకంగా తయారు చేస్తున్నాం. ముఖ్యంగా షాప్‌ని కనుక్కోవడం, అమ్మేవారితో మాట్లాడటం సహా ఎన్నో సోషల్ స్కిల్స్‌ని మర్చిపోతున్నాం. ఎంత లావుగా ఉందో చూడు... తన రంగుకి ఈ దుస్తులు నప్పలేదు... ఎంత చీప్‌వి ఎంచుకుంటోందో.. పక్కనుంచి ఇలాంటి గుసగుసలు వినిపిస్తోంటే ఎంత ఇబ్బంది? ఆత్మ విశ్వాసం కోల్పోతాం. మన గురించి ఎవరేమనుకుంటున్నారో అన్న ఆందోళన అన్నీ వెరసి కూడా చాలామంది ఆన్‌లైన్‌లో బాట పడుతున్నారు. కానీ ఇది తప్పించుకోవడమే. వాటిని ఎదుర్కొంటేనే బయటపడటం సాధ్యం. నేరుగా కొనేటప్పుడు చూడండి ప్రతిదీ పట్టుకుని చూస్తాం. ఒంటి మీద పెట్టుకుని ప్రయత్నించాం. తోడుగా ఉన్నవాళ్ల సలహాలూ కొత్త పరిజ్ఞానాన్ని ఇస్తాయి. పైగా ఎంత పెడుతున్నామన్న స్పృహ ఉంటుంది. ముఖ్యంగా ఖర్చు అంచనా వేసుకుని బేరాలాడతాం. దీంతో ఖర్చు అదుపులో ఉంటుంది. అదే ఆన్‌లైన్‌లో అయితే చకచకా కార్ట్‌లోకి కొట్టడమే... చేతిలో బరువుండదు కదా మోయడానికి డిస్కౌంట్, రంగు నచ్చాయంటూ కొనేస్తాం. తీరా అకౌంట్ ఖాళీ అయ్యాక అనవసరంగా కొన్నానే అని బాధపడతాం. అదీ ఇబ్బందే! ఆనెలైన్ కొనుగోళ్లు కనిపిస్తున్నాయి. ఎక్కువ శ్రమ అవసరం ఉండదు. కానీ దీనిమీద అతిగా ఆధార పడొద్దు. ఇది ప్రపంచానికీ, మానవ సంబంధాలకీ దూరం చేస్తుంది. తప్పనిసరి అయితే తప్ప బయట అడుగుపెట్టడానికే మొగ్గ చూపండి. పోలికలు, కామెంట్లకు భయపడి ఇంట్లో ఉండటమూ మానసిక సమస్యలకు చిహ్నలే. వాటి బారిన పడొద్దన్నా కొను విషయంలో బ్యాలెన్సింగ్ కావాల్సిందే. ఈసారి నుంచి గమనించుకుంటారా మరి?

# పార్వతీదేవి శాపం

పార్వతీదేవి వివాహం చేసుకున్న తర్వాత శంకరుడు నూరు దివ్య సంవత్సరాలు దాంపత్య సుఖం అనుభవించాడు. అయినా వారికి సంతానం కలగలేదు. ఒకరోజు బ్రహ్మాది దేవతలు శివుని సమీపించి మీ తేజ ప్రభావంతో కలిగే పుత్రుణ్ణి లోకాలు భరించలేవు. అందువల్ల సంతాన యోచన విరమించి మీరిద్దరూ తపస్సు చేస్తేనే ముల్లోకాలు క్షేమంగా ఉంటాయి. ఆ తేజస్సును మీలోనే నిలిపి లోకాలను కాపాడండి అని ప్రార్థించారు. మహేశ్వరుడు ఇకపై నిలువరిస్తాం సరే.. కానీ ఇప్పటికే స్వస్థానం నుంచి కదలిన తేజస్సును ఎవరు భరిస్తారు? అనడిగాడు. భూదేవి మాత్రమే భరించగలదన్నారు దేవతలు. పరమేశ్వరుడి తేజస్సు పర్వతాలు. వనులతో నిండిన భూమి మీద వ్యాపించింది. అగ్ని, వాయు దేవుళ్లను కూడా శివ తేజస్సును భరించమని దేవతలు ఆజ్ఞాపించారు. దాంతో అగ్నితో కూడిన శివ తేజస్సు శ్వేత పర్వతమైంది. అక్కడ అగ్ని, సూర్యుల తేజస్సుతో సమానమైన తేజస్సు గల రెల్లు గడ్డి ఏర్పడింది. అక్కడే కుమారస్వామి జన్మించాడు. కృత్తికలు పాలిచ్చి పెంచడం వల్ల కార్తికేయుడిగా, అగ్ని ధరించడం వల్ల అగ్ని సంభవుడుగా ప్రసిద్ది చెందాడు శివనందనుడు. ఈ విషయం తెలుసుకున్న పార్వతీ దేవి దేవతల మీద కోపించింది. నా భర్తతో పుత్రుని పొందా లన్న కోరిక తీరనివ్వలేదు. కనుక మీకు భార్యలతో సంతానం కలగదు. వాళ్ల సంతానవతులు కాలేరు అంటూ ఆగ్రహం తో శపించింది. భూదేవి నుద్దేశించి నువ్వు చౌడునేల లాంటి రూపాలు పొందుతావు. ఎందరో రాజులకు భార్యవై, వాళ్ల పాలనలో ఉంటావు. నీక్కూడా సంతాన సుఖం ఉండదు అని శపించింది. అది మొదలు దేవతలు, భూదేవి సంతానభాగ్యం కోల్పోయారు.

# ఓట్స్ వడలు



**ఓట్స్‌తో చేసే మసాలా వడలు పిల్లలు చాలా ఇష్టపడతారు. నేను చేస్తే మెత్తగా వచ్చాయి. కరకలాడుతూ మరింత రుచిగా ఉండేందుకు కొన్ని చిట్కాలు తెలుసుకుందాం.**

మన తెలుగు వారి ఇళ్లల్లో తరచూ చేసే మసాలా వడల్లా ఉత్తరాదివాళ్లు ఓట్స్ మసాలా వడ చేస్తారు. ఇవి తక్కువ నూనె పీలుస్తాయి. కనుక ఆరోగ్యానికి మంచిది. శనగపప్పును ఎక్కువగా నానబెట్టకూడదు. రెండు గంటలు నానితే 80% నాని, మిగిలింది పలుకుగా ఉంటుంది. అలా ఉంటేనే వడలు కరకరలాడ తాయి. పప్పును బరకగా రుబ్బి.. అందులో ఓట్స్, ఉల్లిపాయ ముక్కలు, పచ్చిమిర్చి తరుగు, కారం, తగినంత ఉప్పు వేసి బాగా కలపాలి. ఎక్కువ నీళ్ల పోయకుండా.. అవసరం మేరకు చెంచాతో కొద్ది కొద్దిగా పోస్తూ..పిండిని గట్టిగా కలపాలి. వడలు సరిగా రాకుండా.. పొడిపొడిగా అయిపోతుంటే ఇంకొన్ని నీళ్ల పోయండి. ముందు హైఫ్లేమ్ మీద నూనెను కాగనివ్వాలి. సలసలా కాగిన తర్వాత.. వడలు వేసి మంటను కాస్త తగ్గించి..ఎర్రగా వేయించాలి. ఇలా చేసేనత బయట కరకరలాడుతూఏ లోపల చక్కగా ఉడికి.. ఎంతో రుచిగా ఉంటాయి.

# ఆధునికతకు దూరంగా..



సాధారణ కాన్పు లేదా సిజేరియన్... ఏ విధానం ద్వారా జన్మనిచ్చిన బిడ్డపై అమ్మ ప్రేమ మారదు. కానీ... మారిన జీవనశైలి, రకరకాల అనారోగ్య సమస్యల కారణంగా ఇప్పుడు కో కాన్పులు ఎక్కువయ్యాయి. అయితే, ఈ ఆధునిక ప్రసూతి సాంకేతికత విషయంలో జాగ్రత్తగా ఉండాలని చెబుతున్నాయి మిషిగన్ స్టేట్ యూనివర్సిటీ తాజా అధ్యయనాలు, సహజకాను శిశువు, తల్లి గర్భాశయ ముఖద్వారం నుండి బయటకు రావటం వల్ల ఈ మైక్రోబ్స్‌కి ఎక్స్ అవుతుంది. కానీ, ఈ ఆధునిక విధానాల్లో యాంటీబయాటిక్స్ ఉపయోగించటం, సీ సెక్షన్ ప్రసవాలు చేయడం వల్ల తల్లులు, నవజాత శిశువుల్లో మైక్రోబయోమ్ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారుతుందని శాస్త్రవేత్తలు అంటున్నారు. ఈ మైక్రోబ్స్ లేదా మైక్రో ఆర్గానిజమ్స్ శిశువుల ఎదుగుదలనూ ప్రభావితం చేయగలవట. ప్రత్యేకించి ఒత్తిడి, సామాజిక ప్రవర్తనతోపాటు ముఖ్యమైన శరీర విధులను నియంత్రించే మెదడు ప్రాంత ఎదుగుదలపై సానుకూల ప్రభావం చూపిస్తాయట. నిజానికి ఈ సూక్ష్మజీవులు శిశువు పుట్టి తర్వాత నుంచే కాదు, గర్భంలో ఉన్నప్పటినుంచే మెదడు ఎదుగుదలపై ప్రభావం చూపిస్తాయట. కాబట్టి, శిశువు ఆరోగ్యకర ఎదుగుదలకు ఇవి కీలకమనీ, సాధ్యమైనంత మేర ఆధునిక ప్రసవ పద్ధతులకు దూరంగా ఉండాలనీ చెబుతున్నారు.

తెర

# ఆడియెన్స్‌ను సర్‌ప్రైజ్ చేసే ‘ సీక్రెట్ సోల్జర్ ’

అక్కి విశ్వనాథ్‌రెడ్డి



సీక్రెట్ సోల్జర్ కంటెంట్‌పై చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాము. కచ్చితంగా సినిమా ఆడియన్స్‌ను సర్‌ప్రైజ్ చేస్తుంది: డైరెక్టర్ అక్కి విశ్వనాథ్ రెడ్డి

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన యూనిక్ స్పై డ్రామా ‘సీక్రెట్ సోల్జర్’. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘుబాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. టీజర్, ట్రైలర్ సినిమాపై అంచనాలను మరింత పెంచాయి. ఈ చిత్రం సెప్టెంబర్ 18న ప్రేక్షకుల ముందుకు రానుంది.

చైనా పీస్.. ‘సీక్రెట్ సోల్జర్’ గా ఎలా మారింది? సినిమాలో ఒక క్యారెక్టర్‌ని ఉద్దేశించి ఆ టైటిల్ పెట్టాను. కాకపోతే అది కాస్త పొలిటికల్ అయింది. చైనాగల్వాన్ యుద్ధం రావడంతో మరింత పొలిటికల్ అయింది. ఇందులో ఎవరినీ తప్పుపట్టడానికి లేదు. అప్పుడు కాస్త ఉద్రిక్త పరిస్థితులు ఉండేవి. నేను చైనాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గా పనిచేశాను.

సెన్సార్ విషయంలో ఎలాంటి అనుభవం ఎదురైంది? సినిమా సబ్జెక్ట్ మీద చాలా కాన్ఫిడెంట్‌గా ఉన్నాము. అది కూడా సెన్సార్ వల్లే మాకు ఆ కాన్ఫిడెన్స్ వచ్చింది. చాలా డీటెయిల్‌గా ఈ సినిమాని సెన్సార్ చేశారు. ఈ ప్రయాణంలో మానసికంగా చాలా ఒత్తిడి ఉండేది. ఈ సినిమాలో చూపించిన చాలా ఎలిమెంట్స్ చాలా బిలీవబుల్‌గా ఉన్నాయని, అవన్నీ ఎక్స్‌పర్ట్స్‌కి చూపించాలని వాళ్లు చెప్పారు. అంతా క్లియర్ అయిన తర్వాత సెన్సార్ క్లియరెన్స్ ఇచ్చారు.

‘సీక్రెట్ సోల్జర్’ కథ ఎక్కడ మొదలవుతుంది? ఈ కథ నెల్లూరు బ్యాక్‌డ్రాప్‌లో మొదలవుతుంది. నేను నెల్లూరులో చదివాను. అక్కడ రిలేటబుల్‌గా ఉండే క్యారెక్టర్స్‌ని డిజైన్ చేశాను. ఇప్పటివరకు నేను చూసిన ఆడియన్స్ చాలా అద్భుతంగా ఫీల్ అయ్యారు. ముఖ్యంగా సెకండ్ హాఫ్ చాలా థ్రిల్లింగ్‌గా అనిపించిందని చెప్పారు.

కథలో ప్రధానంగా ఏ అంశాలు ఉంటాయి? ఈ కథకి వెన్నెముక ఫ్రెండ్‌షిప్. దాని చుట్టూ ఉంటాయి.

# ‘ సిగ్మా’ మంచి ఫన్‌రైడ్

హీరో సందీప్ కిషన్

‘సిగ్మా : ప్రెస్ మీట్‌లో హీరో సందీప్ కిషన్ ‘సిగ్మా మంచి ఫన్ రైడ్‌లా ఉంటుంది. నాన్నగారు సినిమా కోసం ఎదురుచూస్తున్నారు: డైరెక్టర్ జేసన్ సంజయ్ సందీప్ కిషన్ క్రేజీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం సిగ్మా. దర్శకుడిగా జేసన్ సంజయ్ డెబ్యూ చేస్తున్న ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మక లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ, డిస్ట్రిబ్యూషన్ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ లిమిటెడ్ ఈ చిత్రాన్ని కోస్తాంధ్ర, తెలంగాణలో విడుదల చేయనుండగా, ఎన్వీఆర్ సినిమా సీడెడ్‌లో రిలీజ్ చేస్తోంది. సిగ్మా అక్టోబర్ 2న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది.



ప్రెస్ మీట్‌లో హీరో సందీప్ కిషన్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఈ సినిమాతో సంజయ్‌ని తెలుగు సినిమాలకి పరిచయం చేయడం చాలా ఆనందంగా ఉంది. తను చాలా మంచి కుర్రాడు. తన విషయంలో నాకు చాలా గర్వంగా ఉంటుంది

దర్శకుడు జేసన్ సంజయ్ మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. ఇది నా ఫస్ట్ సినిమా. అక్టోబర్ 2న ఈ సినిమా రిలీజ్ అవుతుంది. ఈ సినిమాలో చాలా ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్ ఉన్నాయి అడ్వెంచర్ ఉంటుంది. ఒక ట్రెజర్ హంట్ లాంటి సినిమా. 5అలాగే అందరూ ఎంజాయ్ చేసుకునేలా ఉంటుంది. కమర్షియల్ ఎలిమెంట్స్ అన్నీ ఉంటాయి. సినిమా ఫన్ రైడ్‌లాగా ఉంటుంది. ఫారియా అబ్దుల్లా మాట్లాడుతూ.. ‘సిగ్మాతో తమిళ్‌లో డెబ్యూ చేస్తున్నా. లైకా ప్రొడక్షన్స్‌కి థాంక్యూ. చాలా అద్భుతంగా ఈ సినిమాని చేశారు. పక్కా కమర్షియల్ సినిమా లాగా ఉంటుంది. అదే సమయంలో చాలా కొత్తగా ఉంటుంది.

# సెన్సార్ పూర్తిచేసుకున్న ‘ప్యారడైజ్ ’



ప్యారడైజ్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన న్యాచురల్ స్టార్, కయాదు లోహార్ బ్రాండ్ న్యూ పోస్టర్

న్యాచురల్ స్టార్ నాని పాన్ ఇండియా పీరియడ్ యాక్షన్ ఎంటర్‌టైనర్ ‘ది ప్యారడైజ్’. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో, ఎస్‌ఎల్‌వీ సినిమాస్ బ్యానర్‌పై సుధాకర్ చెరుకూరి ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించారు. ఇప్పటికే విడుదలైన సాంగ్స్, గ్లింప్స్, టీజర్ అద్భుతమైన రెస్పాన్స్‌తో సినిమాపై భారీ అంచనాలను పెంచాయి.

తాజాగా మేకర్స్ నాని, కయాదు లోహార్‌ను ఇంటెన్స్ రొమాంటిక్ అవతార్‌లో ప్రజెంట్ చేస్తూ సరికొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. పోస్టర్‌లో నాని రఫ్ అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తుండగా, కయదు లోహార్ కూడా ఇంటెన్స్ అవతార్‌లో కనిపించారు. ఇద్దరూ ఎదురెదురుగా నిలబడి.. సిగరెట్స్ ను లైటర్‌తో వెలిగించుకుంటున్న విజువల్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటోంది. చుట్టూ ఉన్న డార్క్, ఇంటెన్స్ వాతావరణం మధ్య ఈ సన్నివేశం వారి మధ్య ఉన్న బాండింగ్‌ను డిఫరెంట్‌గా ప్రజెంట్ చేస్తోంది. ఈ పోస్టర్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఇందులో హీరో, హీరోయిన్ మధ్య వచ్చే సన్నివేశాలు హైలైట్‌గా ఉండబోతున్నాయి. జడల్ సుబ్బు..ప్రేమ ఇంతకుముందెన్నడూ చూడనంత ప్రత్యేకంగా ఉండబోతుంది.

‘ది ప్యారడైజ్’ సెన్సార్ ఫార్మాలిటీస్ అన్నీ పూర్తి చేసుకుంది.

రేపటి నుంచి మిగతా భాషల్లో ప్రమోషన్స్‌ను స్టార్ట్ చేస్తున్నారు. రేపు హీరో నాని చెన్నై వెళ్తున్నారు. ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ‘ది ప్యారడైజ్’ సెప్టెంబర్ 24న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలోకి రానుంది.

# ‘ లీస్ట్ ఎలిజబుల్ బ్యాచిలర్’ టీజర్ రిలీజ్



‘లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్’ హైలీ ఎంటర్టైనింగ్ టీజర్ రిలీజ్

హర్ష చెముడు ప్రధాన పాత్రలో నటించిన చిత్రం ‘లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్’. బాబు డెగాల దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని చవాన్, శ్రీధర్ చెని, దీపక్ ముస్త్యాల నిర్మించారు. రాజ్ సుహాస్, ప్రమదేశ్వి వి క్రియేటివ్ ప్రొడ్యూసర్లుగా వ్యవహరించారు. సెప్టెంబర్ 30 నుంచి ప్రముఖ తెలుగు ఓటీటీ వేదిక జూలైలో లీస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్ స్ట్రీమింగ్ కానుంది.

తాజాగా మేకర్స్ టీజర్ రిలీజ్ చేశారు. హర్ష ఫాదర్ ఎవరినైనా ప్రేమించమని చెప్పే సన్నివేశంతో మొదలైన టీజర్ ఆద్యంతం ఆకట్టుకుంది. టీజర్‌లో ఫన్ అలరించింది. హర్ష టైమింగ్ అదిరిపోయింది. హైపర్ ఆది పంచులు మరో హైలైట్‌గా నిలిచాయి.జీవన్ కుమార్, ఐశ్వర్య హోలక్కల్, శ్రావ్య చౌదరి ఇతర కీలక పాత్రల్లో ఆకట్టుకున్నారు. అజయ్ అరసాడ సంగీతం ఫన్‌ను మరింత ఎలివేట్ చేసింది. చిత్రానికి శక్తి అరవింద్ సినిమాటోగ్రఫీ అందించారు. జానీ షేక్ ప్రొడక్షన్ డిజైనర్‌గా, లిఖిత్ లీ ఎడిటర్‌గా, సాయి ప్రావలిక కాస్ట్యూమ్ డిజైనర్‌గా, పీవీజీ విశ్వనాథ్ లైన్ ప్రొడ్యూసర్‌గా పనిచేశారు.

# స్పై యాక్షన్ థ్రిల్లర్ ‘ జి-2’ వరల్డ్‌వైడ్ గ్రాండ్ రిలీజ్

జి -2

పాన్ ఇండియా స్పై యాక్షన్ థ్రిల్లర్ జి2 వరల్డ్ వైడ్ గ్రాండ్ రిలీజ్



బ్లాక్ బస్టర్ స్పై థ్రిల్లర్ గూఢచారికి సిక్వెల్‌గా తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ 2 రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేశారు. 2027 ఫిబ్రవరి 5న వరల్డ్ వైడ్ థియేటర్లలో రిలీజ్ కానుంది.

వినయ్ కుమార్ సిరిగినీడి దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రం, ఫస్ట్ పార్ట్ గూఢచారి సక్సెస్‌ను బేస్‌గా తీసుకుని అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తున్నారు ఇండియన్ సినిమాలో స్పై థ్రిల్లర్ జానర్ ని రీడిఫైన్ చేయనుంది. ఈసారి ఏజెంట్ 116గా వామికా గబ్బి ఎంట్రీ ఇస్తోంది. యాక్షన్‌తో పాటు ఎమోషన్ వున్న క్యారెక్టర్ ఇది. ఈ మూవీలో ఇమ్రాన్ హాష్మీ పవర్ ఫుల్ పాత్ర పోషిస్తున్నారు. మురళీ శర్మ, సుప్రియా యార్లగడ్డ, మధు శాలిని కీలక పాత్రల్లో నటిస్తున్నారు.

పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ అగర్వాల్ ఆర్ట్స్, ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై టి.జి. విశ్వ ప్రసాద్, అభిషేక్ అగర్వాల్ ఈ సినిమాని భారీగా నిర్మిస్తున్నారు. తెలుగు తో పాటు హిందీ, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో పాన్ ఇండియాగా రిలీజ్ కానుంది.

# ‘ మాయలేడి’ మూవీ టీజర్ రిలీజ్



మాయలేడి

మాయలేడి మూవీ ఇంట్రెస్టింగ్ టీజర్ రిలీజ్

యంగ్ టాలెంటెడ్ హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా ఖిఖిమాయలేడిఖిఖి. ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు. ఇప్పుడు ఖిఖిమాయలేడిఖిఖితో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్ గా నటిస్తోంది. అక్టోబర్ లో ఖిఖిమాయలేడిఖిఖి సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది.

ఈ రోజు మేకర్స్ ఖిఖిమాయలేడిఖిఖి సినిమా టీజర్ రిలీజ్ చేశారు. ఈ టీజర్ ఎలా ఉందో చూస్తే ప్రేమ, పెళ్లి విషయంలో కొన్ని స్పష్టమైన అభిప్రాయాలు ఉన్న అబ్బాయి క్రిష్. ఇంట్లో వాళ్లు పెళ్లి గురించి అడిగితే తనకు కరెక్ట్ అమ్మాయి దొరికేంత వరకు వెయిట్ చేస్తానంటాడు, ఆమెను చూసి కుటుంబ సభ్యులు భయపడినా క్రిష్ ఆశాను లవ్ చేస్తాడు. తప్పు జరిగితే ఆగ్రహంతో ఊగిపోయే ఆశాకు క్రిష్ కు గతంలో రూపా అనే గర్ల్ ఫ్రెండ్ ఉందని తెలుస్తుంది. రూపా గురించి తెలుసుకున్న ఆశా ఏం చేసింది? ఎక్స్ గర్ల్ ఫ్రెండ్ విషయంలో క్రిష్ తో ఆమె ఎలా డీల్ చేసింది.

ఇటీవల రిలీజ్ చేసిన ఖిఖిమాయలేడిఖిఖి సినిమా గ్లింప్స్, టైటిల్ సాంగ్, ఖిసరిగమలే గుండె అంచుల్లో..ఖి పాటలకు హ్యూజ్ రెస్పాన్స్ దక్కింది. ఒక ఇంట్రెస్టింగ్ బ్యాక్ డ్రాప్ తో సాగే లవ్ స్టోరీని థియేటర్స్ లో చూడబోతున్న ఫీల్ ను ప్రేక్షకుల్లో తాజాగా రిలీజ్ చేసిన టీజర్ క్రియేట్ చేస్తోంది

ఆట

### మహిళల వాలీబాల్‌లో ఫిలిప్పీన్స్‌పై

# చైనా విజయం



**నగోయా (జపాన్):** 2026 ఆసియా క్రీడల మహిళల వాలీబాల్ టోర్నమెంట్‌లోని గ్రూప్ బి లో చైనా తన ప్రత్యర్థి ఫిలిప్పీన్స్‌ను 3-0 తేడాతో ఓడించి తమ తొలి విజయాన్ని నమోదు చేసింది. టాంగ్ జిన్ మ్యాచ్‌లో అత్యధికంగా 19 పాయింట్లు సాధించగా, జువాంగ్ యుషాన్ 17, వాంగ్ ఆవోకియాన్ 13 పాయింట్లు సాధించారు. దీంతో 72 నిమిషాల్లో జరిగిన పోరులో చైనా 25-18, 25-22, 25-8 తేడాతో విజయం సాధించింది. ఫిలిప్పీన్స్ మొదటి రెండు సెట్లలో గట్టి పోటీ ఇచ్చింది, కానీ చైనా, తమ బ్లాకింగ్, డిఫెన్స్‌ను మెరుగుపరుచుకుని మూడవ సెట్‌లో ఆధిపత్యం చెలాయించింది. గ్రూప్ ఎ మ్యాచ్‌లో ఆతిథ్య జపాన్ నేపాల్‌ను 3-0 తేడాతో ఓడించింది. గ్రూప్ సి లో కొత్తగా ఆసియా ఛాంపియన్‌గా నిలిచిన థాయ్‌లాండ్ మంగోలియాను 3-0 తేడాతో చిత్తుగా ఓడించగా, చైనీస్ తైపీ కిర్గిజ్‌స్థాన్‌ను 3-0 తేడాతో ఓడించింది. గ్రూప్ డి లో దక్షిణ కొరియా హాంకాంగ్, చైనాలను 3-0 తేడాతో ఓడించగా, వియత్నాం ఖతార్‌ను 3-0 తేడాతో ఓడించింది. గత నెల జరిగిన ఆసియా ఛాంపియన్‌షిప్ ఫైనల్‌లో థాయ్‌లాండ్ చేతిలో 3-2 తేడాతో ఓడిపోవడం, ఆ ఫలితం కారణంగా 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు నేరుగా అర్హత సాధించలేకపోవడంతో, పుంజుకోవాలనే లక్ష్యంతో చైనా ఆసియా క్రీడలలో అడుగుపెట్టింది. గ్రూప్ బిలో భాగంగా శుక్రవారం జరిగే రెండో మ్యాచ్‌లో చైనా తదుపరి కజకిస్తాన్‌తో తలపడనుంది.

### చెస్ ఒలింపియాడ్‌లో

# అర్జున్ ఓటమి

### భారత్ జట్టు 3-1 గెలుపు



**ఉజ్బెకిస్థాన్:** సమర్‌ఖండ్‌లో జరుగుతున్న 46వ చెస్ ఒలింపియాడ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ భారత్ విజయవంతంగా ప్రారంభించింది. కానీ థాయ్‌లాండ్‌పై 3-1 తేడాతో సాధించిన ఈ విజయంలో, ప్రధాన బోర్డులో అర్జున్ ఎరిగైసి అనూహ్యంగా ఓటమి పాలయ్యాడు. స్విస్ లీగ్ ఈవెంట్‌లో చాలా అగ్రశ్రేణి జట్లు, రేటింగ్ ఫేవరెట్లు బలహీన జట్లపై 4-0 తేడాతో విజయాలు సాధించినప్పటికీ, బోట్స్వానా జట్టు కూడా చెప్పుకోదగ్గ ప్రదర్శన చేసింది. వెనుకబడి మ్యాచ్ ప్రారంభించినప్పటికీ, బోట్స్వానా అద్భుతమైన ఆట ఆడి బలమైన బ్రెజిల్ జట్టును 2-2తో నిలువరించింది. అయితే, ఓపెన్ విభాగంలో 2024 విజేతకు 3-1 విజయాన్ని అందించడానికి ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్, నిహాల్ సరిన్, విదిత్ గుజరాతీ తమ తమ గేమ్‌లలో గెలిచినప్పటికీ, థాయ్‌లాండ్‌కు చెందిన ప్రిన్ లావవిరపాప్ చేతిలో ఎరిగైసి ఓడిపోవడం అతిపెద్ద సంచలనమైంది. ఆటలో చాలా వరకు ఎరిగైసి మెరుగైన స్థితిలో ఉన్నప్పటికీ, చివరిలో జరిగిన ఒక వ్యూహాత్మక తప్పిదం వల్ల లావవిరపాప్ పరిస్థితిని తమకు అనుకూలంగా మార్చుకుని, ఒక చిరస్మరణీయ విజయాన్ని దక్కించుకుంది. సమయం తక్కువగా ఉండటంతో అర్జున్ అత్యంత క్లిష్టమైన పరిస్థితిని ఎదుర్కోవడంలో చేసిన పొరపాటుతో 54 ఎత్తుల వరకు రక్షించుకోవడానికి ప్రయత్నించి చివరికి ఓటమిని అంగీకరించాడు. ఇక మహిళల విభాగంలో, డిఫెండింగ్ ఛాంపియన్ అయిన భారత్, డొమినికన్ రిపబ్లిక్‌ను 4-0 తేడాతో ఓడించింది. కోనేరు హంపి, వైశాలి రమేష్‌బాబు, వందిక అగర్వాల్, సవితశ్రీ తమతమ గేమ్‌లలో విజయం సాధించారు.

# వర్షంతో చైనా మ్యాచ్ రద్దు

### మహిళల సెమీస్‌కు బంగ్లాదేశ్.. 20న భారత్, జపాన్ ఢీ

**నిస్షిన్ (జపాన్):** వర్షం కారణంగా చైనా, బంగ్లాదేశ్ మధ్య గురువారం జరగాల్సిన మహిళల మ్యాచ్ రద్దుయింది. తడి అవుట్‌ఫీల్డ్ కారణంగా చైనాతో జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ ఒక్క బంతి కూడా వేయకుండానే రద్దు కావడంతో, ఆసియా క్రీడల మహిళల క్రికెట్ పోటీలలో బంగ్లాదేశ్ సెమీఫైనల్‌లో స్థానం దక్కించుకుంది. మ్యాచ్ కొనసాగించడానికి పరిస్థితులు అనుకూలంగా లేవని నిర్ణయించడంతో నిబంధనల మేరకు తమకున్న ఉన్నత సీడింగ్ కారణంగా బంగ్లాదేశ్ చివరి నాలుగు జట్లలోకి ప్రవేశించింది. నిగర్ సుల్తానా జోటీ నేతృత్వంలోని జట్టు ఐసీసీ మహిళల టీ20ఐ ర్యాంకింగ్స్‌లో 10వ స్థానంలో ఉండగా, చైనా 36వ స్థానంలో ఉంది. ఈ నెల 20న జరిగే సెమీఫైనల్‌లో, డిఫెండింగ్ ఛాంపియన్ భారత్, ఆతిథ్య జపాన్ మధ్య జరిగే క్వార్టర్ ఫైనల్ విజేతతో బంగ్లాదేశ్ తలపడుతుంది. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో మహిళల క్రికెట్‌లో స్వర్ణ పతకం గెలుచుకున్న భారత్, బంగ్లాదేశ్, పాకిస్తాన్, శ్రీలంకలతో పాటు నేరుగా నాకౌట్ దశలోకి ప్రవేశించింది. ఆతిథ్య దేశమైన జపాన్ కూడా





క్వార్టర్ ఫైనల్స్‌కు నేరుగా ప్రవేశం పొందింది. క్వాలిఫైయింగ్ టోర్నమెంట్ ద్వారా మలేషియా, థాయ్‌లాండ్ మరియు చైనా చివరి ఎనిమిది జట్లలో తమ స్థానాలను దక్కించుకున్నాయి. ఇతర క్వార్టర్ ఫైనల్స్‌లో శ్రీలంక మలేషియాతో తలపడగా, పాకిస్తాన్ థాయ్‌లాండ్‌తో తలపడుతుంది. ఈ రెండు మ్యాచ్‌లలో గెలిచిన జట్లు మరో సెమీఫైనల్‌లో తలపడతాయి. ప్రస్తుతం జరుగుతున్న మహిళల క్రికెట్ పోటీ టీ20 ఫార్మాట్‌లో జరుగుతోంది.

ఈ టోర్నమెంట్ సెప్టెంబర్ 17 నుండి 22 వరకు జరుగుతుండగా, పురుషుల పోటీ సెప్టెంబర్ 24 నుండి అక్టోబర్ 1 వరకు జరగనుంది. క్రికెట్ ఆసియా క్రీడలలో నాలుగవసారి పాల్గొంటోంది. ఇది గతంలో గ్వాంగ్‌జౌ 2010, ఇంచియాన్ 2014 మరియు హాంగ్‌జౌ 2023లలో చోటు దక్కించుకుంది. హాంగ్‌జౌలో జరిగిన క్రీడలలో భారత్ పురుషుల, మహిళల విభాగాలలో స్వర్ణ పతకాలు గెలుచుకుంది. 1900 సంవత్సరం తర్వాత క్రికెట్ తొలిసారిగా ఒలింపిక్స్‌లో అడుగుపెట్టనున్న లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్ క్రీడలకు సిద్ధమవుతున్న తరుణంలోనే ఆసియా క్రీడల పోటీలు కూడా జరుగుతున్నాయి.




# నేడు వన్డేకు వర్షం ముప్పు

### ఆస్ట్రేలియాతో భారత్ ఢీ

**రాజ్‌కోట్:** గుజరాత్‌లోని నిరంజన్ షా స్టేడియంలో శుక్రవారం భారత్ అండర్19, ఆస్ట్రేలియా మధ్య జరగనున్న తొలి యూత్ వన్డేకు భారీ వర్షం అంతరాయం కలిగించే అవకాశం ఉంది. ఒకవేళ ఆట సాధ్యమైతే, లక్ష్య రైచందానీ కెప్టెన్‌గా, యశ్‌బర్ధన్ సింగ్ చౌహాన్ డిప్యూటీగా భారత్ మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను ప్రారంభిస్తుంది. ఈ జట్టులో ఇటీవలి శ్రీలంక పర్యటన నుండి తిరిగి వచ్చిన ఆటగాళ్లు, అలాగే తొలిసారి అవకాశం పొందుతున్న వాళ్లు ఉన్నారు. ఈ సిరీస్‌కు నాయకత్వం వహించడానికి ముందు రైచందానీ శ్రీలంకలో వైస్ కెప్టెన్‌గా ఉన్నాడు. ఉత్తరాఖండ్‌కు చెందిన ఈ కుడిచేతి వాటం బ్యాట్స్‌మెన్ ఫస్ట్‌క్లాస్ క్రికెట్ కూడా ఆడాడు. శ్రీలంకలో భారత్‌కు కెప్టెన్‌గా వ్యవహరించిన చౌహాన్, ఇప్పుడు అతనికి డిప్యూటీగా బాధ్యతలు స్వీకరిస్తున్నాడు. రాహుల్ ద్రవిడ్ చిన్న కుమారుడైన అన్వే, శ్రీలంకలో ఇండియా అండర్19 తరపున అరంగేట్రం చేసి, మరో అవకాశం కోసం తిరిగి వస్తుండగా, భారత మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ కుమారుడైన ఆర్యవీర్, తొలిసారిగా ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడు. ఈ ఢిల్లీ బ్యాటర్ ఢిల్లీ ప్రీమియర్ లీగ్‌లో కూడా ఆడాడు. వీరితో పాటు, శ్రీలంక పర్యటన బృందంలోని సభ్యులైన కుశాగ్ర ఓఝా, ఎడమచేతి వాటం బ్యాట్స్‌మన్, అర్జున్ రాజ్‌పుత్ ఆల్‌రౌండర్‌గా తిరిగి జట్టులోకి వచ్చాడు. మరో ఎడమచేతి వాటం బ్యాటర్ మనల్ చౌహాన్. వి.కె. వినీత్, షవిన్ వినోద్ ఆల్‌రౌండర్లుగా, వి. యశ్‌వీర్, మోహిత్ ఉల్వా బౌలింగ్‌ను బలోపేతం చేస్తారు. రోహిత్ యాదవ్ స్థానంలో సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ ఆర్యన్ సవ్సాని జట్టులోకి తాజాగా చేరాడు.

### ఆసియా క్రీడల మహిళల క్రికెట్‌లో

# సెమీఫైనల్‌కు పాకిస్థాన్

### థాయిలాండ్ ఓటమి

**నిస్షిన్:** కొరోగి స్పోర్ట్స్ పార్క్‌లో వర్షం కారణంగా గురువారం కుదించబడిన క్వార్టర్ ఫైనల్‌లో థాయిలాండ్‌పై మూడు వికెట్ల తేడాతో విజయం సాధించిన పాకిస్థాన్ 2026 ఆసియా క్రీడల మహిళల క్రికెట్ సెమీఫైనల్స్‌లో స్థానం సంపాదించింది. మ్యాచ్‌ను ఇరు జట్లకు 11 ఓవర్లకు తగ్గించడంతో మొదట బ్యాటింగ్ చేసిన థాయిలాండ్ 91/4 స్కోరును నమోదు చేసింది. నన్నపత్ కొంచరోంకై (49) టాప్ స్కోరర్‌గా నిలవగా, పాకిస్థాన్ కెప్టెన్ ఫాతిమా సనా రెండు వికెట్లు తీసింది. గుల్ ఫిరోజా, షవాల్ జుల్ఫికార్ తొలి వికెట్‌కు 36 పరుగుల భాగస్వామ్యం





నెలకొల్పడంతో పాకిస్థాన్ ఛేజింగ్‌ను సానుకూలంగా ప్రారంభించింది. అయితే, ఈ భాగస్వామ్యం విచ్ఛిన్నమైన తర్వాత థాయ్‌లాండ్ పుంజుకుంది. వరుసగా వికెట్లు కోల్పోవడంతో పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరిగింది. తర్వాత ఫాతిమా (21) ఇన్నింగ్స్‌ను నిలబెట్టింది. పాకిస్థాన్‌కు ఇంకా 17 బంతుల్లో 19 పరుగులు అవసరమైన సమయంలో, ఆమె తొమ్మిదో ఓవర్ మొదటి బంతికే అవుటయ్యింది. ఫాతిమా అవుటైన తర్వాత థాయ్‌లాండ్‌కు ఒక అవకాశం లభించింది. కానీ టుబా హాసన్ ఒక ఫోర్, ఒక సిక్స్ కొట్టి మ్యాచ్ గమనాన్ని తిరిగి పాకిస్థాన్ వైపు మళ్లించింది. ఆమె (13) 10వ ఓవర్ చివరి బంతికి అవుటయ్యింది. పాకిస్థాన్‌కు చివరి ఓవర్‌లో 3 వికెట్ల తేడాతో నాలుగు పరుగులు అవసరమయ్యాయి. ఉమ్మెహాని తన సంయమనాన్ని కోల్పోకుండా నాలుగో బంతికి విజయపు పరుగులు సాధించి ఛేజింగ్‌ను పూర్తి చేసింది.

# గ్లోబల్ మార్కెట్లకు ఫెడ్ ఛైర్మన్‌షాక్

### 25 బేసిస్ పాయింట్లు ఫండ్‌రేట్ పెంపు



**వాషింగ్టన్, సెప్టెంబరు 17:** అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వ్ ఊహించని నిర్ణయంతో ప్రపంచ మార్కెట్లను ఒక్కసారిగా ఉలిక్కిపడేలా చేసింది. మూడేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తొలిసారిగా కీలక వడ్డీ రేట్లను 25 బేసిస్ పాయింట్లు పెంచుతున్నట్లు ప్రకటించింది. దీంతో బెంచ్ మార్క్ వడ్డీ రేట్లు 3.75 శాతం నుంచి 4 శాతానికి చేరాయి. గత కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన వడ్డీ రేట్లకు ఒక్కసారిగా బ్రేక్‌వేసి, మళ్లీ పెంచే దిశగా అడుగులు వేయడం ఆర్థిక వర్గాల్లో పెద్ద చర్చనీయాంశంగా మారింది. అమెరికాలో సగటు మనిషిని పిండేస్తున్న ద్రవ్యోల్బణం అదుపులోకి రాకపోవడమే ఈ నిర్ణయానికి ముఖ్య కారణం. ఫెడ్ లక్ష్యం ద్రవ్యోల్బణాన్ని 2శాతానికి పరిమితం చేయడమే అయినప్పటికీ, జులైలో 3.7 శాతంగా నమోదు కాగా, ఆగస్టులో మళ్లీ పెరిగి రికార్డు స్థాయికి చేరింది. దీనికి తోడు మిడిల్ ఈస్ట్‌లో జరుగుతున్న యుద్ధ మేఘాల కారణంగా ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 దాటిపోవడం పరిస్థితిని మరింత దారుణంగా మార్చింది. కేవలం సరఫరా వ్యవస్థలో లోపాల వల్లే ధరలు పెరుగుతున్నాయనే పాత భావనను పక్కనపెట్టి, ఆర్థిక వ్యవస్థలోనే అంతర్లీనంగా ధరల మంట ఉందనే విషయాన్ని ఫెడ్ గుర్తించింది. సాధారణంగా వడ్డీ రేట్లు పెంచితే ఆర్థిక వ్యవస్థ నెమ్మదిస్తుందనే భయం ఉంటుంది. కానీ, అమెరికా ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం చాటిచెబుతున్న స్థిరత్వమే ఫెడ్‌కు కొండంత ధైర్యాన్ని ఇచ్చింది. నిరుద్యోగిత రేటు కేవలం 4.1 శాతంగానే ఉండటంతో పాటు, రాబోయే సంవత్సరాల్లో జీడీపీ వృద్ధి రేటు 2.3 నుంచి 2.4 శాతంగా నమోదు కావచ్చని అంచనాలు వేస్తున్నారు. మార్కెట్ ఇంకా బలంగానేఉంది కాబట్టి, వడ్డీరేట్లు పెంచినా తట్టుకోగలదనే నమ్మకంతోనే పాలసీ మేకర్స్ ఈ కఠిన నిర్ణయానికి ఓటేశారు. మే నెల చివరిలో ఫెడరల్ రిజర్వ్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన కెవిన్ వార్ష్ హయాంలో తీసుకున్న తొలి వడ్డీ రేట్ల నిర్ణయం ఇదే కావడం విశేషం. అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వడ్డీ రేట్లు తగ్గించాలని బహిరంగంగానే కోరుతూ, ఆ భావాలున్న వర్ష్‌ను ఈ పదవిలో కూర్చోబెట్టినా అధ్యక్షుడి ఆశయాలకు భిన్నంగా వర్ష్ నేతృత్వంలోని ఫెడ్ బోర్డు ఏకగ్రీవంగా రేట్లను పెంచడానికే మొగ్గుచూపింది. ఆ మధ్య జరిగిన జాక్సన్ హోల్ సమావేశంలోనే వర్ష్ మాట్లాడూ ధరల మంట పూర్తిగా చల్లారే వరకు కఠిన నిర్ణయాల నుంచి వెనక్కి తగ్గేదే లేదని స్పష్టమైన సంకేతాలిచ్చారు.

# టాటాసన్స్ ఛైర్మన్‌గా చంద్రశేఖరన్

## మరో ఐదేళ్లు పదవీకాలం పొడిగింపు




**ముంబయి, సెప్టెంబరు 17:** టాటా గ్రూప్ భవిష్యత్ నాయకత్వంపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడే కీలక పరిణామం చోటుచేసుకుంది. టాటా సన్స్ ఛైర్మన్ ఎన్. చంద్రశేఖరన్‌కు మరో ఐదేళ్ల పదవీ కాలం ఇవ్వడంతో పాటు కంపెనీని స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేసేందుకు బోర్డు ఆమోదం తెలిపింది. అయితే ఈ రెండు ప్రతిపాదనలను టాటా ట్రస్ట్స్ ఛైర్మన్ నోయెల్ టాటా వ్యతిరేకించినట్లు సమాచారం. టాటా ట్రస్ట్స్ తరఫున బోర్డులో నోయెల్ టాటాకు వీటో హక్కు ఉంది. చంద్రశేఖరన్ కొనసాగింపుతో పాటు లిస్టింగ్ ప్రతిపాదనపై ఆయన అసమ్మతి వ్యక్తం చేసినట్లు సమాచారం. తన వీటో అధికారాన్ని ఉపయోగించి తీర్మానాలను అడ్డుకునేందుకు ప్రయత్నించినా, ఇతర బోర్డు సభ్యుల మద్దతుతో ప్రతిపాదనలు ఆమోదం పొందాయి. టాటా సన్స్ లిస్టింగ్ అంశం కొంతకాలంగా పెండింగ్‌లోఉంది. ఆర్‌బిఐ తాజాగా కంపెనీ లిస్టింగ్ ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని ఆదేశించింది. 2022లో టాటా సన్స్‌ను అప్పర్ లేయర్ ఎన్‌బిఎఫ్‌సిగా ఆర్‌బిఐ గుర్తించింది. దీంతో మూడేళ్లలోగా స్టాక్ మార్కెట్‌లో లిస్ట్ చేయాల్సిన నిబంధన ఏర్పడింది. చంద్రశేఖరన్ 2017 ఫిబ్రవరిలో టాటా సన్స్ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు.

2022లో ఆయనకు రెండోసారి ఐదేళ్ల పదవీకాలం లభించింది. అది 2027 ఫిబ్రవరి 20తో ముగియాల్సి ఉంది. అయితే మరోసారి బాధ్యతలు చేపట్టబోనని ఆయన ఈ యేడాది ఆగస్టులో బోర్డుకు తెలియజేశారు. టాటా గ్రూప్‌లో వ్యాపారాల పనితీరు, మూలధన కేటాయింపుపై నోయెల్ టాటా ఆందోళనలు వ్యక్తం చేసినట్లు సమాచారం. ముఖ్యంగా ఎయిరిండియా, టాటా డిజిటల్ అంశాలు చర్చకు వచ్చాయి. దీంతో చంద్రశేఖరన్ వారసుడి ఎంపికపై టాటా ట్రస్ట్స్ కసరత్తు ప్రారంభించింది. ఇప్పుడు బోర్డు నిర్ణయంతో ఆ వ్యవహారం మరో మలుపు తిరిగింది. ఆగస్టులో జరిగిన టాటా సన్స్ వార్షిక సర్వసభ్య సమావేశం కూడా అనూహ్యంగా వాయిదా పడింది. తగినంత కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేయాల్సి వచ్చింది.


టాటా సన్స్ చరిత్రలో ఇలాంటి ఘటన ఇదే తొలిసారి. సర్ రతన్ టాటా ట్రస్ట్‌కు సంబంధించిన పరిమితులు ఈ పరిణామానికి కారణమయ్యాయని సమాచారం. చంద్రశేఖరన్ పునర్నియామకానికి బోర్డు ఆమోదం లభించిన వెంటనే టాటా గ్రూప్‌కు చెందిన పలు షేర్లు మార్కెట్లో దూసుకెళ్లాయి. ఐదేళ్ల పాటు ఆయన ఛైర్మన్‌గా కొనసాగనున్నారన్న నిర్ణయాన్ని మార్కెట్ వర్గాలు కీలక పరిణామంగా పరిగణిస్తున్నాయి. ఓపక్క ఆర్బీఐతో వివాదాలు నడుస్తున్న తరుణంలో చంద్రశేఖరన్ పదవీకాలాన్ని మరో ఐదేళ్లు పొడిగించడంతో నోయెల్ టాటాకు షాక్ తగిలినట్లయింది. చంద్రశేఖరన్ పునర్నియామకానికి బోర్డు ఆమోదం లభించడం టాటా గ్రూప్ భవిష్యత్ నాయకత్వంపై చర్చను మరింత కీలకంగా మార్చింది.

# ఎన్‌ఎస్‌ఇ, హీరోమోటార్స్ ఐపిఒలకు భారీ స్పందన




**ముంబై, సెప్టెంబర్ 17:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా ఐపిఒకు తొలిరోజు ఇన్వెస్టర్ల నుంచి స్పందన లభించింది. గురువారం ఎన్‌ఎస్‌ఇ ఐపిఒలో మొత్తం 3,67,69,784 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఆఫర్‌లో ఉన్న 8,86,42,911 షేర్లతో పోలిస్తే 0.41 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. ఎన్‌ఎస్‌ఇ ఐపిఒ బిడ్డింగ్ గురువారం ప్రారంభమై, సెప్టెంబర్ 21న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణిని రూ.1,700-రూ.1,785గా నిర్ణయించారు. ఇన్వెస్టర్లు కనీసం 8 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు. జిందాల్ సుప్రీమ్ ఇండియా ఐపిఒకు ఇన్వెస్టర్ల నుంచి భారీ స్పందన లభించింది. తొలిరోజు 29,52,88,651 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఆఫర్‌లో ఉన్న 93,99,600 షేర్లకు ఇది 31.42 రెట్ల సబ్‌స్క్రిప్షన్. ఈ ఐపిఒ 18న బిడ్డింగ్ ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణి రూ.88-రూ.93గా ఉంది. కనీసం 161 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయాలి.హీరో మోటార్స్ ఐపిఒకు కూడా భారీ స్పందన వచ్చింది. 29,75,98,378 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. ఆఫర్‌లో ఉన్న 8,86,07,596 షేర్లతో పోలిస్తే 3.36 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.హీరో మోటార్స్ ఐపిఒ ఈనెల 18న ముగియనుంది. ఐపిఒ ధరల శ్రేణిని రూ.79-రూ.84గా నిర్ణయించారు. ఇన్వెస్టర్లు కనీసం 178 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.ఎస్‌ఎస్ రిటైల్ ఐపిఒకు 5.76 రెట్ల సబ్‌స్క్రిప్షన్ కూడా ఇన్వెస్టర్ల నుంచి మంచి స్పందన లభించింది. తొలిరోజు సాయంత్రానికి 5,06,85,075 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఆఫర్‌లో ఉన్న 87,93,884 షేర్లకుగాను 5.76 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.

ఈ ఐపిఒ 18న ముగియనుంది. ఒక్కో షేరు ధరల శ్రేణి రూ.403-రూ.424గా ఉంది. కనీసం 35 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.సోనాసెలెక్షన్ ఇండియా ఐపిఒకు 46,63,800 షేర్లకు బిడ్లు వచ్చాయి. ఆఫర్‌లో ఉన్న 1,00,10,000 షేర్లతో పోలిస్తే 0.47 రెట్ల సబ్‌స్క్రిప్షన్ నమోదైంది.ఈ ఐపిఒ బిడ్డింగ్ 21న ముగియనుంది. ఐపీఓ ధరల శ్రేణిని రూ.94-రూ.99గా నిర్ణయించారు. ఇన్వెస్టర్లు కనీసం 150 ఈక్విటీ షేర్లకు, ఆ తర్వాత వాటి గుణిజాల్లో బిడ్ చేయవచ్చు.




### చమురు ఉత్పత్తుల ఎగుమతులపై

## విండ్‌ఫాల్‌ట్యాక్స్ తగ్గింపు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 17:** పశ్చిమాసియా యుద్ధం కారణంగా క్రూడాయిల్ ధర క్రమంగా పెరుగుతున్న వేళ కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. పెట్రోల్, డీజిల్, ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎగుమతులపై విధించే విండ్‌ఫాల్ పన్నును కేంద్ర ప్రభుత్వం తగ్గించింది. కొత్త పన్ను రేట్లు ఇప్పటికే అమల్లోకి వచ్చాయి. ఈ రేట్లు తదుపరి పక్షం రోజుల పాటు కొనసాగనున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం ప్రతి రెండు వారాలకు ఒకసారి విండ్‌ఫాల్ పన్ను రేట్లను సమీక్షిస్తూ ఉంటుంది. ఆర్థిక మంత్రిత్వ నోటిఫికేషన్ ప్రకారం డీజిల్ ఎగుమతులపై గతంలో లీటరుకు రూ.25గా ఉన్న విండ్‌ఫాల్ పన్నును రూ.20కి తగ్గించారు. అంటే లీటరుకు రూ.5 మేర పన్ను తగ్గింది. అదే సమయంలో ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ఎగుమతులపై పన్నును లీటరుకు రూ.19 నుంచి రూ.15కు తగ్గించారు. ఎటిఎఫ్‌పై లీటరుకు రూ.4 మేర పన్ను తగ్గింది.

# ఫెడ్ నిర్ణయంతో ఇన్వెస్టర్లు అప్రమత్తం

### స్వల్పలాభాలకే పరిమితమైన సెన్సెక్స్, నిఫ్టీ



**ముంబై, సెప్టెంబర్ 17:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ తాజా వడ్డీ నిర్ణయం, ప్రపంచవ్యాప్తంగా లిక్విడిటీపై దాని ప్రభావాలను ఇన్వెస్టర్లు అంచనా వేస్తుండటంతో గురువారం దేశీయ స్టాక్ మార్కెట్లు స్వల్ప మార్పులతో ముగిసాయి. కీలక ఈక్విటీ సూచీలు పరిమిత లాభనష్టాలతో ముగిశాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ తన బెంచ్‌మార్క్ వడ్డీ రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి 3.754 శాతం పరిధికి చేర్చింది. 2023 తర్వాత ఫెడ్ వడ్డీ రేటును పెంచడం ఇదే తొలిసారి. ఈ యేడాది మరోసారి వడ్డీ రేటు పెంపు అవకాశం ఉందని ఫెడ్ అంచనాలు సూచించడంతో ఇన్వెస్టర్లలో అప్రమత్తత కొనసాగింది. 2026లో మరో వడ్డీ పెంపు ఉండొచ్చన్న ఫెడ్ సంకేతాలతో ముఖ్యంగా వడ్డీ రేట్ల ప్రభావానికి లోనయ్యే రంగాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడులపై ఆధారపడే విభాగాల్లో జాగ్రత్త ధోరణి కనిపించింది. అమెరికాలో అధిక వడ్డీ రేట్ల వాతావరణం డాలర్‌కు మద్దతునివ్వడంతో విదేశీ కరెన్సీలపై ఒత్తిడి కొనసాగింది.సెన్సెక్స్ 21.86 పాయింట్లు తగ్గి 74,314.59 వద్ద ముగిస్తే నిఫ్టీ 50 సూచీ 53 పాయింట్లు లాభపడి 23,270.60 వద్ద స్థిరపడింది. నిఫ్టీలో భారత్ ఎలక్ట్రానిక్స్ 2.51 శాతం, టాటా స్టీల్ 2.34 శాతం, ఎటర్నల్ 1.69 శాతం చొప్పున లాభపడి ప్రధాన షేర్లుగా నిలిచాయి. ముడి చమురు ధరలు మార్కెట్లకు కొంత ఉపశమనాన్ని అందించాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 104 డాలర్ల దిగువకు జారింది. ఇదే సమయంలో నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ రూ.22,561.5 కోట్ల ఐపిఒ గురువారం సబ్‌స్క్రిప్షన్‌కు ప్రారంభమైంది. ఈ ఇష్యూ పూర్తిగా ప్రస్తుత వాటాదారుల ఆఫర్ ఫర్ సేల్ ద్వారా జరుగుతోంది. ఒక్కో షేరుకు ధరల శ్రేణిని రూ.1,700 1,785గా నిర్ణయించారు. ఐపిఒ సెప్టెంబర్ 21, 2026 వరకు కొనసాగనుంది. బిఎస్ఇ 150 మిడ్‌క్యాప్ సూచీ 0.07 శాతం లాభపడగా, బిఎస్ఇ250 స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.13 శాతం నష్టపోయింది. బిఎస్ఇలో మొత్తం 2,686 షేర్లు లాభాల్లో, 1,642 షేర్లు నష్టాల్లో ముగిశాయి. మరో 217 షేర్లలో ఎలాంటి మార్పు కనిపించలేదు. నవంబర్ సెటిల్‌మెంట్‌కు సంబంధించిన బ్రెంట్ క్రూడ్‌ధర 2.34 డాలరు తగ్గి బ్యారెల్‌కు 103.49 డాలర్లకు చేరింది. అమెరికా 10 యేళ్ల ట్రెజరీ బాండ్ యీల్డ్ 0.38 శాతం తగ్గి 4.985 శాతానికి చేరింది.భారత్ 10 ఏళ్ల బెంచ్‌మార్క్ ప్రభుత్వ బాండ్ యీల్డ్ గత సెషన్ ముగింపు 7.055 శాతంతో పోలిస్తే 0.13 శాతం పెరిగి 7.064 శాతానికి చేరింది. రూపాయి గత సెషన్ ముగింపు 95.9100తో పోలిస్తే స్వల్ప మార్పుతో 95.9300 వద్ద కొనసాగింది.2026 అక్టోబర్ 5 సెటిల్‌మెంట్‌కు సంబంధించిన ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ 0.49 శాతం తగ్గి 10గ్రాములకు రూ.1,51,724 వద్ద నమోదైంది. పవర్ ఎలక్ట్రానిక్స్ 10.70 శాతం దూసుకెళ్లింది.ఎమామి 2.33 శాతం పెరిగి రూ.377.90కి చేరింది. టాటా మోటార్స్ 2.88 శాతం లాభపడింది.ప్రెసిషన్ వైర్స్ ఇండియా 2.57 శాతం పెరిగింది. నియోజెన్ కెమికల్స్ 3.37 శాతం దూసుకెళ్లింది. మిడ్‌క్యాప్ విభాగంలో సిర్మా ఎస్‌జిఎస్ టెక్నాలజీ 6.94 శాతం లాభంతో అగ్రస్థానంలో నిలిచింది.

Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.